Pubilshed from **Vijayawada**

PRGI NO : APTEL/2011/41440

ప్రజాభూమి

ఇది ప్రజల వెలుగు

Prajabhoomi Telugu Daily

www.prajabhoomi.com



విజయవాడ Vijayawada	సంపుటి : 15	సంచిక : 187	ఆదివారం	నవంబర్ 1, 2026	ఎడిటర్ : రామమోహన్ రెడ్డి అంకిరెడ్డిపల్లి	పేజీలు : 12	వెల : 3 రూ
	Vol.No : 15	Issue No :187	Sunday	1 November 2026	Editor : Ankireddypalle Ramamohan Reddy	Pages 12	Rs 3/-

Published From : Vijayawada, Anathapuramu, Eluru, Kadapa, Kakiknada, Tirupathi Circulated at Andharapradesh & Telangana



మరో తుపాను దృష్ట్యా ముందస్తు చర్యలు

» నవంబరు 3, 4 తేదీల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలకు ఆస్కారం » విద్యుత్, మొబైల్ నెట్‌వర్క్‌కు అంతరాయం లేకుండా తగిన జాగ్రత్తలు » తుఫాను వల్ల పడిపోయిన కొబ్బరి, అరటి రైతులకు తగిన నష్ట పరిహారం » రియల్ టైమ్ గవర్నెన్స్ నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష

ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి:
అర్నబ్ తుపాను నష్టాల నుంచి రాష్ట్రాన్ని సాధారణ స్థితికి తీసుకొచ్చే పునరుద్ధరణ పనులను వేగవంతం చేయడంతో పాటు, మరో తుపాను ముప్పును ఎదుర్కొనేందుకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం రేపటికి తుపానుగా బలపడే అవకాశాలున్నాయని, నవంబర్ 2, 3, 4 తేదీల్లో దక్షిణ కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో మోస్తరు

2 లో

ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి

ప్రతి ఓటరు స్వేచ్ఛగా, ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకునేలా పటిష్ట చర్యలు

» ఎన్నికల నిర్వహణపై గత మూడు, నాలుగు నెలలుగా విస్తృత స్థాయిలో సమీక్షలు, సమన్వయ సమావేశాలు

» సీసీటీవీ, వెబ్‌కాస్టింగ్, పోలీస్ బందోబస్తుతో పటిష్ట భద్రతా ఏర్పాట్లు

» రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా

ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ :
రాష్ట్రంలో పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంతంగా, స్వేచ్ఛగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా తెలిపారు. ప్రతి ఓటరు ఎలాంటి భయం, ఒత్తిడికి తావులేకుండా తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునే వాతావరణాన్ని కల్పించడమే రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.శనివారం విజయవాడలోని ఆర్ అండ్ బీ భవన్ లో గల రాష్ట్ర ఎన్నికల కమిషనర్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ ఆయన వివరాలు వెల్లడించారు.

- మిగతా 5లో..





నిజమైన ఓటర్ల కోసం పోరాడుతున్నాం

కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే

న్యూఢిల్లీ : ఇండియా బ్లాక్ 'చొరబాటుదారులను' కాపాడటానికి కాకుండా నిజమైన ఓటర్ల కోసమే పోరాడుతోందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే పేర్కొన్నారు. న్యూఢిల్లీలోని రాజాజీ మార్గ్‌లో ఉన్న ఖర్గే నివాసంలో, మాజీ లోక్‌సభ స్పీకర్ మీరా కుమార్ అధ్యక్షతన, ఇండియా బ్లాక్ 'బహిరంగ అభిశంసన' కార్యక్రమం శనివారం ప్రారంభమైంది. సిఇసి జ్ఞానేశ్ కుమార్‌పై ఇండియా బ్లాక్ చేపట్టిన ఈ ప్రతీకాత్మక బహిరంగ అభిశంసన కార్యక్రమంలోఖర్గే మాట్లాడారు. ఇండియా బ్లాక్ 'చొరబాటుదారులను' కాపాడటానికి కాకుండా నిజమైన ఓటర్ల కోసమే పోరాడుతోందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఇసిపై ఆరు అభియోగాలను ప్రదర్శించారు. సిఇసి జ్ఞానేశ్ కుమార్ ఓట్లను దొంగిలించడానికి కుట్ర పన్నారని, 13.2 కోట్ల ఓటర్లను తొలగించారని, పార్లమెంటు ప్రమేయం

- మిగతా 2లో..



ముఖ్యమంత్రి సహాయ నిధికి ఎస్‌బీఐ రూ.5 కోట్ల విరాళం


ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి:
అర్నబ్ తుఫాన్‌తో తీవ్రంగా నష్టపోయిన ఆంధ్రప్రదేశ్‌కు తమవంతు సాయం అందించేందుకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ముందుకొచ్చింది. - మిగతా 2లో..



తేనిజిల్లా జైలు ఘటనపై సిఎం
విజయం ఆగ్రహం

చెన్నై : తమిళనాడులోని తేని జిల్లా సబ్‌జైలు నుండి ఖైదీలు పారిపోయిన ఘటనపై సిఎం విజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. - మిగతా 2లో..

స్కూల్‌లో దారుణం..



» పదో తరగతి విద్యార్థినిపై ఎలక్ట్రిక్ రంపంతో పాశవిక దాడి!
» రాప్తాడు మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో ఘటన
» పదో తరగతి విద్యార్థినిపై రంపంతో దాడి
» బాలిక ముఖం, తల, వీపుపై తీవ్ర గాయాలు
» అడ్డుకునేందుకు వెళ్లిన మరో విద్యార్థినికి గాయాలు
» బాలికను ఆసుపత్రికి తరలించి చికిత్స

ప్రజాభూమి ప్రతినిధి, అనంతపురం : అనంతపురం జిల్లాలోని రాప్తాడు మండలంలో దారుణ ఘటన చోటుచేసుకుంది. ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థినిపై ఓ వ్యక్తి చెట్లను కోసే ఎలక్ట్రిక్ రంపంతో దాడి చేశాడు. ఈ ఘటనలో బాలిక ముఖం, తల, వీపు భాగాల్లో చాలా తీవ్రమైన గాయాలయ్యాయి. ఆమెను చికిత్స కోసం సమీప ఆసుపత్రికి తరలించారు.పాఠశాలలోకి వచ్చిన నిందితుడు విద్యార్థినిపై ఒక్కసారిగా దాడికి పాల్పడినట్లు సమాచారం. ఆమెపై దాడిని అడ్డుకునేందుకు ప్రయత్నించిన మరో విద్యార్థిని కూడా గాయపడింది.

2 లో

రాప్తాడులో విద్యార్థినిపై అమానుషదాడిపై సీఎం చంద్రబాబు తీవ్ర ఆవేదన

ఉన్మాదిపై కఠిన చర్యలకు ముఖ్యమంత్రి ఆదేశాలు

ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి: అనంతపురం జిల్లా రాప్తాడులోని జిల్లా పరిషత్ హై స్కూలులో పదో తరగతి చదువుతున్న విద్యార్థినిపై ఉన్మాది దాడి చేసిన ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.



యలహంక ప్యాలెస్ నాదే

» వైఎస్ షర్మిల

ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి: ఎపిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిలా తన కుమార్తె అంజలి వివాహ వేదిక మార్పునకు సంబంధించి ఎక్స్ (ట్విట్టర్) వేదికగా కీలక ప్రకటన చేశారు. యలహంకలోని ప్రాపర్టీ అంశంపై, కుమార్తె పెళ్లి వేదిక మార్పు వెనుక ఉన్న కారణాలను వివరిస్తూ ఆమె భావోద్వేగానికి లోనయ్యారు. - మిగతా 2లో..

మనమిత్ర ఆలోచన అద్భుతం



తుపాన్ సమయంలో ప్రజల నుంచి సమస్యలు స్వీకరించడం బాగుంది

» ఆర్టీజీఎస్ నుంచి విపత్తుల నిర్వహణ విధానం భేష్
» ఏపీ చొవర మిగిలిన రాష్ట్రాలకూ ఆదర్శం కావాలి
» కేంద్ర బృందానికి ఆర్టీజీఎస్ అధికారుల పవర్‌పాయింట్ ప్రజంటేషన్
» మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ఒక వినూత్న ఆలోచన
» ఈ విధానాన్ని అన్ని రాష్ట్రాలు అనుసరించేలా సిఫారసు చేయమని కేంద్రానికి నివేదిస్తాం.
» కేంద్ర హోం మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి చిత్తరంజన్ దాస్,

2 లో

ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి:
అర్నబ్ తుపాన్ కలిగించిన నష్టాన్ని అంచనా వేయడానికి కేంద్ర ప్రభుత్వ పరిశీలనా బృందం రాష్ట్రానికి వచ్చింది. ఇందులో భాగంగా శనివారం ఈ బృందం సచివాలయంలోని రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్టీజీఎస్) కేంద్రాన్ని సందర్శించింది. ఆర్టీజీ కార్యదర్శి కాటంనేని భాస్కర్, ఆర్టీజీఎస్ సీఈఓ ప్రఖర్ జైన్ లు ఈ బృందానికి స్వాగతం పలికారు. - మిగతా 2లో..

నేడు నగర పాలక సంస్థ ఎన్నికలు

» పారిన నోట్ల ప్రవాహం.. » ఓటుకు రెండు వేలు?



ప్రజాభూమి, కృష్ణా బ్యూరో :
నవంబర్ ఒకటవ తేదీ ఆదివారం మచిలీపట్నం నగర పాలక సంస్థకు ఎన్నికలు జరగనున్నాయి. శుక్రవారం సాయంత్రానికి ఎన్నికల ప్రచారం ముగిసింది. గత పది రోజుల నుంచి నగరంలో వినిపించిన మైకుల హోరు సద్దుమణిగింది. ప్రశాంతం.. ప్రశాంతం.. శుక్రవారం ఎన్నికల ప్రచారం ముగియడంతో అదిగో అప్పుడు మొదలయింది నగరంలో డబ్బులు పంపకాలు.. ఆయా పార్టీలకు నమ్మకమైన పలువురు వ్యక్తులు నగరంలో వున్న 60 డివిజన్లలోని ప్రతి ఇంటికీ తిరిగి ఓటర్ల లిస్టులతోపాటు ఒక్కో ఇంటిలో ఎంతమంది ఓటర్లు ఉన్నారో తెలుసుకున్నారు. మేయర్ అభ్యర్థి ఓటుకు వెయ్యి రూపాయలు, కార్పొరేటర్ గా పోటీ చేసే అభ్యర్థి ఓటుకు ఐదు వందల రూపాయలు చొప్పున మొత్తం ఒక్కో పార్టీ తరపున పదిహేను వందల రూపాయలు ఇచ్చేలా ప్లాన్ చేశారని తెలిసింది.

- మిగతా 2లో..

కులమా... కూటమి బలమా...!

» ఓటరన్న ఏ వైపు మొగ్గు చూపుతారో... ?
» దశాబ్దాల చరిత్ర తిరగబడ నుందా..తిరగబడుతుందా..
» మచిలీపట్నంలో మెజారిటీ ఏ పార్టీకి...



ప్రజాభూమి, కృష్ణాబ్యూరో : మచిలీపట్నం నగర పాలక సంస్థకు ఆదివారం జరిగే ఎన్నికలు కూటమి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలకు ఎంతో ప్రతిష్టాత్మకమైనవి. గెలుపు ఇరు వర్గాలకూ ఎంతో అవసరం. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత జరుగుతున్న ఎన్నికలు కూటమి ప్రభుత్వానికి ముఖ్యమైనవి. ఒక విధంగా ఈ ఎన్నికలు కూటమి ప్రభుత్వ పని తీరుకు దర్పణంపడతాయి.

2 లో

ప్రజాభూమి
ఆదివారం, నవంబర్ 1, 2026
2

మరో తుపాను దృష్ట్యా ముందస్తు చర్యలు

నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు వివరించారు. సచివాలయంలోని రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ నుంచి రాష్ట్రంలో ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, అర్నబ్ తుపాను విధ్వంసం అనంతరం చేపడుతున్న పునరుద్ధరణ పనులపై సీఎం ఉన్నతాధికారులతో సమీక్షించారు. ప్రస్తుతం ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం గమనాన్ని ఉపగ్రహ చిత్రాలు, డాప్లర్ రాడార్ల ద్వారా ప్రతి ఆరు గంటలకు ఓసారి అంచనా వేస్తూ ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. సమర్థ నీటి నిర్వహణ ద్వారా వర్షపు నీటిని సద్వినియోగం చేసుకునేందుకు ఉన్న అవకాశాలను కూడా గుర్తించి తగిన ప్రణాళిక చేయాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు.

మొబైల్ నెట్వర్క్‌కు అంతరాయం లేకుండా ప్రణాళిక

విద్యుత్ అంతరాయం ఏర్పడినా మొబైల్ నెట్‌వర్క్ పనిచేసేలా అన్ని మండల కేంద్రాల్లో డీజిల్ జనరేటర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. రాష్ట్రంలోని బీఎస్ఎన్ఎల్ 4,500 టవర్లతో పాటు ఇతర టెలికాం నెట్‌వర్క్‌లకు నిరంతర విద్యుత్ అందించే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ అవకాశాలను కూడా పరిశీలించాలని చెప్పారు. అర్నబ్ తుపాను ప్రభావిత ప్రాంతాల్లో 7 వేల మంది సిబ్బంది, 400 యంత్రాలతో విద్యుత్ పునరుద్ధరణ పనులు యుద్ధ ప్రాతిపదికన జరుగుతున్నాయని అధికారులు తెలిపారు. వీటిని వేగంగా పూర్తి చేసి అన్ని గృహాలకు విద్యుత్ సరఫరా అందించాలని సీఎం ఆదేశించారు. తుఫాను సమయంలో దెబ్బతిన్న రోడ్లను యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరించాలని సీఎం ఆదేశించారు. కాకినాడ వద్ద ప్రొటెక్షన్ వాల్‌ను పునరుద్ధరించాలన్నారు. నరసాపురం, కాట్రేనికోన ప్రాంతాల్లో కాలువల పూడిక తొలగించాలని సూచించారు. కోనసీమ, పశ్చిమగోదావరి జిల్లాల్లో నీరు దిగువ ప్రాంతాలకు సజావుగా వెళ్లేలా డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపరచాలన్నారు. భవిష్యత్తులో రోడ్లు, కాలువలు ముంపునకు గురికాకుండా ప్రత్యేక ఎస్ఓపీ రూపొందించాలని ఆదేశించారు.

ప్రతి రైతుకూ పంటల బీమా భరోసా

ప్రకృతి విపత్తుల నుంచి రైతులను ఆదుకునేందుకు ఇన్‌పుట్ సబ్సిడీతో పాటు పంటల బీమాపై విస్తృత అవగాహన కల్పించాలని సీఎం సూచించారు. వచ్చే సీజన్ నుంచి ప్రతి రైతు బీమా పరిధిలోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. 47 లక్షల మంది రైతులకు చేరువయ్యేందుకు యాప్‌ను వినియోగించుకోవాలని, ప్రకృతి వ్యవసాయంపై చైతన్యం కల్పించాలని చెప్పారు. సాంకేతికతను వినియోగిస్తున్న చాంపియన్ రైతులను గుర్తించాలని సూచించారు. అర్నబ్ తుపాను వల్ల కొబ్బరి, అరటి పంటలకు జరిగిన నష్టంపై ముఖ్యమంత్రి సమీక్షించారు. కొబ్బరి పంట దెబ్బతిన్న 1,293 హెక్టార్లకు హెక్టారుకు రూ.54 వేల చొప్పున, నేల కొరిగిన, తలలు దెబ్బతిన్న ఒక్కో కొబ్బరి చెట్టుకు రూ.1,500 చొప్పున పరిహారం అందించాలని ఆదేశించారు. సుమారు 1.95 లక్షల కొబ్బరి చెట్లు దెబ్బతిన్నట్లు అధికారులు వివరించారు. అలాగే 15 వేల హెక్టార్లలో దెబ్బతిన్న అరటి పంటకు హెక్టారుకు రూ.35 వేల చొప్పున పరిహారం అందిస్తున్నట్లు తెలిపారు. ఈ సమీక్షలో ఐటీ, ఆర్టీజీఎస్ కార్యదర్శి కాటమనేని భాస్కర్, విద్యుత్, విపత్తుల నిర్వహణ శాఖల ఉన్నతాధికారులు, వివిధ టెలికాం సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధికి ఎస్‌బీఐ రూ.5 కోట్ల విరాళం

ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.5 కోట్ల 1 లక్ష రూపాయల విరాళాన్ని అందించింది. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబును క్యాంపు కార్యాలయంలో కలిసి ఎస్‌బీఐ మేనేజింగ్ డైరెక్టర్ అమర రామ్మోహన్ రావు, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రతినిధి బృందం చెక్కును అందజేశారు. తుఫాన్ బాధితులను ఆదుకునేందుకు ఉదారంగా విరాళం అందించిన ఎస్‌బీఐ మేనేజ్మెంట్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు కృతజ్ఞతలు తెలిపారు. సీఎంను కలిసిన వారిలో ఎస్‌బీఐ అమరావతి సర్కిల్ సీజీఎం సుశీల్ కుమార్, అమరావతి సర్కిల్ జీఎం కుందన్ జ్యోతి, అమరావతి సర్కిల్ ఏజీఎం షేక్ షమీన్ భాను ఉన్నారు.

తేనిజిల్లా జైలు ఘటనపై సిఎం విజయం ఆగ్రహం

విధినిర్వహణలో నిర్లక్ష్యం వహించినందుకు తెక్కంపట్టి డిప్యూటీ జైలు సూపరింటెండెంట్‌ను సస్పెండ్ చేయాలని శనివారం ఆదేశించారు. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు డిప్యూటీ జైలు సూపరింటెండెంట్ (ఇన్‌చార్జ్)ఎన్.రామలింగంను తక్ష?ణమే సస్పెండ్ చేయాలని ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా జైళ్లలో భారీగా బదిలీలు చేపట్టనున్నట్లు ప్రకటించారు. భద్రతా లోపాలకు కారణమైన ఇతర అధికారులపై కఠినమైన క్రమశిక్ష?ణా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈనెల 26న తేనిజిల్లా తెక్కంపట్టి జైలు నుండి సినీఫక్కీలో 17మంది ఖైదీలు పారిపోయిన సంగతి తెలిసిందే. అనంతరం ఖైదీలందిరినీ అదుపులోకి తీసుకున్నారు.?

యలహంక ప్యాలెస్ నాదే

ఇంకొకరి దానికోసం ఆశపడే నీచత్వం తనది కాదని షర్మిల అన్నారు. 'ప్యాలెస్‌పై పూర్తి హక్కులు నావే' – వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత.. అప్పటి వరకు ఉమ్మడి ఆస్తిగా ఉన్న యలహంక ప్రాపర్టీ.. ఆస్తుల పంపకాల్లో భాగంగా పూర్తిగా 100 శాతం హక్కులు తనకు, తన పిల్లలకు సంక్రమించాయని షర్మిల స్పష్టం చేశారు. ఇది దేవుడి సాక్షిగా నిజమని పేర్కొన్నా. 'అది నా పిల్లల చట్టబద్ధమైన హక్కు మాత్రమే కాకుండా స్వర్గీయ నాన్న వైఎస్సార్ గారు తిరిగిన ఇల్లు' అని స్పష్టం చేశారు. తెలుగువారి సంప్రదాయంలో సొంత ఇంట్లో బిడ్డ పెళ్లి చేయడం ఏ తల్లిదండ్రులకైనా ఒక పెద్ద అదృష్టమని షర్మిల పేర్కొన్నారు. 'తాను పెరిగిన యలహంక ఇంట్లోనే తన వివాహం జరగాలని నా కుమార్తె అంజిలి కోరుకుంది. అయితే అక్కడ వివాహం జరిపించలేకపోతున్నామని, బిడ్డ ఆశను నెరవేర్చలేకపోయామనే బాధ నన్ను ఎంతగానో తొలిచేస్తోంది. వివాహ వేదిక విషయమై జరుగుతున్న పరిణామాలను చూసి నా బిడ్డ కోసం బాధపడిన ప్రతి ఒక్కరికీ మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలుపుతున్నాను' అని షర్మిల ఆవేదన వ్యక్తం చేశారు. వివాదాలకు దూరంగా వేరే చోట వివాహం .... తన కూతురిది పెద్దలు కుదిర్చిన సంబంధమని, ఎలాంటి వివాదాలు, గొడవలు లేకుండా ప్రశాంతమైన వాతావరణంలో జరిపించాల్సిన బాధ్యత తల్లిదండ్రులుగా తమపై ఉందని షర్మిల తెలిపారు. అందుకే వైఎస్ అంజిలి రెడ్డి -- సోమల రఘురామ్ రెడ్డిల పరిణయ వేడుకను యలహంక ఇంట్లో కాకుండా వేరే ప్రదేశంలో బంధుమిత్రులు, ఆత్మీయుల సమక్షంలో ఘనంగా నిర్వహించాలని నిశ్చయించుకున్నట్లు ప్రకటించారు. కాబోయే నవదంపతులపై తెలుగు ప్రజల ఆశీస్సులు, దీవెనలు ఎల్లప్పుడూ ఉండాలని ఆమె ఆకాంక్షించారు.

రూ.20 లక్షల కారుకు రూ.61 లక్షల రిపేర్ బిల్లు.. బెంబేలెత్తిన టెక్కీ!

బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌కు వింత అనుభవం

రూ.20 లక్షలకు సెకండ్ హ్యాండ్ మెర్సిడెస్ కారు కొన్న టెక్కీ

భారీ వర్షంలో అదుపుతప్పి ప్రమాదానికి గురైన వాహనం

రూ.61 లక్షల రిపేర్ బిల్లు

టోటల్ లాస్‌గా ప్రకటించిన ఇన్సూరెన్స్ కంపెనీ

లగ్జరీ కార్ల నిర్వహణ ఖర్చులపై చర్చకు దారితీసిన ఘటన



బెంగళూరు : లగ్జరీ కార్లు కొంటే ఆ హోదానే వేరు. కానీ, వాటి నిర్వహణ, రిపేర్ల ఖర్చు తడిసి మోపెడవుతుందని చెప్పడానికి ఈ ఘటనే పెద్ద ఉదాహరణ. బెంగళూరుకు చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ సుమారు రూ.20 లక్షలకు కొనుగోలు చేసిన సెకండ్ హ్యాండ్ మెర్సిడెస్ బెంజ్ కారుకు యాక్సిడెంట్ అవ్వగా, అధికారిక సర్వీస్ సెంటర్ ఇచ్చిన రిపేర్ అంచనా బిల్లు చూసి కళ్లు తేలేశాడు. ఏకంగా రూ.61.7 లక్షలు బిల్లు వేయడంతో ఈ విషయం ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

వివరాల్లోకి వెళితే.. బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న ఆడమ్ రిజ్క్ ఇటీవల తాను వాడిన మెర్సిడెస్ బెంజ్ కారులో ప్రయాణిస్తుండగా భారీ వర్షం పడింది. ఈ క్రమంలో హైవేపై వేగంగా వెళ్తుండగా, కారు అదుపుతప్పి (హైడ్రోప్లేనింగ్) డివైడర్‌ను ఢీకొని రోడ్డుకు అవతలి వైపుకు దూసుకెళ్లింది. ప్రమాద తీవ్రతకు కారులోని ఎయిర్‌బ్యాగ్‌లు తెరుచుకోవడంతో రిజ్క్‌కు ఎలాంటి గాయాలు కాలేదు.

అనంతరం, అతను కారును రిపేర్ కోసం మెర్సిడెస్ బెంజ్ అధికారిక సర్వీస్ సెంటర్‌కు తరలించాడు. కారును పరిశీలించిన సర్వీస్ సెంటర్ ప్రతినిధులు రిపేర్ కోసం వేసిన అంచనా బిల్లు చూసి రిజ్క్ నివ్వెరపోయాడు. విడిభాగాలకు రూ.47.77 లక్షలు, లేబర్ ఛార్జీలకు రూ.4.53 లక్షలు, జీఎస్టీ కింద రూ.9.41 లక్షలతో కలిపి మొత్తం బిల్లు రూ.61,70,077గా తేల్చారు. కేవలం విడిభాగాల జాబితానే 13 పేజీలు ఉండటం గమనార్హం. రిపేర్ ఖర్చు ఎక్కువగా ఉంటుందని ఊహించినా, కారు కొన్న ధర కంటే మూడు రెట్లు అధికంగా బిల్లు వస్తుందని అస్సలు ఊహించలేదని రిజ్క్ తన ఎక్స్ ఖాతాలో వాపోయాడు.

ఈ భారీ బిల్లుతో ఇన్సూరెన్స్ కంపెనీ కారును "టోటల్ లాస్" కింద ప్రకటించింది. అంటే, కారు విలువ కంటే రిపేర్ విలువే ఎక్కువగా ఉందని నిర్ధారించి, రిపేర్‌కు నిధులు ఇవ్వడానికి నిరాకరించింది. రిజ్క్ బేసిక్ ఇన్సూరెన్స్ పాలసీని కలిగి ఉండటంతో, అతనికి నష్టపరిహారంగా కేవలం రూ.16 లక్షలు మాత్రమే అందనుంది. ఈ ఘటన సెకండ్ హ్యాండ్ లగ్జరీ కార్లు కొనేముందు వాటి నిర్వహణ, ప్రమాదానంతర ఖర్చుల గురించి ఎంత జాగ్రత్తగా ఉండాలో తెలియజేస్తోందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

నేడు నగర పాలక సంస్థ ఎన్నికలు

మొదటి పేజీ తరువాయి

అయితే ఒక్కో డివిజన్‌లో రెండువేలకు పైగా ఓటర్లు వుంటే దాదాపు పదిహేను వందల మందిలో ఒక్కో ఓటరుకు మేయర్ అభ్యర్థి ఇచ్చిన వెయ్యి రూపాయలు పంచినట్లు గుసగుసలు. బలమైన కూటమికి చెందిన వారు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన వారు కూడా డబ్బులు భారీగా పంచినట్లు తెలిసింది. రెండు పార్టీలకు చెందిన వారు ప్రతి ఓటరు వున్న ఒక్కో ఇంటికి డబ్బు ఇచ్చినట్లు ప్రచారం జరిగింది. శనివారం మధ్యాహ్నం నుంచి పోటీలో వున్న అభ్యర్థుల అనుచరులు పంధాను మార్చినట్లు తెలిసింది. మేయర్ అభ్యర్థి ఇచ్చిన వెయ్యి రూపాయలు, కార్పొరేటర్‌గా పోటీ చేస్తున్న అభ్యర్థి ఐదువందలు, లేదా వెయ్యి రూపాయలు చొప్పున ఒక్కో ఓటరుకు పదిహేను వందలు పంపిణీ చేసినట్లు ప్రచారం జరిగింది.నగరంలోని పలు డివిజన్లలో విజయం సాధించవలసిన ముఖ్యమైన అభ్యర్థులు ఇటు కూటమిలోనూ, అటు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోనూ వున్నందున, అటువంటి డివిజన్‌లో రెండువేల రూపాయలు కూడా పంచినట్లు తెలిసింది. రెండు పార్టీల దగ్గర నుంచి డబ్బు తీసుకున్న వారు తమ ఓట్లును ఎవరికి వేస్తారోనన్నది దేవరహస్యం! ఓట్ల కోసం డబ్బు పంపకాలు శనివారం అర్ధరాత్రి వరకూ జరుగుతుందని తెలుస్తున్నది.ఓట్ల కొనుగోలును ఎవరూ ఆపలేకపోయారు. అందుకు తగిన యంత్రాంగం లేకపోవడంవల్ల పోటీ చేసిన వారు ఎటువంటి భయం లేకుండా ఓట్లకు నోట్లు పంచారు! జయహో ప్రజాస్వామ్యం!

మనమిత్ర ఆలోచన అద్భుతం

అర్నబ్ తుపాన్ వల్ల రాష్ట్రానికి జరిగిన నష్టం గురించి కేంద్ర బృందానికి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి చిత్తరంజన్ దాస్ నేతృత్వంలో ఏడుగురు సభ్యులతో కూడిన బృందం రాష్ట్రానికి వచ్చింది. ఈ సందర్భంగా ఆర్టీజీఎస్ అధికారులు తుపాన్ సమయంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ముందస్తు సన్నద్ధత చర్యల గురించి కేంద్ర బృందానికి వివరించారు.

ప్రాణనష్టం తగ్గించగలిగాం : అర్నబ్ గురించి ఆరు రోజుల ముందు నుంచే ప్రజలను నిరంతరం అప్రమత్తం చేశాం, ఆర్టీజీఎస్ నుంచి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్‌డీఎంఏ) నుంచి ప్రజలకు నిరంతరం తుపాన్ హెచ్చరికలు జారీ చేశామని ఆర్టీజీఎస్ అధికారులు తెలిపారు. 7.23 కోట్ల మంది మొబైల్ వినియోగదారులకు నిరంతరం తుపాన్‌కు సంబంధించి హెచ్చరికలు జారీ చేశాం. తుపాన్ తీరం దాటే సమయంలో ప్రజలు ఎవ్వరూ కూడా తమ ఇళ్ల నుంచి బయటకు రాకుండా చేయడంతో పాటు రహదారులపై వాహనాల రాకపోకలను నిలిపేశాం, తద్వారా ప్రాణ నష్టం పెద్దగా వాటిల్లకుండా చేయగలిగాం. తుపాన్ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి వివిధశాఖల మధ్య సమన్వయంతో పనిచేసేలా ఆర్టీజీఎస్ నుంచి పర్యవేక్షించాం. వివిధ శాఖలు తుపాను సహాయ చర్యలు చేపట్టడానికి జిల్లా, మండల స్థాయిలో 3,455 కంట్రోలు రూములు ఏర్పాటు చేసుకున్నాయి, 3,918 నోడల్ అధికారులను నియమించాం. 2,199 తుపాన్ షెల్టర్లను 20 జిల్లాలో ఏర్పాటు చేశాం. 34,716 మందిని ఈ షెల్టర్లకు తరలించాం. సహాయక చర్యల కోసం 16 ఎన్డీఆర్ ఎఫ్, 11 ఎస్‌డీఆర్ ఎఫ్ బృందాలను 14 జిల్లాలకు తరలించాం, అత్యవసర వైద్య సేవల కోసం 1,355 అంబులెన్సు వాహనాలను సిద్ధం చేసి ఉంచాం, ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా 3,012 మంది గర్భిణిలను ఆసుపత్రులకు తరలించాం. తుపాన్ సమయంలో ప్రజలకు ఎక్కడైనా సమస్యలు ఎదురైతే అత్యవసర సాయం కోసం మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ఆ సమస్యలను ప్రభుత్వానికి షేర్ చేసే సదుపాయం కల్పించాం. వచ్చిన సమస్యలను వచ్చినట్లే పరిష్కరించాం. మనమిత్ర ద్వారా వచ్చిన అర్నబ్ తుపాన్ సంబంధిత సమస్యల్లో 95 శాతానికిపైగా పరిష్కరించగలిగాం. మత్స్యకారులెవ్వరూ కూడా చేపల వేట కోసం సముద్రంలోకి వెళ్లకుండా ముందస్తుగానే నిలువరించగలిగాం. మత్స్యకారులకు చెందిన 30,043 ఫిషింగ్ బోట్లు రేవులకే పరిమితమయ్యేలా చేశామని ఆర్టీజీఎస్ అధికారులు నివేదించారు.

రూ.4,764 కోట్ల నష్టం : అర్నబ్ తుపాన్ వల్ల రాష్ట్రంలో రూ.4,764 కోట్ల మేర నష్టం వాటిల్లిందని ప్రాథమికంగా అంచనా వేసినట్లు అధికారులు కేంద్ర బృందానికి తెలిపారు. 4.63 లక్షల మంది రైతులకు చెందిన 3.52 లక్షల హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయి. 23,383 హెక్టార్లలో ఉద్యానవన పంటలు దెబ్బతిన్నాయి. 2,491 కిలోమీటర్ల మేర రాష్ట్ర ప్రధాన రహదార్లు దెబ్బతిన్నాయని అధికారులు చెప్పారు. 7,382 ఇళ్లు దెబ్బతిన్నాయి. 12 జిల్లాల్లో తుపాన్ వల్ల నష్టం వాటిల్లిందని అయితే కోనసీమ, పశ్చిమ గోదావరి జిల్లాలు దారుణంగా దెబ్బతిన్నాయని చెప్పారు. విద్యుత్తు రంగానికి భారీగా నష్టం వాటిల్లిందని చెప్పారు.

మనమిత్ర ఆలోచన అద్భుతం : తుపాన్ ప్రభావిత ప్రాంతాల్లో మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ప్రజల నుంచి సమస్యలను స్వీకరించి వాటిని ఎప్పటికప్పుడు పరిష్కరించిన విధానం కేంద్ర బృందాన్ని అమితంగా ఆకట్టుకుంది. ఈ ఆలోచన అద్భుతమని, దీనివల్ల ప్రజలు సులభంగా వాట్సాప్ ద్వారా తమ సమస్యలు ప్రభుత్వానికి చేరవేయడానికి వీలైందని, ఈ తరహా విధానం ఇతర రాష్ట్రాలకు ఆదర్శప్రాయమని, అందరూ మనమిత్ర లాంటి సదుపాయాన్ని తమ రాష్ట్రాల్లో ఏర్పాటు చేసుకునేలా సిఫారసు చేయమని కేంద్రానికి నివేదిస్తామని కేంద్ర బృందం తెలిపింది. రిలయ్ టైమ్ గవర్నెన్స్ ద్వారా విపత్తుల నిర్వహణ రియల్ టైమ్‌లో పర్యవేక్షించిన విధానాన్ని కూడా కేంద్ర బృందం ప్రశంసించింది. అర్నబ్ తుపాన్ నష్టంపై ఆర్టీజీఎస్ అధికారులు ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజంటేషన్ పట్ల కేంద్ర బృందం సంతృప్తిని వ్యక్తం చేసింది. కేంద్రం నుంచి తగినంత సాయం రాష్ట్రానికి అందేలా తమ వంతు కృషి చేస్తామని చిత్తరంజన్ దాస్ తెలిపారు. విపత్తు నుంచి బయటపడేలా ఏపీకి తక్షణ సాయం అందించేలా కేంద్రానికి సిఫారసు చేస్తామన్నారు.

స్కూల్‌లో దారుణం..

మొదటి పేజీ తరువాయి

ఈ ఘటనతో పాఠశాలలోని విద్యార్థులు, ఉపాధ్యాయులు భయాందోళనకు గురయ్యారు.వెంటనే అప్రమత్తమైన ఉపాధ్యాయులు, విద్యార్థులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు. దాడికి గల కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది. నిందితుడి కోసం పోలీసులు గాలింపు చేపట్టారు. తీవ్రంగా గాయపడిన బాలికకు ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు.

స్కూల్‌లో కొన్ని మరమ్మతు పనులు జరుగుతున్నాయని హెడ్ మాస్టర్ తెలిపారు. నిందితుడు స్కూల్లోకి వస్తున్న సమయంలో ఉపాధ్యాయులు గమనించినప్పటికీ.. వర్కర్ అనుకున్నామని వెల్లడించారు. ఘటన జరిగినప్పుడు తరగతి గదిలో టీచర్ ఉన్నట్లు తెలిపారు. దాడి చేసిన వ్యక్తికి 25-30 ఏళ్ల వయసు ఉండొచ్చని అంచనా వేశారు. సరిగా గమనించే లోపే ఉన్మాది పారిపోయినట్లు పేర్కొన్నారు.కాగా, ధర్మవరం వైపు వెళుతుండగా ఆ ఉన్మాదిని అదుపులోకి తీసుకున్నట్టు తెలుస్తోంది. ఆ యువకుడు బాలికకు సమీప బంధువేనని స్థానికులు చెబుతున్నారు.

రాప్తాడులో విద్యార్థినిపై అమానుషదాడిపై సీఎం చంద్రబాబు తీవ్ర ఆవేదన

ఉన్మాదిపై కఠిన చర్యలకు ముఖ్యమంత్రి ఆదేశాలు

పాఠశాల తరగతి గదిలో రంపంతో అత్యంత అమానుషంగా దాడి చేయడంపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తీవ్ర గాయాల పాలైన విద్యార్థిని ఆరోగ్య పరిస్థితిని, అందుతున్న చికిత్స గురించి సిఎం అధికారులతో మాట్లాడారు. నిందితుడిని పట్టుకుని కఠినంగా శిక్షించాలని సీఎం పోలీసు అధికారులను ఆదేశించారు.

నిజమైన ఓటర్ల కోసం పోరాడుతున్నాం

లేకుండా ఫారం 6ను తిరిగి రాశారని, ఈసిఐనెట్ ద్వారా ఓటర్ల జాబితాను స్వాధీనం చేసుకున్నారని, ఇతర ఇద్దరు ఎన్నికల కమిషనర్లను పక్కన పెట్టారని, ప్రధాని మోడీ, అమిత్ షాల ఆదేశాల మేరకు పనిచేశారని పేర్కొన్నారు. సార్వత్రిక వయోజన ఓటు హక్కుకు హామీ ఇచ్చే రాజ్యాంగంలోని ఆర్టికల్ 326 తీవ్ర ముప్పులో ఉందని అన్నారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి) జ్ఞానేశ్ కుమార్ ప్రధాని మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలు " ప్రత్యక్ష ఆదేశాల" మేరకు ఎన్నికల కమిషన్‌ను నడుపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏడు నెలల క్రితం, 193 మంది ప్రతిపక్ష ఎంపీలు పార్లమెంటు ఉభయ సభలలో సిఇసిని తొలగించాలని ఒక తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. అయితే, తమ నోటీసులను తిరస్కరించారని, వాటిని పరిగణనలోకి తీసుకోలేదని అన్నారు. దీంతో ఈ రోజు తాము ప్రవేశపెట్టిన తీర్మానం ఒక రాజ్యాంగ సంస్థ గౌరవాన్ని కాపాడటమే లక్ష్యంగా పెట్టుకుందని అన్నారు. నవంబర్ 1న సెంట్రల్ ఢిల్లీలోని మింటో రోడ్-కన్నాట్ ప్లేస్ జంక్షన్ నుండి రామ్‌లీలా మైదాన్ వరకు ప్రతిపక్ష పార్టీలు 'చలో ఢిల్లీ' మార్చ్ చేపడతాయని లోక్‌సభ ప్రతిపక్ష? నేత రాహుల్‌గాంధీ అన్నారు. ఓట్ల చోరీకి వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించి, సిఇసి రాజీనామా చేయాలని ఇండియా బ్లాక్ డిమాండ్ చేస్తుందని తెలిపారు. నవంబర్ 1న జరిగే ర్యాలీకి ప్రజలు ఢిల్లీకి రాకుండా హోం మంత్రి అడ్డుకునేందుకు యత్నిస్తున్నారని రాహుల్‌గాంధీ మండిపడ్డారు.



కులమా...కూటమి బలమా...!

అధికారంలోకి వచ్చిన రెండు సంవత్సరాల తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతున్నాయి. సాధారణంగా ఇటువంటి ఎన్నికలు ఏ పార్టీ అధికారంలో వుంటే ఆ పార్టీకి ప్రజలు మొగ్గు చూపి గెలిపిస్తారు. ఇక మచిలీపట్నం నగర పాలక సంస్థకు జరుగుతున్న ఎన్నికలు శాసన సభకు జరుగుతున్న ఎన్నికల మాదిరిగా ప్రచారం జరిగింది. ఈ ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్ జరుగడానికి అవకాశాలున్నట్లుగా రాజకీయ పరిశీలకులు అంచనా వేస్తున్నారు. గత ఇరవై సంవత్సరాల నుంచి ఒక సామాజిక వర్గానికి చెందిన వారు మచిలీపట్నం చైర్మన్, మేయర్ పదవులు అధిష్టించాలని ఆశతో ఎదురుచూస్తూ వచ్చారు. ఈ ఎన్నికలు కూడా ఆ సామాజిక వర్గానికి నిరాశనే కలిగించాయి.! అయితే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మేయర్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న లంక జ్యోతి నగరంలో వున్న ఒక సామాజిక వర్గానికి చెందిన వారు గనుక, ఆ సామాజిక వర్గానికి చెందిన వారు పార్టీలతో సంబంధం లేకుండా లంక జ్యోతికి ఓట్లువేస్తే విజయం సాధించే అవకాశం వుంటుందా? అని వారిలో వారు సమీక్షించుకున్నారని తెలిసింది.(ఈ నేపథ్యంలో మచిలీపట్నం నగరంలో 1,39,246 మంది ఓటర్లు వున్నారు. ఇందులో కాపు సామాజిక వర్గానికి చెందిన ఓటర్లు దాదాపు 35 వేలు, మత్స్యకారులు 12 వేలు, వైశ్యులు 10 వేలు, బ్రాహ్మణులు 8 వేలు, యాదవులు 12 వేలు, గౌడ 10 వేలు, ముస్లింలు 12 వేలు, క్రిస్టియన్లు 10 వేలు, ఎస్టీలు 12 వేలు, ఇతరులు 18 వేలు వరకూ వుంటారని అంచనా. ఇవి ఉజ్జాయింపుగా వున్న ఓటర్ల వివరాలు మాత్రమే. ఇవి ఖచ్చితమైనవి కావు గానీ ప్రజల్లో వున్న అంచనా. అయితే, ఎట్టకేలకు భారీ మెజారిటీతో కూటమికి చెందిన మేయర్, ఎక్కువ మంది కార్పొరేటర్లు, మంచి మెజారిటీతో విజయం సాధించడానికి అవకాశాలు వున్నాయి. అధికారంలో కూటమి ప్రభుత్వం వుంది గనుక చంద్రబాబునాయుడు, లోకేష్, పవన్‌కల్యాణ్ సారథ్యంలో ప్రజల్లో వ్యతిరేకత లేదని ఒక సర్వే!

ప్రజాభూమి
ఎన్టీఆర్, కృష్ణా
ఆదివారం, నవంబర్ 01, 2026

కూటమి అభ్యర్థులకు సంపూర్ణ మద్దతు అందించాలి



❖ జనసేన పార్టీ మచిలీపట్నం పార్లమెంటు నియోజకవర్గ స్థానిక సంస్థల ఎన్నికల సమన్వయకర్త మండలి వెంకట్రామ్
❖ నాగాయలంక, భావదేవరపల్లిలో బీజేపీ అభ్యర్థి భోగాది రమాదేవితో కలిసి విస్తృత ప్రచారం

ప్రజాభూమి ప్రతినిధి అవనిగడ్డ/ నాగాయలంక

కూటమి అభ్యర్థులకు ఓటర్లు ప్రతి ఒక్కరూ సంపూర్ణ మద్దతు అందించాలని జనసేన పార్టీ మచిలీపట్నం పార్లమెంటు నియోజకవర్గ స్థానిక సంస్థల ఎన్నికల సమన్వయకర్త మండలి వెంకట్రామ్ కోరారు. శనివారం నాగాయలంక, భావదేవరపల్లి గ్రామాలలో కూటమి అభ్యర్థుల గెలుపు కోరుతూ విస్తృత ప్రచారం నిర్వహించారు. టీడీపీ, జనసేన బలపరిచిన బీజేపీ జడ్పీటీసీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బీజేపీ సీనియర్ నాయకురాలు భోగాది రమాదేవిని, టీడీపీ, జనసేన ఎంపీటీసీ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ కేంద్ర రక్షణ శాఖ సలహా దారు సతీష్ రెడ్డి సహకారంతో చేసిన ప్రత్యేక కృషి ఫలితంగా కేంద్ర ప్రభుత్వం నాగాయలంక మండలం గుల్లలమోదలో నిర్మిస్తున్న క్షిపణి పరీక్ష కేంద్రంతో ఈ ప్రాంత రూపురేఖలు సమూలంగా మారిపోతాయన్నారు.

అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి ప్రత్యేక శ్రద్ధతో చేసిన కృషి ఫలితంగా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కేంద్రం నుంచి నిధులు సాధించి, ఈ ప్రాంతంలో కీలకమైన ఔట్ ఫాల్ స్లూయీ జుల నిర్మాణానికి నిధులు మంజూరు చేశార న్నారు. ఎదురుమొండి బ్రిడ్జి కూడా త్వరలో సాకారం అవుతుందన్నారు. అటు పులిగడ్డ - విజయవాడ కరకట్ట రోడ్డుకు కూడా ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, ఎంపీ వల్లభనేని బాలశౌరి నిధులు సాధించారన్నారు. గ్రామీణ అభివృద్ధికి నియోజ కవర్గంలో దాదాపు రూ.75 కోట్లతో సిమెంట్ రోడ్లు, తారు రోడ్లను నిర్మించినట్లు తెలిపారు. నియోజకవర్గ అభివృ ద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రోత్సాహాన్ని గమనించి అభివృద్ధిని ఆశీర్వదించి నాగాయలంక మండల ప్రజలు ప్రతి ఒక్కరూ కూటమి బలపరిచిన జడ్పీటీసీ, ఎంపిటిసి అభ్యర్థులను అత్యధిక ఓట్ల మెజారిటీ తో గెలిపించాలని మండలి వెంకట్రామ్ విజ్ఞప్తి చేశారు.

ఊపందుకున్న కూటమి ప్రచారం

ఎన్నికల సమయం సమీపిస్తున్న వేళ కూటమి అభ్యర్థుల ప్రచారం ఊపందుకుంది. తెలుగు దేశం పార్టీ, జనసేన పార్టీల మద్దతుతో బీజేపీ తరపున పోటీ చేస్తున్న బీజేపీ జిల్లా ముఖ్య నాయకురాలు భోగాది రమాదేవి గెలుపు కోసం జనసేన పార్టీ మచిలీపట్నం పార్లమెంటు నియోజకవర్గ స్థానిక సంస్థల ఎన్నికల సమన్వ యకర్త మండలి వెంకట్రామ్ సారధ్యంలో జనసేన పార్టీ శ్రేణులు, తెలుగుదేశం పార్టీ మండల నాయకత్వం, బీజేపీ నియోజకవర్గ నాయకత్వం ప్రచారానికి తరలిరావటంతో కూటమి కార్యకర్తల్లో నూతన ఉత్సాహం వచ్చింది. కార్యక్రమంలో పెద్దసంఖ్యలో కూటమి నాయకులు, ఎంపీటీసీ అభ్యర్థులు పాల్గొన్నారు

మాజీ ప్రధాని ఇందిరాగాంధీ 42వ వర్ధంతి కార్యక్రమం

ప్రజాభూమి ప్రతినిధి అవనిగడ్డ / చల్లపల్లి



మాజీ ప్రధాని ఉక్కు మహిళ ఇందిరా గాంధీ 42వ వర్ధంతి కార్యక్రమం కృష్ణాజిల్లా అవని గడ్డ నియోజకవర్గం చల్లపల్లిలో అవనిగడ్డ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు మీర్ రిజ్వాన్ ఆధ్వర్యంలో చల్లపల్లిలో బందర్ రోడ్ లో ఉన్న రిజ్వాన్ కార్యాలయం వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సంద ర్భంగా మీరు రిజ్వాన్ మాట్లాడుతూ భారతదే శంలో పేద బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి 20 సూత్రాల ఆర్థిక ప్రణాళికను రూపొందించి ప్రతి పేదవాడి గుండెల్లో చిర స్థాయిగా నిలిచిపోయిన వ్యక్తి అని రిజ్వాన్ అన్నారు బ్యాంకుల జాతీయకరణ సీలింగ్ భూమి చట్టా న్ని తీసుకొచ్చి ఎస్సీ ఎస్టీ మైనార్టీల అభివృద్ధికి కృషి చేసిన వ్యక్తి ఇందిరా గాంధీ అని ఆయన కొని యా డారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కొండేటి భాస్కరరావు జిల్లా కాంగ్రెస్ నా యకులు జగ్గవరపు బాబురావు పరిచే వెంకటప్రసాద్ ఎస్సీ సెల్ నాయకులు తల తోటి సాల్మన్ రాజు మైనార్టీ సెల్ నాయకులు సయ్యద్ బాషా సయ్యద్ హుస్సేన్ రషీద్ బాబు అబ్దుల్ సర్దార్ తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొని ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పాత ఎడ్లంకలో విక్కుర్తి జయలక్ష్మి ఎన్నికల ప్రచారం



ప్రజాభూమి ప్రతినిధి అవనిగడ్డ

అవనిగడ్డ మండలం పాత ఎడ్లం కలో గ్రామంలో శనివా రం కూటమి పార్టీలు బలపరిచిన అవనిగడ్డ మండలం తెలుగుదేశం పార్టీ జెడ్పీటీసీ అభ్యర్థిని విక్కుర్తి జయలక్ష్మి, పాత ఎడ్లంక ఎంపీటీసీ అభ్యర్థి దోవారి ఏడుకొండలుతో కలసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటిస్తూ ఇంటింటికీ వెళ్లి స్థానిక ప్రజలను కలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రజలతో మమేకమై, ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు మద్దతు తెలిపి గెలిపించాలని ఓట్లు అభ్యర్థించారు. స్థానికులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుంటూ ప్రచారాన్ని కొనసాగిం చారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలను పలకరిస్తూ తమకు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రచార కార్యక్రమంలో స్థానిక టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అవనిగడ్డ 1వ సెగ్మెంట్ నందు జడ్పీటీసీ మరియు ఎంపీటీసీ అభ్యర్థులతో కలసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే సింహాద్రి



ప్రజాభూమి ప్రతినిధి అవనిగడ్డ

స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా అవనిగడ్డ మండలం, అవనిగడ్డ 1వ సెగ్మెంట్ నందు అవనిగడ్డ మండలం వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జడ్పీటీసీ అభ్యర్థిని అవనిగడ్డ మాజీ జడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ(లచ్చి) సతీమణి చింతలపూడి శ్రీలక్ష్మి ని మరియు అవనిగడ్డ 5వ సెగ్మెంట్ ఎంపీటీసీ అభ్యర్థిని కర్రా దివ్య ని గెలిపించాలని కోరుతూ ఎన్నికల ప్రచారంలో ప్రచారంలో పాల్గొ ని ప్రతి గడపకు వెళ్లి వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరిన అవనిగడ్డ నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త మరియు వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర రైతు విభాగం రీజనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ సింహాద్రి రమేష్ బాబు.ఈ కార్యక్రమంలో అవనిగడ్డ మండలం వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ వివిధ విభాగాల్లోని పార్టీ అనుబంధ విభా గాల అధ్యక్షులు మరియు పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక గ్రామస్థులు, పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు, ప్రజల్లో భరోసా నింపేందుకు పోలీసుల ఫ్లాగ్ మార్చ్

జాభూమి ప్రతినిధి, మచిలీపట్నంః



ఎన్నికల సమయంలో ఎలాంటి ప్రలోభాలకు, ఒత్తిళ్లకు గురికాకుండా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగిం చుకోవాలని జిల్లా ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు కోరారు.నవం బర్ 1వ తేదీన జరగనున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో పట్టణ ప్రాంతాల్లో శాంతిభద్రతలను పరిరక్షిస్తూ, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు కృష్ణా జిల్లా పోలీస్ శాఖ పటిష్ట చర్యలు చేపడుతోందన్నారు.జిల్లా ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు ఆదేశాల మేరకు బందరు డీఎస్పీ ఏ. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బందరు సబ్‌డివిజన్ పోలీసు అధికారులు, సిబ్బంది, డిఏఆర్ ప్రత్యేక పోలీసు బృందాలు కలిసి పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు.టెంపుల్ కాలనీ, బలరామునిపేట, రుస్తుంబాద, బుట్టాయిపేట, ముస్తాఖాన్‌పేట, ఉల్లింగిపాలెం, ఓగీసుపేట, ఇనగుదురుపేట, చింతచెట్టు సెంటర్ తదితర ప్రాంతాల్లో పోలీసుల కవాతు నిర్వహించి ప్రజలకు భద్రతపై భరోసా కల్పించారు.ఎన్నికల సమయంలో ప్రజలు ఎలాంటి భయాందోళనలకు, ప్రలోభాలకు లేదా ఇతరుల ఒత్తిళ్లకు గురికాకుండా రాజ్యాంగం కల్పించిన తమ ఓటు హక్కును స్వేచ్ఛగా, నిర్భయంగా వినియోగించు కోవాలని పోలీసులు సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడినా, ఎన్నికల ప్రక్రియకు ఆటంకం కలిగించినా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు పోలీసు శాఖ అప్రమత్తంగా ఉంటుందని, ప్రజలు ప్రశాంత వాతావరణంలో తమ ప్రజాస్వామ్య హక్కును వినియో గించుకునేలా అవసరమైన భద్రతా చర్యలు నిరంతరం కొనసాగిస్తామని జిల్లా పోలీసు శాఖ స్పష్టం చేసింది.ఈ కార్యక్రమంలో పట్టణ ఇన్స్పెక్టర్లు కె. యేసుబాబు, షేక్ అబ్దుల్ నబీ, ఎస్. పరమేశ్వర్, కె. నాగేంద్ర ప్రసాద్, వి. వెంకటేశ్వరరావు, కె.వి. ఎస్. వి.ప్ర సాద్, ఎన్. రాజు, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్న ప్రజా సేవకుడు రావెళ్ల

❖ గ్రామాల్లో ఉదయ్ కుమార్ కు ప్రజల ఆశీర్వాదాలు
❖ కూటమి బలపరిచిన చల్లపల్లి జడ్పీటీసీ టీడీపీ అభ్యర్థి ఉదయ్ కుమార్ విస్తృత ప్రచారం

ప్రజాభూమి ప్రతినిధి అవనిగడ్డ / చల్లపల్లి





స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారంలో ప్రజాసేవకుడు రావెళ్ల ఉదయ్ కుమార్ ప్రజల ఆదరాభిమానాలతో దూసు కుపోతున్నారు. కూటమి బలపరిచిన టీడీపీ అభ్యర్థిగా ఉదయ్ కుమార్ చల్లపల్లి ZPTC స్థానానికి పోటీచేస్తున్నారు. తండ్రి రాజకీయ, సేవా స్ఫూర్తితో గత 24 సంవత్సరాలుగా ప్రజలకు సేవలందిస్తూ ప్రజా ప్రతినిధిగా ప్రభుత్వ పరంగా ప్రజాసేవ చేసేందుకు రాజకీయాల్లోకి అడుగుపెట్టిన ఉదయ్ కు ప్రజలు అఖండ స్వాగతం పలికి ఆశీర్వదిస్తున్నారు. ఆపదలో ఉన్న నిరుపేద లకు, విద్యార్థులకు, స్వగ్రామంలో ప్రజలకు, పాఠశాలల అభివృద్ధికీ, పేదవర్గాల చిన్నారుల విద్యాభివృ ద్ధికి ఎంతగానో సహకారం అందించిన ఉదయ్ కుమార్ సేవలను గుర్తుచేసుకుంటూ నీరాజనాలు పలికి విజయం తథ్యం అంటూ ఆశీస్సులు అందిస్తున్నారు. కనిపించిన ప్రతి ఒక్కరినీ ఆప్యాయతగా పలక రిస్తూ అభిమానాన్ని చూపే ఉదయ్ కుమార్ వంటి యువత నేటి రాజకీయాలకు అవసరం అంటూ మద్దతుగా నిలుస్తున్నారు. గ్రామాల్లో ప్రజలను కలుస్తూ వారి సమస్యలు వింటూ, కూటమి ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు వివరిస్తూ, చల్లపల్లి మండలం ప్రగతి కూటమి తోనే సాధ్యమని ఉదయ్ కుమార్ ఓట్లు అభ్యర్థిస్తున్నారుచల్లపల్లిలో 1వ సెగ్మెంట్ అభ్యర్థిని పైడిపాముల స్వప్న, అముదా ర్లంకలో నడకుదురు సెగ్మెంట్ అభ్యర్థిని నలిగిలి లక్ష్మీ నిర్మల తో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒకటి తీసుకురావాలి



❖ ప్రతి ఓటరు తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలి
❖ జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జి.లక్ష్మీశ

ప్రజాభూమి ప్రతినిధి,విజయవాడ:

రాజ్యాంగం ప్రతి పౌరుడికి కల్పించిన అమూల్యమైన ఓటు హక్కును ప్రతి ఓటరు సద్వినియోగం చేసుకోవా లని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ పిలుపునిచ్చారు.నేడు నిర్వహించనున్న పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో అర్హులైన ప్రతి ఓటరు తమ ఓటు హక్కును వినియోగించుకుని ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావాలని కోరారు. ఉదయం 7.00 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు. ఓటరు జాబితాలో పేరు ఉన్న ప్రతి ఒక్కరూ నిర్దేశిత సమయంలో తమకు కేటాయించిన పోలింగ్ కేం ద్రా నికి వెళ్లి ఓటు వేయాలని సూచించారు. ఓటు హక్కు వినియోగించు కునేందుకు ఎటువంటి ఇ బ్బందులు తలెత్తకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.ఓటరు జాబితాలో పేరున్న వారు ఓటు వేసేందుకు వెళ్లేటప్పుడు ఎన్నికల సంఘం నిర్దేశించిన 12 రకాల ప్రత్యామ్నాయ గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒకదాన్ని తప్పనిసరిగా వెంట తీసుకె ళ్లాలని జిల్లా ఎన్నికల అధికారి స్పష్టం చేశారు.

గుర్తింపు కోసం అనుమతించిన 12 రకాల కార్డులు: ఆధార్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పాన్ కార్డు, పాస్‌పోర్ట్, పోస్టాఫీసు పాస్‌బుక్, ఉపాధి హామీ పథకం వేతన జాబ్ కార్డు, హెల్త్ ఇన్సూరెన్స్ కార్డు, పెన్షన్ డాక్యుమెంట్, సర్వీస్ ఐడెంటిటీ కార్డు, నేషనల్ పాపులేషన్ రిజిస్టర్ (ఎన్‌పీఆర్), స్మార్ట్ కార్డు, ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు జారీ చేసిన అధికారిక గుర్తింపు కార్డు, వికలాంగుల గుర్తింపు కార్డు.

సరస్ వేదికగా 'లఖ్‌పతిదీదీ'ల సాధికారతకు సరికొత్త ఊపు

❖ ఇప్పటికే రూ. 12.11 కోట్ల అమ్మకాలతో సరికొత్త రికార్డు నమోదు
❖ సందర్శకుల కోరిక మేరకు నవంబర్ 1 సాయంత్రం వరకు మేళా అందుబాటులో ❖ దేశవ్యాప్త స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులకు విశేష ఆదరణ ❖ జాతీయస్థాయి మేళాను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు ❖ ప్రత్యేక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, సరస్ సమన్వయకర్త కటారియా, సెర్ప్ డైరెక్టర్లు చక్రవర్తి, శివశంకర్

ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ:

కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ దీనదయాళ్ అంత్యోదయ యోజన–జాతీయ గ్రామీణ జీవనోపాధుల మిషన్ (DAY-NRLM) ఆధ్వర్యంలో ఏపీ సెర్ప్‌తో కలిసి విజయవాడ పున్నమిఘాట్ వద్ద 19 రోజులుగా జరుగుతున్న నిర్వహించిన జాతీయ సరస్ మేళా-2026 మహిళా శక్తిని చాటిచెప్పింది. లఖ్‌పతిదీదీల సాధికారతకు సరికొత్త ఊపు తెచ్చింది. గ్రామీణ మహిళల ఆత్మవిశ్వాసానికి, ఆర్థిక స్వావలంబ నకు మేళా ఒక విజయవంతమైన వేదికగా నిలిచింది.మేళా ముగుస్తున్న సమయంలో శనివారం సరస్ ప్రాంగణంలో ప్రత్యేక కార్యక్ర మం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, సెర్ప్ డైరెక్టర్లు చక్రవర్తి, శివశకంర్, సరస్ సమన్వ యకర్త కటారియా తదితరులు అత్యుత్తమ స్టాళ్ల లఖ్‌పతిదీదీలకు సర్టిఫికెట్లు అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ తొలిసారి ఢిల్లీని దాటి సరస్ విజయవాడ వచ్చిందని... ఈ మేళా మహిళా శక్తి సామర్థ్యాన్ని, గ్రామీణ మహిళల పారిశ్రామిక ప్రతిభను చాటిచెబుతూ ఘన విజయాన్ని సాధించిందని పేర్కొన్నారు. ఈ జాతీయ స్థాయి మేళాలో దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలకు చెందిన స్వయం సహాయక సంఘాల మహిళలు పాల్గొని తమ ఉత్పత్తులను ప్రదర్శిం చగా, సందర్శకుల నుంచి విశేష స్పందన లభించిందన్నారు. 50 లైవ్ ఫుడ్ స్టాళ్లతో పాటు మొత్తం 650 వరకు స్టాళ్లు ప్రజలకు మధురానుభూతులను మిగిల్చాయన్నారు.

సరస్ మేళా ఓ అద్భుత వేదిక:గ్రామీణ మహిళల్లో అపారమైన నైపుణ్యం, సృజనాత్మకత, వ్యాపార సామర్థ్యం దాగి ఉన్నాయని, వాటిని సరైన మార్కెట్ అవకాశాలతో అనుసంధానిస్తే వారు విజయవంతమైన పారిశ్రామికవేత్తలుగా ఎదగగలరని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. ఈ దిశగా సరస్ ఆజీవిక మేళా ఒక అద్భుతమైన జాతీయ వేదికగా నిలిచిందన్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన మహిళా స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేసిన స్టాళ్లలో చేనేత వస్త్రాలు, హస్తకళా ఉత్పత్తులు, గృహోపకరణాలు, సంప్రదాయ కళాఖం డాలు, ఆహార పదార్థాలు, ప్రాంతీయ ప్రత్యేక ఉత్పత్తులు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయని తెలిపారు. విభిన్న ప్రాంతాల సంస్కృతి, సంప్రదాయాలు, కళానైపుణ్యాలు, ఆహార వైవిధ్యాన్ని ఒకే వేదికపై పరిచయం చేయడంలో సరస్ విజయవంతమైందన్నారు. లఖ్‌పతి దీదీలుగా ఎదుగుతున్న మహిళలకు తమ ఉత్పత్తులను విస్తృత మార్కెట్‌కు పరిచయం చేసుకునేందుకు, కొత్త కొనుగోలుదారులను సంపాదించుకునేందుకు, వ్యాపార సంబంధా లను అభివృద్ధి చేసుకునేందుకు ఎంతో దోహదప డిందన్నారు.



మహిళల కృషికి రూ. 12.11 కోట్ల ప్రతిఫలం:సరస్ మేళాలో నమోదైన రూ. 12.11 కోట్ల అమ్మకాలు మహిళా స్వయం సహాయక సంఘాల కృషి, నాణ్యమైన ఉత్పత్తులు, వ్యాపార నైపుణ్యానికి ప్రతిబింబమని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ అమ్మకాలు మహిళల్లో మరింత ఆత్మవిశ్వా సాన్ని పెంపొందించడంతో పాటు భవిష్యత్తులో తమ వ్యాపారాలను విస్తరించుకోవడానికి ప్రోత్సాహాన్నిస్తాయన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన స్టాళ్ల ద్వారా దాదాపు రూ. 2 కోట్ల వరకు అమ్మకాలు జరిగాయి.

నైపుణ్యాభివృద్ధికి ప్రత్యేక వర్క్‌షాప్‌లు:సరస్ మేళా సందర్భంగా దేశవ్యాప్తంగా పాల్గొన్న స్వయం సహాయక సంఘాల మహిళలకు వివిధ అంశాలపై ప్రత్యేక వర్క్‌షాప్‌లు, శిక్షణా కార్యక్రమాలు నిర్వహించారు. బిగ్ బ్రాండ్ ఫర్ స్మాల్ బిజినెస్, సెల్ ఆన్‌లైన్ గ్రో ఫాస్ట్, సోషల్ కామర్స్ తదితర శీర్షికలతో ఉత్పత్తుల నాణ్యత పెంపు, ఆకర్షణీయమైన ప్యాకేజింగ్, బ్రాండింగ్, మార్కెటింగ్ వ్యూహాలు, ధరల నిర్ణయం, డిజిటల్ మార్కెటింగ్, ఆన్‌లైన్ విక్రయాలు, ఎగుమతి అవకాశాలు, వ్యా పార నిర్వహణ వంటి అంశా లపై నిపుణులు అవగాహన కల్పించారు. కొనుగో లుదారులతో వ్యాపార సంబంధాలు ఏర్పరచుకో వడం, మార్కెట్ అవసరాలకు అనుగు ణంగా ఉత్పత్తులను అభివృద్ధి చేసుకోవడం, తమ వ్యాపారాలను విస్తరించుకోవడంపై ఆచరణా త్మక సూచనలు అందించారు. మహిళలు సమర్థ వంతమైన మహిళా పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు ఇవి దోహదపడ్డాయి.

సాంస్కృతిక వైవిధ్యం@ సరస్:సరస్ మేళాలో ప్రతిరోజూ సాయంత్రం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన కళాకారులు ప్రదర్శించిన సంప్రదాయ నృత్యాలు, జానపద కళారూపాలు, సంగీత కార్యక్రమాలు, సాంస్కృతిక ప్రదర్శనలు మేళా ప్రాంగణంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచా యి. ఆయా రాష్ట్రాల భాష, సంస్కృతి, సంప్రదా యాలు, కళా వైభవాన్ని ప్రతిబింబించేలా నిర్వ హించిన ఈ కార్యక్రమాలు జాతీయ సమైక్యత, సాంస్కృతిక ఐక్యతకు ప్రతీకగా నిలిచాయి. మహిళా స్వయం సహాయక సంఘా ల ఉత్పత్తుల ప్రదర్శనలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు కూడా మేళాకు మరింత శోభను తీసుకొచ్చి సందర్శకులకు ఆహ్లాదకరమైన అనుభూతిని అందించాయి.

భాగస్వాములైన ప్రతిఒక్కరికీ ధన్య వాదాలు: సరస్ మేళా విజయవంతంగా నిర్వహించేం దుకు సహకరించిన కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ, రాష్ట్ర గ్రామీణ పేదరిక నిర్మూ లన సంస్థ (సెర్ప్), వివిధ ప్రభుత్వ శాఖల అధికా రులు, సిబ్బంది, స్వయం సహాయక సంఘాల మహిళలు, స్టాల్ నిర్వాహకులు, కళాకారులు, మీడియా ప్రతినిధులు, ప్రజలకు జిల్లా కలెక్టర్, సెర్ప్ ఉన్నతాధికారులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌టీఆర్ జిల్లా డీఆర్‌డీఏ పీడీ ఏఎన్‌వీ నాంచారరావు తదితరులు పాల్గొన్నారు.

సందర్శకుల విశేష ఆదరణ.. వారి కోరిక మేరకు నవంబర్ 1న కూడా మేళా కొనసాగింపు!సరస్ మేళాకు సందర్శకుల నుంచి లభించిన విశేష స్పందన, ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులను దృష్టిలో ఉంచుకుని నవంబర్ 1వ తేదీ సాయం త్రం వరకు కూడా మేళాను కొనసాగించాలని నిర్ణయించినట్లు జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ తెలిపారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలకు చెందిన మహిళా స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేసిన స్టాళ్లలోని విభిన్న ఉత్పత్తులను కొనుగోలు చేసేందుకు ప్రజలకు మరో అవకాశం కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

ప్రజాభూమి

ఏలూరు, పశ్చిమగోదావరి 4

ఆదివారం 1 నవంబర్ 2026



విద్యారంగంలో ఏఐ సాంకేతికత వినియోగంపై అవగాహన

ప్రజాభూమి ఏలూరు.

విద్యారంగంలో కృత్రిమ మేధస్సు (ఏఐ) సాంకేతికత వినియోగంపై అధ్యాపకులకు అవగాహన కల్పించేందుకు ఏలూరులోని సర్ సి.ఆర్.రెడ్డి మహిళా కళాశాలలో ప్రత్యేక అతిథి ఉపన్యాస కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ఎలక్ట్రానిక్స్ విభాగం, అలుమ్ని సెల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఐక్యూఏసీ సహకారంతో శనివారం ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఉపాధ్యాయిణి 'ఏఐ ఇన్ ఎడ్యుకేషన్' అనే అంశంపై ప్రసంగించారు. విద్యారంగంలో కృత్రిమ మేధస్సు వినియోగం, బోధనలో ఏఐ పాత్ర, విద్యార్థులకు మెరుగైన విద్యను అందించడంలో దాని ప్రాధాన్యతను వివరించారు. ఏఐ ద్వారా బోధనను మరింత సులభతరం చేయడంతో పాటు విద్యార్థుల్లో సృజనాత్మకత, నైపుణ్యాలను పెంపొందించవచ్చని తెలిపారు.

తుఫాను వల్ల నష్టపోయిన
రైతులకు నష్టపరిహారం చెల్లించాలి



ప్రజాభూమి బ్యూరో ఏలూరు జిల్లా

అర్నబ్ తుఫాను వలన పంట దెబ్బతిని నష్టపోయిన రైతులకు వెంటనే నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె. శ్రీనివాస్, పార్టీ సానా రుద్రవరం ఎంపీటీసీ అభ్యర్థి జక్కుల మహేష్, మండల కమిటీ సభ్యులు వీరవల్లి భాస్కరరావు డిమాండ్ చేశారు. శనివారం సానా రుద్రవరంలో తుఫానుకు నేల వాలిన వరి పంట పొలాలను సిపిఎం నాయకులు పరిశీలించారు. నష్టం వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా కె. శ్రీనివాస్, జక్కుల మహేష్, వీరవల్లి భాస్కరరావు మాట్లాడుతూ పంట చేతికి వచ్చే దశలో పూర్తి పెట్టుబడి పెట్టిన తర్వాత పంటకు నష్టం వాటిల్లిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎకరాకు రూ.40 వేలకు పైగా పెట్టుబడి పెట్టారని చెప్పారు. తుఫాను రైతు వెన్ను విరిచిందని ఆవేదన వ్యక్తం చేశారు. పంటకు జరిగిన నష్టాన్ని వెంటనే అంచనా వేయాలని, నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరారు. పంటల బీమా ప్రీమియం చెల్లింపుతో నిమిత్తం లేకుండా పంటల బీమా పరిహారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు రైతులు, కౌలు రైతులు పాల్గొన్నారు.

రాప్తాడు పాఠశాలలో ఉన్మాది వీరంగం

- విద్యార్థినులపై రంపంతో దాడి చేయడం దారుణం.
- బాధ్యుడిపై కఠిన చర్యలు తీసుకోవాలి పీడీఎస్‌యూ డిమాండ్

ప్రజాభూమి బ్యూరో ఏలూరు జిల్లా

అనంతపురం జిల్లా రాప్తాడు పాఠశాలలో చోటుచేసుకున్న ఉన్మాది దాడి ఘటనను పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి కాకినాని తీవ్రంగా ఖండించారు. తరగతి గదిలోకి చొరబడిన ఉన్మాది విద్యార్థినిపై రంపంతో దాడి చేయడంతో పాటు, అడ్డొచ్చిన మరో విద్యార్థినిపై కూడా దాడి చేయడం అత్యంత హేయమైన చర్య అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనతో విద్యార్థులు, ఉపాధ్యాయులు భయాందోళనలకు గురై కన్నీళ్లు పెట్టుకోవడం హృదయవిదారకమని అన్నారు. పాఠశాలల్లోనే విద్యార్థులకు రక్షణ లేకపోవడం ప్రభుత్వ భద్రతా వైఫల్యాలకు నిదర్శనమని విమర్శించారు. ఘటనపై ఉన్నతస్థాయి విచారణ జరిపి దాడికి పాల్పడిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని, బాధిత విద్యార్థినులకు మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో పటిష్టమైన భద్రతా వ్యవస్థ ఏర్పాటు చేయాలని కోరారు. విద్యార్థుల ప్రాణాలకు భరోసా కల్పించలేని విద్యావ్యవస్థ ఎవరి కోసం? ప్రభుత్వం తక్షణమే స్పందించి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని కాకి నాని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో ఏఐటీయూసీ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు



ప్రజాభూమి ఏలూరు

స్థానిక జిల్లా ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ఏఐటీయూసీ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు ఎం.రవికుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కార్మికుల హక్కుల పరిరక్షణ, మెరుగైన వేతనాలు, ఉద్యోగ భద్రత కోసం ఏఐటీయూసీ నిరంతరం పోరాటాలు చేస్తోందన్నారు. ఉద్యోగులంతా ఐక్యంగా ఉండి హక్కుల సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, డాక్టర్ సిహెచ్ బేబీ కమల, కే. కృష్ణమాచార్యులు, ఆసుపత్రి అధికారులు, యూనియన్ నాయకులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు జరిగే పోలింగ్‌కు పటిష్టమైన ఏర్పాట్లు

ప్రజాభూమి బ్యూరో ఏలూరు జిల్లా

ఏలూరు జిల్లాలో ఏలూరు నగరపాలక సంస్థ, నూజివీడు, జంగారెడ్డిగూడెం పురపాలక సంఘాలలో నవంబర్, 1వ తేదీన ఎన్నికల పోలింగ్ నిర్వహించడం జరుగుతుందని, పోలింగ్ నిర్వహణకు పటిష్టమైన ఏర్పాట్లు చేశామని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి చెప్పారు. స్థానిక సర్ సి.ఆర్.ఆర్. పబ్లిక్ స్కూల్ లో శనివారం పోలింగ్ సిబ్బందికి ఏర్పాటుచేసిన పోలింగ్ పరికరాల పంపిణీ కేంద్రంలో పోలింగ్ పరికరాల పంపిణీని జాయింట్ కలెక్టర్ డా.ఎం.జె. అభిషేక్ గౌడ తో కలిసి కలెక్టర్ పరిశీలించారు. అక్కడ సిబ్బందిని పలు వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో ఏలూరు నగరపాలక సంస్థ, నూజివీడు, జంగారెడ్డిగూడెం పురపాలక సంఘాలకు సంబంధించి 130 వార్డులు, డివిజన్లలో కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, మేయర్, చైర్ పర్శన్ల ఎన్నిక నిమిత్తం నవంబర్, 1వ తేదీన 376 కేంద్రాలలో పోలింగ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. 3,28, 671 మంది ఓటర్లు ఉన్నారన్నారు. పోలింగ్ నిమిత్తం 11 జోనల్ అధికారులు, 31 మంది రూట్ ఆఫీసర్లను నియమించడం జరిగిందన్నారు. 376 పోలింగ్ స్టేషన్లలో గతంలో జరిగిన సంఘటనల ననుసరించి 99 సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా గుర్తించడం జరిగిందని, ఆయా ప్రదేశాలలో అదనపు భద్రతా చర్యలు తీసుకున్నామన్నారు. ఒకొక్క పోలింగ్ స్టేషన్ లలో ప్రిసైడింగ్ అధికారి, అదనపు



ప్రిసైడింగ్ అధికారితో పాటు, ముగ్గురు ఇతర పోలింగ్ సిబ్బందిని, మైక్రో పరిశీలకులను నియమించామన్నారు. కలెక్టర్ వెంట అసిస్టెంట్ కలెక్టర్ సిహెచ్. శ్రావణ్ కుమార్ రెడ్డి, ఏలూరు ఆర్డీఓ లక్ష్మీప్రసన్న, ఏలూరు నగరపాలక సంస్థ కమీషనర్ ఏ . భానుప్రతాప్, డిఎస్పీ శ్రావణ్ కుమార్, ఏలూరు తహసీల్దార్ , ప్రభృతులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థుల గెలుపు కోసం
ప్రచారం నిర్వహించిన ఎమ్మెల్యే చిర్రి బాలరాజు

ప్రజా భూమి ప్రతినిధి, జీలుగుమిల్లి

జీలుగుమిల్లి మండలంలోని అంకన్నగూడెం కూటమి ఎంపీటీసీ అభ్యర్థి జమ్మి గోపి గెలుపు కోసం శనివారం పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, జనసేన జిల్లా కార్యదర్శి గడ్డమనుగు రవి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రచార రథంతో గ్రామంలోని వీధివీధినా పర్యటిస్తూ, కూటమి అభ్యర్థి జమ్మి గోపిని భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. ఎన్నికల గుర్తు గాజు గ్లాసుపై ఓటు వేసి అభ్యర్థిని గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అనంతరం రాచన్నగూడెంలో కూటమి ఎంపీటీసీ అభ్యర్థిని వెన్నెం మాధవిని గెలిపించే లక్ష్యంతో స్థానిక నాయకులతో సమావేశమయ్యారు. వెన్నెం మాధవి విజయానికి కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో



జనసేన మండల అధ్యక్షుడు పసుపులేటి రాము, కూటమి నాయకులు మడివి నారాయణ, అశోక్, గోపి, మాడే రాజు, వెట్టి సింగరాజు, సోయం శేఖర్, సోయం ప్రకాష్, మోహన్, వీరంకి పాపారావు, గొడుగుల కిరణ్, కొప్పుల కార్తీక్, కుమ్మరపల్లి జరుష్, శ్రీను, వనమా వెంకటేశ్వరరావు, వనమా రాజేష్, దాము, ఉదయ్, సంకురుడు తదితరులు పాల్గొన్నారు.

తుఫాన్ సహాయక చర్యలు ముమ్మరం

- ఆత్రేయపురంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ప్రచారం

ప్రజాభూమి ప్రతినిధి కొత్తపేట

స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయంతో గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి మరింత వేగవంతమవుతుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. ఆత్రేయపురం మండలంలో శనివారం వాడపల్లి శ్రీ వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్న అనంతరం కూటమి జడ్పీటీసీ అభ్యర్థి గూడపాటి శ్రీనివాస్, ఎంపీటీసీ అభ్యర్థుల తరఫున కూటమి నాయకులతో కలిసి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నేతృత్వంలో రాష్ట్రంలో అభివృద్ధి కొనసాగుతోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. సూపర్ సిక్స్ హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని తెలిపారు. ఇటీవల రైతుల ఖాతాల్లో అన్నదాత సుఖీభవ--పీఎం కిసాన్ కింద రూ.7 వేల చొ



ప్పున జమ చేసిన విషయాన్ని ప్రస్తావించారు. గత ప్రభుత్వ పాలనపై విమర్శలు చేసిన ఎమ్మెల్యే, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆత్రేయపురం మండలంలో లొల్ల లాకుల పునర్నిర్మాణం, వాడపల్లి ఆలయ అభివృద్ధి, గ్రామీణ సీసీ రోడ్లు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, డ్రైనేజీ పనులు చేపట్టామని వివరించారు. స్థానిక సంస్థల్లో జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు కూటమి అభ్యర్థులను గెలిపించి అభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ప్రజలను కోరారు.

అర్నబ్ తుఫాన్ నష్టాలపై కేంద్ర బృందం పరిశీలన

- అరటి, వరి పంటలతో పాటు విద్యుత్, రహదారులు, ఆస్తి నష్టాలపై ఆరా

ప్రజాభూమి ప్రతినిధి కొత్తపేట

అర్నబ్ తుఫాన్ ప్రభావంతో అంబేద్కర్ కోనసీమ జిల్లాలో సంభవించిన పంట, ఆస్తి నష్టాలను అంచనా వేసేందుకు కేంద్ర బృందం శనివారం జిల్లాలో పర్యటించింది. రావులపాలెం సి.ఆర్.సిలో జిల్లా కలెక్టర్ రావిరాల మహేష్ కుమార్ ఆధ్వర్యంలో కేంద్ర బృందంతో నష్టాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు.

తుఫాన్ కారణంగా జిల్లాలో వివిధ రంగాలకు జరిగిన నష్టాన్ని జిల్లా కలెక్టర్ స్క్రీన్‌పై ఫొటోలు, నివేదికల ద్వారా కేంద్ర బృందానికి వివరించారు. ప్రధానంగా అరటి, వరి తదితర పంటలకు జరిగిన తీవ్ర నష్టం, నేలకొరిగిన చెట్లు, దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, ఇతర విద్యుత్ పరికరాలు, రహదారులు, భవనాలు, ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులకు జరిగిన నష్టంపై బృంద సభ్యులు ఆరా తీశారు. అనంతరం తుఫాన్ నష్టాలను వివరిస్తూ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఫొటో గ్యాలరీని



కేంద్ర బృందం సందర్శించింది. వివిధ ప్రభుత్వ శాఖల వారీగా జరిగిన నష్టాన్ని ఫొటోలు, సమగ్ర నివేదికల ఆధారంగా కలెక్టర్ వివరించారు. సముద్రంలో కొట్టుకుపోయిన, గల్లంతైన మత్స్యకారుల పడవలు, దెబ్బతిన్న వలలు తదితర వివరాలను కూడా కేంద్ర బృందం దృష్టికి తీసుకెళ్లారు. ఈ కేంద్ర బృందంలో హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ చిత్తరంజన్ దాస్, వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ అడిషనల్ డైరెక్టర్ ప్రశాంత్ అర్మోరికర్, ఆర్థిక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ హిమాలయ గార్గ్, డిప్యూటీ డైరెక్టర్ ప్రణయ్ గార్గ్, రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ సీఈఓ ప్రకర్ జైన్‌తో పాటు విపత్తు నిర్వహణ, రెవెన్యూ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.



అయ్యప్ప ఆలయంలో
భక్తులకు అన్నదాన వితరణ

- మోపిదేవి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో భోజన ఏర్పాట్లు

ప్రజాభూమి ప్రతినిధి, తాళ్లపూడి

తాళ్లపూడిలోని అయ్యప్ప స్వామి ఆలయంలో అయ్యప్ప దీక్ష చేపట్టిన భక్తులకు నిత్యం ఉచిత అన్నప్రసాదం అందించాలన్న కేదార్ స్వామి సంకల్పం సత్ఫలితాలను ఇస్తోంది. ఈ కార్యక్రమానికి పలువురు దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ వంతు సహకారం అందిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం తాళ్లపూడికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయులు, కవి, ఆయుర్వేద ఔషధ ఉత్పత్తిదారులు మోపిదేవి భాస్కర్, విజయలక్ష్మి దంపతులు, వారి కుమార్తె, అల్లుడు జిగిషా, పృథ్వీరెడ్డి దంపతుల ఆధ్వర్యంలో అయ్యప్ప భక్తులకు ఉచిత భోజన సదుపాయం కల్పించారు. భక్తులకు అన్నదానం చేయడం ఆనందంగా ఉందని దాతల కుటుంబ సభ్యులు తెలిపారు. ఆలయంలో కొనసాగుతున్న ఈ అన్నదాన కార్యక్రమానికి భక్తులు, దాతల నుంచి మంచి స్పందన లభిస్తోంది.

అన్నదేవరపేటలో
వైకాపా అభ్యర్థి ముమ్మర ప్రచారం

- ఎంపీటీసీగా గెలిపించాలని ఓటర్లకు మేణ్ణి గణేష్ విజ్ఞప్తి



ప్రజాభూమి ప్రతినిధి, తాళ్లపూడి

తాళ్లపూడి మండలం అన్నదేవరపేట గ్రామంలో వైకాపా ఎంపీటీసీ-1 అభ్యర్థి మేణ్ణి గణేష్ ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో జగనన్న పాలనలో ప్రజలకు సంక్షేమ పథకాల ద్వారా మేలు జరిగిందని ఓటర్లకు వివరిస్తున్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు గడుస్తున్నా పేదలకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు మంజూరు చేయలేదని విమర్శించారు. గత ప్రభుత్వంలో ప్రజలకు అందిన సంక్షేమాన్ని గుర్తు చేసుకుని తనను ఎంపీటీసీగా గెలిపించాలని ఓటర్లను కోరుతున్నారు. ఈ ప్రచారంలో గ్రామ వైకాపా నాయకులు పిట్టా శ్రీను, నాని తదితరులు పాల్గొంటున్నారు.

ఆపన్న కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజా భూమి ప్రతినిధి, ఆగిరిపల్లి



ఆగిరిపల్లి గ్రామానికి చెందిన తుర పాటి దుర్గారావు కుమారుడు దేశీ అనారోగ్యంతో బాధపడుతూ శస్త్ర చికిత్స చేయించుకోవాల్సి రావడంతో కుటుంబ సభ్యులు తహసీల్దార్ పి.ఎన్.వి. ప్రసాద్‌ను ఆర్థిక సాయం కోరారు. స్పందించిన తహసీల్దార్ కుటుంబ ఆర్థిక పరిస్థితిని పరిశీలించి, కార్యాలయ సిబ్బంది తరఫున రూ.10వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప తహసీల్దార్ జి. పవన్ కుమార్, పునఃసర్వే ఉప తహసీల్దార్ మరియన్న, జూనియర్ అసిస్టెంట్ బి. ఉమాశంకర్‌తో పాటు వడ్లమాను, సురవరం, నూగొండపల్లి గ్రామాల రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

పోలింగ్‌కు సర్వం సిద్ధం

- ఆరు పురపాలక సంఘాల్లో పోలింగ్ సామగ్రి పంపిణీ ప్రక్రియ విజయవంతం
- గొల్లప్రోలు,పిఠాపురం,తుని డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్

ప్రజాభూమి ప్రతినిధి, కాకినాడ

కాకినాడ జిల్లాలో నిర్వహించనున్న స్థానిక సంస్థల ఎన్నికల పోలింగ్‌కు సంబంధించిఏలేశ్వరం, పిఠాపురం, సామర్లకోట, గొల్లప్రోలు, తుని, పెద్దాపురం ఆరు పురపాలక సంఘాల్లో పోలింగ్ సిబ్బందికి ఎన్నికల సామగ్రి పంపిణీ (డిస్ట్రిబ్యూషన్) ప్రక్రియను శనివారం పకడ్బందీగా, సమర్థవంతంగా నిర్వహించినట్లు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ తెలిపారు. శనివారం పిఠాపురం, గొల్లప్రోలు డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించి మాట్లాడుతూ నేడు నిర్వహించనున్న పోలింగ్ ప్రక్రియను ప్రశాంతంగా, స్వేచ్ఛాయుతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు,సిబ్బంది పూర్తి సమన్వయంతో బాధ్యతాయుతంగా విధులునిర్వర్తించాలన్నారు. ఆరు పురపాలక సంఘాల పరిధిలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల వద్ద పోలింగ్ సిబ్బంది హాజరు నమోదు,వారికి కేటాయించిన ఎన్నికల సామగ్రి పంపిణీ,సామగ్రి సక్రమంగా అందజేత, పోలింగ్ కేంద్రాలకు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన రవాణా సౌకర్యాలు, రూట్లు,జోన్ల వారీగా చేపట్టిన ఏర్పాట్లు,స్ట్రాంగ్ రూముల భద్రత,పోలింగ్ సిబ్బందికి భోజన సదు పాయాలు తదితర అంశాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి పంపిణీ ప్రక్రియను నిర్వహించారన్నారు

గొల్లప్రోలు,పిఠాపురం,తుని పురపాలక సంఘానికి సంబంధించి ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ శనివారం సందర్శించి ఎన్నికల సామగ్రి పంపిణీ ప్రక్రియను,అక్కడ చేపట్టిన ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ సిబ్బంది హాజరు,వారికి కేటాయించిన ఎన్నికల సామగ్రి సక్రమంగా అందజేస్తున్న తీరును, పోలింగ్ సిబ్బంది తమకు కేటాయించిన సామగ్రిని సరిచూసుకునే విధానాన్ని పరిశీలించారు. అలాగే పోలింగ్ సిబ్బంది ఆయా పోలింగ్ కేంద్రాలకు చేరుకునేందు కు ఏర్పాటు చేసిన బస్సులు,



రవాణా సౌకర్యాలు,రూట్ల వివరాలను సమీక్షించారు.

పెద్దాపురం,సామర్లకోట డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను తనిఖీ చేసిన జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్

అదేవిధంగా పెద్దాపురం, సామర్లకోట పురపాలక సంఘాలకు సంబంధించి ఏర్పాటుచేసినడిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ శనివారం సందర్శించి ఎన్నికల సామగ్రి పంపిణీ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా పోలింగ్ సిబ్బంది హాజరు, ఎన్నికల సామగ్రి సేకరణ, పంపిణీ ప్రక్రియ,స్ట్రాంగ్ రూముల భద్రతా ఏర్పాట్లు, పోలింగ్ కేంద్రాలకు వెళ్లే రూట్లు, జోన్ల వారీగా చేపట్టిన ఏర్పాట్లు, సిబ్బందికి కల్పించిన భోజన సదుపాయాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఎన్నికల విధులకు హాజరైన ప్రతి పోలింగ్ సిబ్బందికి వారికి కేటాయించిన ఎన్నికల సామగ్రిని పూర్తిస్థాయిలో అంద జేయడం తో పాటు, సామగ్రి పంపిణీలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా చూడాలని అధికారులు సూచిం చారు. పోలింగ్ సిబ్బంది తమకు కేటాయించిన సామగ్రిని చెక్‌లిస్ట్ ప్రకారం సరిచూసుకుని, నిర్దేశిం చిన రూట్లలో తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు సకాలంలో చేరుకోవాలని వారు స్పష్టం చేశారు..

ప్రజాభూమి
కోనసీమ
5
ఆదివారం 1 నవంబర్ 2026

పోలీస్ శాఖలో సుదీర్ఘ సేవలందించిన ఎస్ఐ, ఏఎస్ఐలకు ఘన వీడ్కోలు

- **41, 36 ఏళ్ల సుదీర్ఘ సేవలకు గుర్తింపుగా సత్కారం**

ప్రజా భూమి ప్రతినిధి – అనకాపల్లి

పోలీస్ శాఖలో నాలుగు దశాబ్దాలకు పైగా నిస్వార్థంగా సేవలందించి పదవీ విరమణ పొందిన పోలీసు అధికారుల సేవలు ఎంతో శ్లాఘనీయమని జిల్లా అదనపు ఎస్పీ ఎల్.మోహనరావు కొనియాడారు. జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు అనకాపల్లి జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో పదవీ విరమణ పొందిన ఎస్ఐ, ఏఎస్ఐలకు ఆత్మీయ వీడ్కోలు సమావేశాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ కంట్రోల్ రూమ్ (పీసీఆర్) విభాగంలో పనిచేస్తూ 41 సంవత్సరాల పాటు సేవలందించిన ఎస్ఐ ఎం.సురేంద్ర కుమార్, ఎలమంచిలి రూరల్ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తూ 36 సంవత్సరాల సుదీర్ఘ సర్వీసును పూర్తి



చేసుకున్న ఏఎస్ఐ కె.వీర్ రెడ్డిలను అదనపు ఎస్పీ ఎల్.మోహనరావు శాలువాలతో ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ ఉద్యోగంలో ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ ప్రజల రక్షణకు తమ జీవితాలను అంకితం చేసిన అధికారుల సేవలు ఆదర్శనీయమన్నారు. వారి సుదీర్ఘ సేవలు పోలీస్ శాఖకు గర్వకారణమని పేర్కొన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం శేష జీవితాన్ని సంపూర్ణ ఆయురారోగ్యాలతో, మానసిక ప్రశాంతతతో, కుటుంబ సభ్యులతో సుఖసంతోషంగా గడపాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. సత్కారం అందుకున్న ఎస్ఐ ఎం.సురేంద్ర కుమార్, ఏఎస్ఐ కె.వీర్ రెడ్డిలు మాట్లాడుతూ తమ సుదీర్ఘ సర్వీసులో సహకరించిన ఉన్నతాధికారులకు, తోటి సిబ్బందికి, కుటుంబ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్.బి. డీఎస్పీ వి.బాబ్జీరావు, ఏవో సి.హెచ్.తిలక్ బాబు, సీఐలు బాల సూర్యారావు, శ్రీనివాసరావు, రమణయ్య, రామకృష్ణారావు, ఎస్ఐలు ప్రసాద్, అంజిబాబు, శ్రీనివాసరావుతో పాటు ఇతర పోలీస్ అధికారులు, కార్యాలయ సిబ్బంది, పదవీ విరమణ పొందిన అధికారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి

- **ప్రతి ఓటరు స్వేచ్ఛగా, ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకునేలా పటిష్ట చర్యలు**
- **ఎన్నికల నిర్వహణపై గత మూడు, నాలుగు నెలలుగా విస్తృత స్థాయిలో సమీక్షలు, సమన్వయ సమావేశాలు**
- **సీసీటీవీ, వెబ్‌కాస్టింగ్, పోలీస్ బందోబస్తుతో పటిష్ట భద్రతా ఏర్పాట్లు**
- **రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా**

ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ

రాష్ట్రంలో పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంతంగా, స్వేచ్ఛగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా తెలిపారు. ప్రతి ఓటరు ఎలాంటి భయం, ఒత్తిడికి తావులేకుండా తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునే వాతావరణాన్ని కల్పించడమే రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. శనివారం విజయవాడలోని ఆర్ అండ్ బీ భవన్‌లో గల రాష్ట్ర ఎన్నికల కమిషనర్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ ఆయన వివరాలు వెల్లడించారు.

గత మూడు, నాలుగు నెలలుగా విస్తృత స్థాయిలో సమీక్షలు

ఎన్నికల నిర్వహణకు సంబంధించి గత మూడు, నాలుగు నెలలుగా వివిధ స్థాయిల్లో అనేక సమీక్షా సమావేశాలు నిర్వహించడంతో పాటు నిరంతరం పర్యవేక్షణ చేపట్టినట్లు కమిషనర్ తెలిపారు. ప్రభుత్వ శాఖల కార్యదర్శులు, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత శాఖల అధికారులతో క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహించామని చెప్పారు. జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, పోలీస్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్‌ల ద్వారా ఎప్పటికప్పుడు సమీక్షలు జరిపినట్లు వివరించారు. చీఫ్ సెక్రటరీ, డీజీపీతో కూడా ఎన్నికల ఏర్పాట్లపై సమావేశాలు నిర్వహించినట్లు తెలిపారు. శుక్రవారం జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, పోలీస్ కమిషనర్లతో పాటు అబ్జర్వర్స్ తో కూడా సమావేశమై ఎన్నికల సన్నద్ధత, శాంతిభద్రతలు, ఇతర ఏర్పాట్లపై సమగ్రంగా చర్చించినట్లు పేర్కొన్నారు.

ప్రతి ఓటరుకు స్వేచ్ఛగా ఓటు వేసే అవకాశం కల్పించడమే లక్ష్యం

రాష్ట్రంలో శాంతిభద్రతలను పరిరక్షించడం తమ మొదటి ప్రాధాన్యత అని కమిషనర్ స్పష్టం చేశారు. ప్రతి ఓటరు పోలింగ్ కేంద్రానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేరుకుని స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునేలా అవసరమైన వాతావరణాన్ని కల్పిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల విధులు నిర్వహించే రిటర్నింగ్ అధికారులు, ప్రిసైడింగ్ అధికారులు, ఇతర పోలింగ్ సిబ్బందికి ఇప్పటికే తగిన శిక్షణ అందించినట్లు వెల్లడించారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా అన్ని స్థాయిల్లో అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.

రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల ఏర్పాట్ల వివరాలు

రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 13 మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీలు కలిపి 100 పట్టణ స్థానిక సంస్థలకు ఎన్నికలు నోటిఫై చేసినట్లు కమిషనర్ తెలిపారు. వీటిలో ఏకగ్రీవంగా ఎన్నికైన స్థానాలను మినహాయించి, 13 మున్సిపల్ కార్పొరేషన్లు, 79 మున్సిపాలిటీలు, నగర పంచాయతీలతో కలిపి మొత్తం 92 పట్టణ స్థానిక సంస్థల్లో ఎన్నికలు జరగనున్నాయని వివరించారు. మొత్తం 3,942 వార్డులకు గాను 756 వార్డుల్లో సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని తెలిపారు. మున్సిపల్ కార్పొరేషన్లలో 118 మంది, మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో 638 మంది వార్డు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు పేర్కొన్నారు. అదేవిధంగా మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో 17 మంది చైర్‌పర్సన్లు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు.

పోలింగ్ సిబ్బంది, ఎన్నికల విధుల కేటాయింపు

ఎన్నికల నిర్వహణ కోసం వివిధ స్థాయిల్లో భారీ సంఖ్యలో సిబ్బందిని నియమించినట్లు కమిషనర్ వివరించారు.
ఆర్ఓలు (రిటర్నింగ్ అధికారులు): 1,449 మంది
ఏఆర్ఓలు: 2,543 మంది
ప్రిసైడింగ్ అధికారులు: 13,504 మంది
అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు: 13,504 మంది
ఇతర పోలింగ్ అధికారులు: 51,716 మంది
మైక్రో అబ్జర్వర్లు: 3,720 మంది
వెబ్‌కాస్టింగ్ సిబ్బంది: 1,835 మంది ఎన్నికల నిర్వహణలో ఎలాంటి అవకతవకలకు అవకాశం లేకుండా అవసరమైన సిబ్బందిని అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.

సీసీటీవీ, వెబ్‌కాస్టింగ్ ద్వారా నిరంతర పర్యవేక్షణ

పోలింగ్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని జిల్లాల కలెక్టర్లకు సీసీటీవీ కెమెరాల ఏర్పాటు, వెబ్‌కాస్టింగ్, అవసరమైన చోట్ల ఇతర పర్యవేక్షణ ఏర్పాట్లు చేయాలని ముందుగానే ఆదేశాలు జారీ చేసినట్లు కమిషనర్ తెలిపారు. గతంలో రాజకీయ పార్టీల ప్రతినిధుల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు ఎన్నికలకు సంబంధించిన వీడియో ఫుటేజీ భద్రపరిచే గడువును 40 రోజుల నుంచి 60 రోజులకు పొడిగించినట్లు వివరించారు. అదేవిధంగా సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఎన్నికల వివాదాలకు సంబంధించి ఎన్నికల ట్రిబ్యునల్ లేదా న్యాయస్థానాల్లో కేసులు పెండింగ్‌లో ఉన్న సందర్భాల్లో సంబంధిత వీడియో ఫుటేజీని కేసుల పరిష్కారం అయ్యే వరకు భద్రపరిచేలా చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు.

స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పటిష్ట భద్రత

పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్సులను భద్రపరిచేందుకు స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద అన్ని రకాల భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. స్ట్రాంగ్ రూమ్‌లకు సీసీటీవీ నిఘా ఏర్పాటు చేయడంతో పాటు నిరంతర పోలీస్ బందోబస్తు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. బ్యాలెట్ బాక్సుల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు స్పష్టం చేశారు.

రాబోయే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకూ సన్నద్ధత

ప్రస్తుతం పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించామని, అనంతరం నాలుగు, ఐదు రోజుల వ్యవధిలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి కూడా రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఏర్పాట్లు కొనసాగనున్నాయని కమిషనర్ తెలిపారు. ఈ ఎన్నికల కోసం ఇప్పటికే జనరల్ అబ్జర్వర్లను నియమించడంతో పాటు ఎక్స్‌పెండిచర్ అబ్జర్వర్లను కూడా నియమించినట్లు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఎన్నికల ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని, అధికార యంత్రాంగం సమన్వయంతో పనిచేస్తోందని తెలిపారు. ప్రజాస్వామ్య స్ఫూర్తిని కాపాడుతూ, ప్రతి ఓటరుకు స్వేచ్ఛగా ఓటు వేసే హక్కును కల్పించేలా ఎన్నికల సంఘం అన్ని చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా స్పష్టం చేశారు.

రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యదర్శి డాక్టర్ ఏ. మల్లిఖార్జున మాట్లాడుతూ

పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట పోలీస్ బందోబస్తు

పోలింగ్ కేంద్రాలను హైపర్ సెన్సిటివ్, సెన్సిటివ్, నార్మల్ పోలింగ్ స్టేషన్లుగా వర్గీకరించడం జరిగిందన్నారు. హైపర్ సెన్సిటివ్ కేంద్రాల్లో 1+4, సెన్సిటివ్ కేంద్రాల్లో 1o2 విధానంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. బ్యాలెట్ బాక్సుల సురక్షిత రవాణా, రూట్ క్లియరెన్స్, భద్రత కోసం 1,543 రూట్ మొబైల్ వాహనాలు ఏర్పాటు చేశామన్నారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నుంచి పోలింగ్ కేంద్రాలకు, పోలింగ్ అనంతరం కలెక్షన్ పాయింట్లు, స్ట్రాంగ్ రూమ్‌లకు బ్యాలెట్ బాక్సుల తరలింపునకు రూట్ మొబైల్స్ వినియోగిస్తున్నామన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక బలగాలు



ఎక్కడైనా శాంతిభద్రతల సమస్యలు తలెత్తితే తక్షణమే స్పందించేందుకు డీఎస్పీలు, అదనపు ఎస్పీల ఆధ్వర్యంలో ఫ్లైకింగ్ ఫోర్సులు, స్పెషల్ ఫ్లైకింగ్ ఫోర్సుల ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎంసీసీ) ఉల్లంఘనల పర్యవేక్షణకు ఫ్లయింగ్ స్క్వాడ్ల నియామకం చేశామన్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో అదనపు భద్రత కల్పించేందుకు ఏపీ స్పెషల్ పోలీస్ బలగాలు ఏర్పాటు చేశామన్నారు. హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్న ప్రాంతాల్లో అదనపు బలగాలను మోహరించి శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకున్నామన్నారు.

మొత్తం 36,351 మంది పోలీస్ బలగాల మోహరింపు

ఎన్నికల బందోబస్తు కోసం మొత్తం 36,351 మంది పోలీస్ సిబ్బంది ఏర్పాటు చేశామన్నారు. ఎస్పీలు, అదనపు ఎస్పీలు, సీనియర్ పోలీస్ అధికారులు, డీఐజీలు, ఐజీల పర్యవేక్షణలో రిజర్వ్ బృందాల ఏర్పాటు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరిగినా తక్షణమే స్పందించేందుకు క్విక్ రియాక్షన్ టీమ్‌ల నియామకం చేశామన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛగా, పారదర్శకంగా జరిగేలా అన్ని ప్రాంతాల్లో పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేసినట్లు రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యదర్శి డాక్టర్ ఏ. మల్లిఖార్జున తెలిపారు. ఐజీ బి. రాజకుమారి మాట్లాడుతూ... ఎన్నికలకు పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. హైపర్ సెన్సిటివ్, సెన్సిటివ్ పోలింగ్ కేంద్రాలను గుర్తించి 104, 102 విధానంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు. బ్యాలెట్ బాక్సుల సురక్షిత రవాణా, రూట్ క్లియరెన్స్ కోసం 1,543 రూట్ మొబైల్స్ ఏర్పాటు. శాంతిభద్రతల సమస్యలపై తక్షణం స్పందించేందుకు డీఎస్పీ, అదనపు ఎస్పీల ఆధ్వర్యంలో ఫ్లైకింగ్, స్పెషల్ ఫ్లైకింగ్ ఫోర్సుల ఏర్పాటు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనల పర్యవేక్షణకు ఫ్లయింగ్ స్క్వాడ్ల నియామకం. సమస్యాత్మక ప్రాంతాల్లో భద్రత కోసం ఏపీ స్పెషల్ పోలీస్ బలగాలు మోహరింపు. ఎన్నికల బందోబస్తు కోసం మొత్తం 36,351 మంది పోలీస్ సిబ్బంది నియామకం. అత్యవసర పరిస్థితుల్లో తక్షణమే స్పందించేందుకు సీనియర్ పోలీస్ అధికారుల పర్యవేక్షణలో రిజర్వ్ బృందాలు, క్విక్ రియాక్షన్ టీమ్‌ల ఏర్పాటు. ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛగా జరిగేలా పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టామని ఐజీ బి. రాజకుమారి తెలిపారు. సీడీ ఎమ్ఏ డైరెక్టర్ డాక్టర్ పి. సంపత్ కుమార్ మాట్లాడుతూ...పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలకు విస్తృత ఏర్పాట్లు చేశామన్నారు. రాష్ట్రంలోని 13 మున్సిపల్ కార్పొరేషన్లలో మేయర్ పదవులకు 153 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. అన్ని కార్పొరేషన్లలో ఎన్నికలు జరుగుతున్నాయి. 70 మున్సిపాలిటీల్లో చైర్‌పర్సన్ పదవులకు 367 మంది అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. కార్పొరేషన్లలోని 922 వార్డులకు 3,073 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. మున్సిపాలిటీల్లోని 2,382 వార్డులకు 6,669 మంది అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు కలిపి మొత్తం 9,642 మంది వార్డు సభ్యుల అభ్యర్థులు పోటీలో ఉన్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు సీసీటీవీ కెమెరాలు, వెబ్‌కాస్టింగ్, వీడియోగ్రఫీ ద్వారా పోలింగ్ కేంద్రాల పర్యవేక్షణ. ఇప్పటికే 6,600 ప్రాంతాల్లో సుమారు 12,000 సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు. సెన్సిటివ్, హైపర్ సెన్సిటివ్, క్రిటికల్ ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా. వీటి పరిధిలో సుమారు 5,500 ప్రాంతాలు గుర్తింపు.

ఎన్నికల విధుల కోసం సుమారు 75,000 మంది పోలింగ్ సిబ్బంది నియామకం.

పోలింగ్ సిబ్బంది డిస్పాచ్ ప్రక్రియ ప్రారంభం కాగా, రాత్రి 8 గంటలకల్లా అందరూ తమకు కేటాయించిన స్థానాలకు చేరుకునేలా చర్యలు. పోలింగ్ రోజున ప్రతి రెండు గంటలకు ఒకసారి ఎన్నికలకు సంబంధించిన సమాచారాన్ని రాష్ట్ర ఎన్నికల సంఘానికి అందించేలా ఏర్పాట్లు. ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని డాక్టర్ పి. సంపత్ కుమార్ తెలియజేశారు.

ప్రశాంత ఎన్నికల నిర్వహణకు పటిష్ట పోలీసు బందోబస్తు

పోలీసు సిబ్బందికి జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివకిషోర్ దిశానిర్దేశం



ప్రజా భూమి ప్రతినిధి, అగిరిపల్లి

నూజీవీడు మున్సిపల్ ఎన్నికలను ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు పోలీసు అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివకిషోర్ ఆదేశించారు. శనివారం నూజీవీడు సారధి ఇంజనీరింగ్ కళాశాలలో పోలీసు సిబ్బందికి నిర్వహించిన బ్రీఫింగ్‌లో ఎన్నికల విధులు, పాటించాల్సిన నిబంధనలపై దిశానిర్దేశం చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వితో కలిసి బ్యాలెట్ బాక్సుల పంపిణీ, ఓట్ల లెక్కింపు కేంద్రాలను పరిశీలించి మౌలిక సదుపాయాల ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేశారు. ఎన్నికల సందర్భంగా ఏలూరు, జంగారెడ్డిగూడెం, నూజీవీడు ప్రాంతాల్లో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు. ఓటర్లు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని, విధుల్లో నిష్పక్షపాతంగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నూజీవీడు డీఎస్పీ కె.వి.వి.ఎన్.వి. ప్రసాద్ రావు, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



గౌడు సంఘ పెద్దల కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే చిర్రి బాలరాజు

ప్రజాభూమి ప్రతినిధి,జీలుగుమిల్లి

జీలుగుమిల్లికి చెందిన గౌడు సంఘ పెద్దలు ఉలవల ముత్యం కుమారుడు ఉలవల రామకృష్ణ రాత్రి గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందడం పట్ల పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు విచారం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో శనివారం జీలుగుమిల్లిలోని ఉలవల రామకృష్ణ నివాసానికి చేరుకున్న ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ధైర్యం చెప్పారు. ఈ విషాద సమయంలో బాధిత కుటుంబానికి అండగా ఉంటామని, కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ ఆ కుటుంబానికి తోడుగా ఉంటుందని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి గడ్డమనగు రవికుమార్, చిర్రి కృష్ణయ్య, మండల అధ్యక్షుడు పసుపులేటి రాము, రూపా సత్యనారాయణ, కూరం వెంకటేష్, రాయి సుబ్బారావు, చిర్రి వెంకటేశ్వరరావు, ఉలవల శివ తదితరులు పాల్గొన్నారు.

ఏలూరులో ఏఐటీయూసీ

107వ వ్యవస్థాపక దినోత్సవం



ప్రజాభూమి ఏలూరు

ఏఐటీయూసీ 107వ వ్యవస్థాపక దినోత్సవాన్ని శనివారం ఏలూరులో అనుబంధ ఉద్యోగ, కార్మిక సంఘాలు ఘనంగా నిర్వహించాయి.పంపుల చెరువు, మెయిన్ బజార్ జల్వాని సెంటర్, వైఎంహెచ్ఏ సెంటర్లలో జెండా ఆవిష్కరణలు, మొక్కలు నాటే కార్యక్రమాలు చేపట్టారు.ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డి శ్రీనివాస్ డాంగే,జిల్లా కోశాధికారి పుప్పాల కన్నబాబు,ఏరియా కార్యదర్శి ఏ. అప్పలరాజు మాట్లాడుతూ,కార్మికులు పోరాటాలతో సాధించుకున్న 44 చట్టాలను కేంద్ర ప్రభుత్వం నాలుగు కార్మిక కోడ్లుగా మార్చి హక్కులను హరిస్తోందని విమర్శించారు.కార్మిక హక్కుల పరిరక్షణ, కాంట్రాక్టు,ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కనీస వేతనాలు,అసంఘటిత కార్మికులకు సమగ్ర చట్టం కోసం పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.కార్యక్రమాల్లో కార్మిక సంఘాల నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

వెంకన్న సన్నిధిలో రెడ్డి అప్పలనాయుడు ప్రత్యేక పూజలు



ప్రజాభూమి ఏలూరు

రామచంద్రరావుపేటలోని శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని ఏలూరు నగర కూటమి మేయర్ అభ్యర్థి, జనసేన ఏలూరు నియోజకవర్గ ఇంచార్జి రెడ్డి అప్పలనాయుడు శనివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని, కూటమి ప్రభుత్వం సస్యశ్యామలంగా పాలించాలని ప్రార్థించారు.ఆలయ చైర్మన్ పాలడుగు వెంకట రమాదేవి నేతృత్వంలో కమిటీ సభ్యులు ఆయనకు స్వాగతం పలికారు.అనంతరం వేద పండితులు ఆశీర్వచనాలు అందజేశారు.స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారం ముగిసిన నేపథ్యంలో స్వామివారిని దర్శించుకోవడం సంతోషంగా ఉందని రెడ్డి అప్పలనాయుడు తెలిపారు.నవంబర్ 1న జరగనున్న ఏలూరు నగర స్థానిక సంస్థల ఎన్నికల్లో తనతో పాటు 62 డివిజన్లలో కూటమి అభ్యర్థులు అఖండ మెజారిటీతో విజయం సాధించాలని ఆకాంక్షించారు. వెంకన్న స్వామి దివ్య ఆశీస్సులు రాష్ట్ర ప్రజలందరిపై ఉండాలని,రాష్ట్రానికి శాంతి సౌభాగ్యాలు కలగాలని ప్రార్థించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బొత్స మధు, గోక నెహ్రూ,శర్మ, 16వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థి మారం హనుమంతరావు (అను), 41వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థి పిల్లారిశెట్టి సంధ్య, సురేష్, 39వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థి ఆర్ఎన్ఆర్ నాగేశ్వరరావు, జనసేన నాయకులు రెడ్డి గౌరీ శంకర్, అల్లుసాయి చరణ్, జనసేన రవి, కూటమి నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

5వ తేదీన క్షీరా రాముడి హుండీ లెక్కింపు

- **ఈవో రేపాక శ్రీనివాసరావు వెల్లడి**

ప్రజాభూమి ప్రతి నిధి,పాలకొల్లు

పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు పట్టణంలో వేంచేసియున్న శ్రీ క్షీ రా రామలింగేశ్వర స్వామి దేవస్థానం హుండీ లెక్కింపు నవంబర్ 5వ తేదీ ఉదయం 9 గంటలకు నిర్వహించనున్నట్లు దేవస్థానం ఈవో రేపాక శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. హుండీ లెక్కింపు కార్యక్రమం ఎండోమెంట్ ఇన్స్పెక్టర్, చైర్మన్, ట్రస్ట్ బోర్డ్ సభ్యులు, రెవెన్యూ, పోలీస్, మున్సిపల్, ఆలయ సిబ్బంది నేతృత్వంలో జరుగుతుందని ఈవో ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ప్రజాభూమి
అనంతపురం,శ్రీసత్యసాయి జిల్లా 6
ఆదివారం 01 నవంబరు 2026

మున్సిపల్ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు చేపట్టాం..

- : అనంతపురం నగరంలోని ఎస్.ఎస్.బి.ఎన్ కళాశాలలో మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలకు సంబంధించి డిస్ట్రిబ్యూషన్ సెంటర్, రిసెప్షన్ కేంద్రాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ - జిల్లా ఎన్నికల అధికారి ఓ.ఆనంద్, అసిస్టెంట్ కలెక్టర్ సుయాష్ కుమార్..

ప్రజాభూమి ప్రతినిధి, అనంతపురం

అనంతపురం నగరంలోని ఎస్.ఎస్.బి.ఎన్ కళాశాలలో శనివారం మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలకు సంబంధించి డిస్ట్రిబ్యూషన్ సెంటర్, రిసెప్షన్ కేంద్రాలను అసిస్టెంట్ కలెక్టర్ సుయాష్ కుమార్ తో కలిసి జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఓ.ఆనంద్ తనిఖీ చేశారు. ఇందులోభాగంగా కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి సీసీటీవీల ద్వారా డిస్ట్రిబ్యూషన్ ను జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి పరిశీలన చేశారు. ఈ సందర్భంగా మీడియాతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని 6 లొకేషన్లలో దాదాపు 6,000 మంది పోలింగ్ సిబ్బందికి మొదటి మరియు రెండవ విడత శిక్షణ విజయవంతంగా పూర్తి చేయబడిందన్నారు. ఆదివారం జరిగే మున్సిపల్ ఎన్నికల పోలింగ్ కి సంబంధించిన డిస్ట్రిబ్యూషన్ కార్యక్రమాలు ప్రస్తుతం వేగంగా జరుగుతున్నాయన్నారు. తాడిపత్రిలో డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని పరిశీలించడం జరిగిందని, అలాగే జాయింట్ కలెక్టర్, ఆర్డీఓలు డిస్ట్రిబ్యూషన్ ప్రాంతాలను కూడా సందర్శించి ఏర్పాట్లను పరిశీలిస్తున్నామన్నారు. ప్రస్తుతానికి జిల్లాలో ఎలాంటి ఇబ్బందులు లేవని, పోలింగ్ మెటీరియల్ డిస్ట్రిబ్యూషన్ ప్రక్రియ అంతా కూడా 4 గంటల లోపు పూర్తిగా ముగియనుందని, దీనికి తగిన అన్ని ఏర్పాట్లు ముందస్తుగా చేయడం జరిగిందన్నారు. ప్రతి డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి, ఆ కనెక్షన్లను కమాండ్ కంట్రోల్ రూమ్‌కు మరియు పోలీస్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానించడం జరిగిందన్నారు. పోలింగ్ సామగ్రిని కిట్ల రూపంలో సిద్ధం చేసి, ఏ పోలింగ్ స్టేషన్‌కు ఏయే మెటీరియల్ కావాలో ఆయా కిట్లను నేడు పంపిణీ చేస్తున్నామన్నారు. ఇప్పటికే అన్ని ప్రాంతాల్లోనూ 80 శాతానికి పైగా పోలింగ్ సిబ్బంది రిపోర్ట్ చేయడం జరిగిందని, అలాగే దానికి సంబంధించిన వాహనాలు, ఇతర యంత్ర సామగ్రిని కూడా సమకూర్చడం జరిగిందనీ, రిటర్నింగ్ ఆఫీసర్లు మరియు జోనల్ ఆఫీసర్లు కూడా విధులకు హాజరయ్యారన్నారు. ఎన్నికల రోజున ఓటర్లు ఇబ్బంది పడకుండా ఉండేందుకు బేసిక్ ఇన్ఫ్రాస్ట్రక్చర్స్ ఇవ్వడం జరిగిందని, ఎన్నికల సమయంలో లిక్కర్ దుకాణాలు ఇతర అవుట్లెట్‌లను మూసివేయడం, ఎన్నికలు జరిగే ప్రాంతాల్లోని విద్యాసంస్థలు, ఆఫీసులకు సెలవులు ప్రకటించడం వంటి ముందస్తు చర్యలు చేపట్టామన్నారు. ఎన్నికలలో పాల్గొనే సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ వివరాలను అందజేసి, వారు వాటిని ఐడెంటిఫైడ్ పోలింగ్ కేంద్రాల్లో లేదా మున్సిపల్ ఆఫీసులలో సమర్పించేలా తగిన ఏర్పాట్లు చేయబడ్డాయన్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 1800 మంది పోలీసులను ఈ 6 లొకేషన్లలో గ్రిడ్ రూపంలో డిప్లాయ్ చేయడం జరిగిందని, సమస్యాత్మక, అతి సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లలో ప్రత్యేకంగా మైక్రో అబ్జర్వర్స్‌ను నియమించామని, బ్యాంక్ సిబ్బంది, ఎల్ఐసి ఉద్యోగులను ఈ మైక్రో అబ్జర్వర్స్‌గా ఉంచి, ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా పర్యవేక్షిస్తున్నామన్నారు. అనంతపురం, తాడిపత్రి, గుత్తి తదితర సున్నితమైన ప్రాంతాల్లో 100 శాతం పోలింగ్ లొకేషన్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి వాటిని కంట్రోల్ రూమ్‌కు అనుసంధానించామన్నారు. మున్సిపల్ కమిషనర్ల ఆధ్వర్యంలో ప్రతిచోటా కనీసం 10 నుండి 15 వరకు డ్రోన్‌లను కూడా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పోలీసుల రెగ్యులర్ మొబిలైజేషన్‌తో పాటు స్ట్రైకింగ్ ఫోర్సులు, రిజర్వ్ టీమ్‌లను సిద్ధంగా ఉంచామని, ఏదైనా చిన్న ఘటన జరిగినా కేవలం 3 నుండి 5 నిమిషాల వ్యవధిలో ఆ ప్రాంతానికి చేరుకుని అదనపు బలగాలు సహాయపడేలా పటిష్ట చర్యలు చేపట్టామన్నారు. జిల్లా యంత్రాంగం తరఫున సుమారు 1600 మంది సిబ్బందిని క్యూ మెయింటెనెన్స్ మరియు పోలీసులకు సహకరించేందుకు కేటాయించడం జరిగిందన్నారు. సాధారణంగా అసెంబ్లీ లేదా లోక్‌సభ ఎన్నికల్లో సెంట్రల్ ఫోర్సెస్ వస్తాయి, కానీ ఈసారి అటువంటి కేంద్ర బలగాలు లేనందున, రెవెన్యూ ఇతర ప్రాంతాల్లో శాఖల సిబ్బంది ద్వారానే బేసిక్ క్యూ మెయింటెనెన్స్ నిర్వహించేలా ఏర్పాటు చేశామన్నారు. ఇవి పూర్తిగా అర్బన్ ఎన్నికలు కావడంతో, పోలింగ్ స్టేషన్ అన్నీ అర్బన్ ఏరియాలలోనే అందుబాటులో ఉన్నాయని, ఎటువంటి దూర ప్రాంత ఇబ్బందులు లేవన్నారు. కొన్ని పోలింగ్ స్టేషన్లకు ప్రత్యేకంగా రూట్ ఆఫీసర్లను నియమించి వారికి ప్రత్యేక శిక్షణ, వాహనాలు సమకూర్చామని, చిన్న సందులు, రద్దీ రోడ్లు ఉన్న ప్రాంతాలకు వెళ్లేందుకు వీలుగా మినీ బస్సులను (సుమారు 15-20 మంది కూర్చునేవి) కూడా అందుబాటులో ఉంచామన్నారు. ప్రతి ఒక్కరూ, జిల్లాలోని ప్రతి ఒక్క ఓటరు ముందుకు వచ్చి తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ కమిషనర్ జస్వంత్ రావు, ఎన్నికల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



స్థానిక సంస్థల ఎన్నికలకు ఏర్పాట్లు ముమ్మరం

ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని పరిశీలించిన రిటర్నింగ్ అధికారి భారతి, ఎంపీడీవో మమతాదేవి

ప్రజా భూమి నార్పల



స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించి నార్పల మండలంలో అధికారులు ముందస్తు ఏర్పాట్లు చేపట్టారు. ఈ నెల 4వ తేదీన ఉదయం నుంచి జరగనున్న ఎన్నికలకు అవసరమైన సామగ్రి పంపిణీ కోసం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలను కేంద్రంగా ఎంపిక చేసి ఏర్పాట్లు చేస్తున్నారు.ఈ నేపథ్యంలో రిటర్నింగ్ అధికారి భారతి, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, ఎంపీడీవో మమతాదేవి పాఠశాల ఆవరణంతో పాటు తరగతి గదులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఎన్నికల సామగ్రి పంపిణీకి అవసరమైన గదుల ఏర్పాటు, సిబ్బంది విధుల నిర్వహణ, ఇతర మౌలిక సదుపాయాలపై సమీక్షించారు. అనంతరం జోనల్ అధికారులు, రూట్ అధికారులతో సమావేశం నిర్వహించి ఎన్నికల సామగ్రి పంపిణీకి సంబంధించిన ఏర్పాట్లపై చర్చించారు. ఎన్నికల విధులకు హాజరయ్యే సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జోనల్ అధికారులు, రూట్ అధికారులు, తదితర ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

రాప్తాడు జిల్లా పరిషత్ హై స్కూల్లో విద్యార్థినిపై ఉన్మాది దాడి ఘటనలో తీవ్రంగా గాయపడిన విద్యార్థినికి మెరుగైన వైద్యం అందించాలి : జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్..



ప్రజాభూమి ప్రతినిధి, అనంతపురం

రాప్తాడు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హై స్కూల్లో విద్యార్థినిపై ఉన్మాది దాడి ఘటనలో తీవ్రంగా గాయపడిన విద్యార్థినికి అనంతపురము జిల్లా ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి నందు స్పెషలిస్ట్ డాక్టర్లతో మెరుగైన వైద్యం అందిస్తుండగా, శనివారం జిల్లా ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థిని, వారి కుటుంబ సభ్యులను జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ పరామర్శించారు. ఉన్మాది దాడి ఘటనలో తీవ్రంగా గాయపడిన విద్యార్థినికి మెరుగైన వైద్యం అందించాలన్నారు. మరింత మెరుగైన వైద్యం అందించేందుకు తరలించాల్సిన మేరకు అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. ఎప్పటికప్పుడు అమ్మాయి ఆరోగ్యంపై ఆరా తీస్తూ పర్యవేక్షణ చేస్తున్నారు. అనంతరం విద్యార్థిని తల్లిదండ్రులను జిల్లా కలెక్టర్ పరామర్శించారు. దాడి చేసిన నిందితుడిని ఖచ్చితంగా పట్టుకుని చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.మల్లేశ్వరి, అడ్మినిస్ట్రేటర్ మల్లికార్జున రెడ్డి, ఎన్టీఆర్ వైద్య సేవ జిల్లా కోఆర్డినేటర్ గంగాధర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జోరుగా సాగుతున్న సైకిల్ ప్రచారం

కూటమి ప్రభుత్వం అభివృద్ధి లక్ష్యం

కాయల బాలకృష్ణ గెలుపే లక్ష్యంగా కూటమి నాయకుల ఇంటింటి ప్రచారం

ప్రజా భూమి శింగనమల



శింగనమల మండల కేంద్రంలో ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ ఆదేశాల మేరకు టీడీపీ బలపరిచిన ఎంపీటీసీ-1 అభ్యర్థి కాయల బాలకృష్ణను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరుతూ కూటమి నాయకులు ప్రధాన బజార్లో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు గ్రామంలోని పలు వీధుల్లో ఇంటింటికీ తిరుగుతూ ప్రజలను కలుసుకుని కరపత్రాలు పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేస్తూ ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తోందని వివరించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, తల్లికి వందనం, దీపం పథకం కింద ఉచిత గ్యాస్ సిలిండర్లు, అన్నదాత సుఖీభవ, యువతకు ఉద్యోగాలు, మహిళలకు ఆర్థిక భరోసా వంటి సంక్షేమ కార్యక్రమాలతో పాటు ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. “మాటలతో కాదు.. చేతలతో చేసి చూపించాం . కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, చేస్తున్న అభివృద్ధిని చూసి ఓటు వేయండి” అంటూ ప్రజలను కోరారు. రానున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఎంపీటీసీ-1 అభ్యర్థి కాయల బాలకృష్ణను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రచార కార్యక్రమంలో కూటమి నాయకులు, టీడీపీ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పోలింగ్ ప్రక్రియను ఎటువంటి లోటుపాట్లు లేకుండా ప్రశాంత వాతావరణంలో పూర్తి చేయాలి జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్..

ప్రజాభూమి ప్రతినిధి, అనంతపురం

మున్సిపాలిటీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ ప్రక్రియను ఎటువంటి లోటుపాట్లు లేకుండా ప్రశాంత వాతావరణంలో పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ ఆదేశించారు. శనివారం గుంతకల్లు మున్సిపాలిటీ పరిధిలో పట్టణంలోని సర్వేపల్లి రాధాకృష్ణ మున్సిపల్ బాయ్స్ హై స్కూల్ లో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ సెంటర్లు, డిస్ట్రిబ్యూషన్ సెంటర్లు మరియు పోలింగ్ బూత్‌లను జాయింట్ కలెక్టర్ సమగ్రంగా తనిఖీ చేసి పలు సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాలు మరియు డిస్ట్రిబ్యూషన్ సెంటర్లలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సిబ్బందికి కావాల్సిన మౌలిక వసతులు, భోజన సదుపాయాలు సరిగ్గా ఉన్నాయో లేదో పరిశీలించాలని తెలిపారు. పోలింగ్ సిబ్బందికి కేటాయించిన స్థలంలోనే రాత్రి బస ఉండేలా చూసుకోవాలని మరియు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసుకోవాలన్నారు. ఎన్నికల మెటీరియల్‌ను కట్టుదిట్టంగా తనిఖీ చేసుకుని సంబంధిత సిబ్బంది సురక్షితంగా తీసుకెళ్లేలా చర్యలు తీసుకోవాలని, అలాగే మైక్ సెట్లతో సహా ఇతర సాంకేతిక ఏర్పాట్లను సరిగ్గా అందుబాటులో ఉంచాలని సూచించారు. రేపు ఆదివారం ఉదయం 7:00 గంటలకే పోలింగ్ ప్రారంభం కానున్నందున, దానికి సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు మరియు శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఉద్యోగులు/సిబ్బందికి సంబంధించిన పోస్టల్ బ్యాలెట్ విధానాన్ని కూడా పరిశీలించారు. పోలింగ్ ప్రక్రియను ఎటువంటి లోటుపాట్లు లేకుండా ప్రశాంత వాతావరణంలో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.హౌతా కార్యక్రమంలో గుంతకల్ ఆర్డీవో శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్, తహసిల్దార్ పుణ్యవతి, ఎలక్షన్ ఆఫీసర్లు, తదితరులు పాల్గొన్నారు.

నవ సమాజ నిర్మాణంలో విద్యార్థుల పాత్ర కీలకం

-ఘనంగా జాతీయ ఐక్యతా దినోత్సవ వేడుకలు

ప్రజాభూమి, హిందూపురం టౌన్



నవ సమాజ నిర్మాణంలో విద్యార్థుల పాత్ర ఎంతో కీలకమని వక్తలు పేర్కొన్నారు. హిందూపురం సమీపంలోని బిఐటి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, బాలయేసు కళాశాలలో శనివారం జాతీయ ఐక్యత దినోత్సవం వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా భారతదేశ ఉక్కు మనిషి, స్వాతంత్ర్య సమరయోధుడు, దేశ తొలి ఉప ప్రధానమంత్రి సర్దార్ వల్లభభాయ్ పటేల్ 151వ జయంతిని పురస్కరించుకుని బి.ఐ.టి. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎ. రమేష్ మాట్లాడుతూ, “ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్” (ఒకే భారతదేశం -- శ్రేష్ఠమైన భారతదేశం) అనే నినాదం జాతీయ సమైక్యతకు, భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక అని వివరించారు. దేశ అభివృద్ధికి కుల, మత, ప్రాంతీయ భేదాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ ఐకమత్యంతో ముందుకు సాగాలని సూచించారు. అదేవిధంగా మాదకద్రవ్య రహిత భారతదేశ నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాలని, మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. జాతీయ సమైక్యత, దేశభక్తి, సామాజిక బాధ్యతల ప్రాముఖ్యతను వివరించి, అందరితో జాతీయ ఐక్యతా ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో దయానంద్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాలయేసు కళాశాలలో....

భారత దేశ ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని “ఐక్యతా దినోత్సవం”గా బాలయేసు డిగ్రీ కళాశాల, జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ జియావుల్లా ఖాన్ మాట్లాడుతూ, స్వాతంత్ర్య పోరాట యోధునిగా, మొదటి కేంద్ర హోమ్ శాఖా మంత్రిగా, సంస్థానాలను ఏకీకరణ చేసి అఖండ భారతావనిని ఏకం చేసిన గొప్ప వ్యక్తిగా, ఇండియన్ బిస్మార్క్‌గా పేరుపొందిన పటేల్ ఐకమత్య భావాలను యువత గుర్తుంచుకోవాలని” తెలిపారు. ప్రోగ్రాం అధికారులు అశ్వత్థ నారాయణ, హరీష్ లు వాలంటీర్లచే ఏకతా దివస్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాప్తాడు పాఠశాలలో విద్యార్థులపై దాడి ఘటనపై తీవ్ర ఆవేదన

మొండిపోగుల ఎర్రి స్వామి ఎంపీపీ స్కూల్ కమిటీ చైర్మన్

ప్రజా భూమి శింగనమల



రాప్తాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చెట్లు నరికే రంపంతో జరిగిన దాడిలో తీవ్రంగా గాయపడిన విద్యార్థినులు గోపిక, లక్ష్మీలకు అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎంపీపీ స్కూల్ కమిటీ చైర్మన్ మొండిపోగుల ఎర్రి స్వామి కోరారు. ఈ దాడి ఘటనపై ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని వైద్యులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, వారికి మెరుగైన చికిత్స అందించి త్వరగా కోలుకునేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ఈ దారుణ ఘటనకు పాల్పడిన హేమంత్‌పై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుని బాధిత విద్యార్థినులకు న్యాయం చేయాలని సంబంధిత అధికారులను డిమాండ్ చేశారు.

ఉన్మాది దాడిని ఖండించిన పీడీఎస్‌యూ

-బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి

పిడిఎస్ యూ జిల్లా అధ్యక్షులు బాబావలి



ప్రజాభూమి, హిందూపురం టౌన్ అనంతపురం జిల్లా రాప్తాడు పాఠశాలలో చోటుచేసుకున్న ఉన్మాది దాడి ఘటనను పి.డి.ఎస్.యూ జిల్లా అధ్యక్షులు బాబావలి తీవ్రంగా ఖండించారు. తరగతి గదిలోకి చొరబడిన ఓ వ్యక్తి విద్యార్థినిపై రంపంతో దాడి చేయడంతో పాటు, అడ్డుకునేందుకు ప్రయత్నించిన మరో విద్యార్థినిపై కూడా దాడికి పాల్పడటం అత్యంత హేయమైన చర్య అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనతో విద్యార్థులు, ఉపాధ్యాయులు భయాందోళనలకు గురై కన్నీళ్లు పెట్టుకోవడం హృదయవిదారకంగా ఉందన్నారు. విద్యార్థులు చదువుకునే పాఠశాలలే రక్షణ లేని ప్రాంతాలుగా మారితే వారి భవిష్యత్తుకు భరోసా ఎక్కడ ఉంటుందని ప్రశ్నించారు. ఘటనపై ఉన్నతస్థాయి విచారణ జరిపి దాడికి పాల్పడిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గాయపడిన విద్యార్థినులకు మెరుగైన వైద్యం అందించి, వారికి అవసరమైన అన్ని విధాలా సహాయ సహకారాలు అందించాలని కోరారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో పటిష్టమైన భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యార్థుల ప్రాణాలకు భరోసా కల్పించలేని విద్యావ్యవస్థ ఎవరి ప్రయోజనాల కోసం పనిచేస్తోందని ప్రశ్నించారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పాఠశాలల భద్రతపై ప్రత్యేక చర్యలు చేపట్టాలని బాబావలి కోరారు.

జోరుగా సాగుతున్న కూటమి ప్రచారం

ప్రచారంలో పాల్గొన్న శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ.

పెద్దయ్యగారి కళ్యాణి గెలుపే లక్ష్యంగా కూటమి నాయకుల ఇంటింటి ప్రచారం.

ప్రజాభూమి, పుట్లూరు.



పుట్లూరు మండల కేంద్రంలో ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ టీడీపీ బలపరిచిన ఎంపీటీసీ-అభ్యర్థి పెద్దయ్యగారి కళ్యాణి నీ అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరుతూ కూటమి నాయకులతో మండల కేంద్రంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు గ్రామంలోని పలు వీధుల్లో ఇంటింటికీ తిరుగుతూ ప్రజలను కలుసుకుని కరపత్రాలు పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేస్తూ ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తోందని వివరించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, తల్లికి వందనం, దీపం పథకం కింద ఉచిత గ్యాస్ సిలిండర్లు, అన్నదాత సుఖీభవ, యువతకు ఉద్యోగాలు, మహిళలకు ఆర్థిక భరోసా వంటి సంక్షేమ కార్యక్రమాలతో పాటు ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. పుట్లూరు మండల కేంద్రంలో కాలువ పైన నూతన బ్రిడ్జిని ఏర్పాటు చేయడం జరుగుతుందని ఈ అభివృద్ధిని చూసి సైకిల్ గుర్తుపైన ఓటు వేసి అఖండ మెజారిటీతో పెద్దయ్యగారి కళ్యాణి గెలిపించాలని ఓటర్లను కోరారు. కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, చేస్తున్న అభివృద్ధిని చూసి ఓటు వేయండి” అంటూ ప్రజలను కోరారు. రానున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రచార కార్యక్రమంలో కూటమి నాయకులు, టీడీపీ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం అక్రమ రవాణాపై ఎక్సైజ్ దాడులు

-ఐదుగురు అరెస్ట్

-398 మద్యం ప్యాకెట్లు, ద్విచక్ర వాహనం స్వాధీనం

ప్రజాభూమి, హిందూపురం టౌన్



కర్ణాటక మద్యం అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ ఎన్. లక్ష్మీ దుర్గయ్య హెచ్చరించారు. ఎక్సైజ్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు హిందూపురం ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన దాడుల్లో ఐదుగురిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి సుమారు 42 లీటర్ల కర్ణాటక మద్యం, 398 మద్యం ప్యాకెట్లు, ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఐదు కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. అనంతపురం జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ ఎస్.కె.డి.వి. ప్రసాద్, శ్రీ సత్యసాయి జిల్లా ఎక్సైజ్ అధికారి బి. నరసింహులు ఆదేశాల మేరకు ఈ దాడులు నిర్వహించినట్లు తెలిపారు. పరిగి మండలం ధనాపురం క్రాస్ రోడ్డు వద్ద ద్విచక్ర వాహనంపై కర్ణాటక మద్యం తరలిస్తున్న వ్యక్తి నుంచి 96 ఒరిజినల్ ఛాయిస్ విస్కీ ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సూగూరు క్రాస్ వద్ద మరో వ్యక్తి నుంచి 83 హైవార్డ్స్ విస్కీ ప్యాకెట్లు, తూమకుంట తనిఖీ కేంద్రం వద్ద ఇద్దరి నుంచి 106 హైవార్డ్స్ విస్కీ ప్యాకెట్లు, పూలకుంట క్రాస్ వద్ద మరో వ్యక్తి నుంచి 12 హైవార్డ్స్ విస్కీ ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. అదే విధంగా గతంలో నేరాలకు పాల్పడిన తొమ్మిది మందిపై బైండోవర్ కేసులు నమోదు చేయడంతో పాటు కల్లు నమూనాలు 11, మద్యం నమూనాలు మూడు సేకరించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో తూమకుంట చెక్‌పోస్టు సీఐ వెంకటేష్, ఎస్ఐలు పృథ్వి, వెంకటేష్, ట్రైనీ ఎస్ఐలు పృథ్వీరాజ్, వినయ్‌కుమార్‌రెడ్డి ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాభూమి
వైఎస్ఆర్ కడప, శ్రీ అన్నమ్మయ్య 7
ఆదివారం 01 నవంబరు 2026

కార్మికుల హక్కుల పరిరక్షణకు ఐక్యంగా పోరాడాలి

- ఏఐటీయూసీ 107వ వ్యవస్థాపక దినోత్సవం - జిల్లా అధ్యక్షుడు బళ్లారపు రామాంజనేయులు పిలుపు

ప్రజాభూమి, వేంపల్లె

అఖిల భారత ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఏఐటీయూసీ) 107వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం స్థానిక పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలి వద్ద వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బళ్లారపు రామాంజనేయులు ఏఐటీయూసీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం రామాంజనేయులు మాట్లాడుతూ.. 1920 అక్టోబర్ 31న బొంబాయిలో ఏఐటీయూసీ ఆవిర్భవించిందని, అప్పటి నుంచి కార్మికుల హక్కుల సాధన కోసం నిరంతరం పోరాటాలు సాగిస్తోందని తెలిపారు. ఎనిమిది గంటల పని విధానం, కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత,



సామాజిక భద్రత వంటి హక్కుల సాధనలో ఏఐటీయూసీ కీలక పాత్ర పోషించిందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సంఘటితంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులను క్రమబద్ధీకరించాలని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు సక్రమంగా అందించాలని, వారి పిల్లలకు విద్యా స్కాలర్‌షిప్‌లు మంజూరు చేయాలని, 50 ఏళ్లు నిండిన కార్మికులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని కోరారు. కార్మికుల హక్కులు, సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ ఐక్యంగా నిలబడి పోరాటాలను మరింత బలోపేతం చేయాలని రామాంజనేయులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు ఎం. నాగేశ్వరరావు, కార్యదర్శి చల్లా బాలాజీ, చలపతి, సిద్దయ్య, బాబా ఫక్రుద్దీన్, రామాంజి, శీను, బాబు, సుబ్బారావు, చిన్న, వల్లి, భాష, శీను, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీదేవికి మద్దతుగా ఎన్డీఏ కూటమి ప్రచారం

- గాజు గ్లాస్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి

ప్రజాభూమి, వేంపల్లె

ఎన్డీఏ కూటమి బలపరిచిన జనసేన పార్టీ జడ్పీటీసీ అభ్యర్థి బెస్త లక్ష్మీదేవికి మద్దతుగా శనివారం వట్టణంలో కూటమి నాయకులు, కార్యకర్తలు విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానిక నాలుగు రోడ్ల కూడలి నుంచి హనుమాన్ సర్కిల్ వరకు పలు వీధుల్లో పర్యటిస్తూ





ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలిశారు. ఈ సందర్భంగా అభ్యర్థి లక్ష్మీదేవికి మద్దతు తెలపాలని, ఎన్నికల్లో ఆమెకు కేటాయించిన గాజు గ్లాస్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో టిడిపి మండల పరిశీలకుడు రఘునాథ్ రెడ్డి, మండల కన్వీనర్ రాముముని రెడ్డి, పులివెందుల నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్తలు డా. హరీష్, దాసరి రవిశంకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి అభ్యర్థి విజయానికి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి వార్డులోనూ ప్రచారాన్ని విస్తృతం చేస్తూ ఓటర్లను కలవాలని సూచించారు. కూటమి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ఎన్నికల ప్రచారంలో పాల్గొంటూ అభ్యర్థికి మద్దతుగా నిలిచారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నాయకులు గాలి హరిప్రసాద్, సుష్మ, పుష్పలత నాయక్, మహమ్మద్ షబ్బీర్, శివకృష్ణ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి(దిల్మాంగే) పసుపులేటి వీరభద్ర, నామా వేమకుమార్, మహమ్మద్, చైతన్య కుమార్, ఫయాజ్, నాగ సుబ్బారాయుడు, మునగల చంద్ర, మనోజ్, నాగేంద్ర, అంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ కుట్రల గుట్టురట్టు.. అవినాష్ రెడ్డి బాగోతం బయటపెట్టిన బీటెక్ రవి

రేపటి పోలింగ్ నే లక్ష్యంగా వైసీపీ భారీ కుట్ర

బయటి గుండాలను పులివెందులలోకి దింపిన వైసీపీ

- వెంటనే అరెస్ట్ చేయాలి

సొంత మీడియా వాహనాలకు నిప్పు పెట్టి టీడీపీపై నెట్టే కుట్ర

ప్రజాభూమి, పులివెందుల:

పులివెందులలో రేపు జరగబోయే పోలింగ్‌ను దృష్టిలో ఉంచుకుని వైసీపీ నాయకులు భారీ కుట్రలకు తెరలేపారని టీడీపీ ఇంచార్జ్ బీటెక్ రవి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఓటమి భయంతోనే వైకాపా నేతలు అడ్డదారులు తొక్కుతున్నారని ఆయన ఆరోపించారు. పులివెందుల మున్సిపాల్‌కు ఎలాంటి సంబంధం లేని వైసీపీ గుండాలను, బయటి వ్యక్తులను వారి ఆడిటోరియంలోకి తీసుకువచ్చి తలదాచుకున్నారని బీటెక్ రవి ఆరోపించారు. పోలింగ్ రోజు అల్లర్లు సృష్టించి ప్రజలను భయభ్రాంతులకు గురిచేయాలన్నదే వారి ప్లాన్ అని, ఆ వ్యక్తులను వెంటనే పులివెందుల నుంచి బయటకు పంపించి అరెస్టు చేయాలని పోలీసు అధికారులను డిమాండ్ చేశారు.ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి ఆధ్వర్యంలోనే ఈ కుట్రలన్నీ జరుగుతున్నాయని సంచలన ఆరోపణ చేశారు. అందులో భాగంగానే వారి సొంత మీడియా వాహనాలకు వారే నిప్పు పెట్టుకుని, ఆ నెపాన్ని తెలుగుదేశం పార్టీ మీద నెట్టేయాలని చూస్తున్నారని బీటెక్ రవి బయటపెట్టారు.వైసీపీ అరాచకాలను, కుట్ర రాజకీయాలను పులివెందుల ప్రజలు గమనించాలని, ఈసారి ప్రజాస్వామ్యయుతంగా తమకు ఒక అవకాశం ఇచ్చి ఆశీర్వదించాలని ప్రజలను కోరారు.



మున్సిపల్ ఎన్నికలకు పటిష్ట బందోబస్తు -

శాంతియుతంగా నిర్వహణే లక్ష్యం: డీఐజీ కోయ ప్రవీణ్

40 వార్డుల్లో 80 పోలింగ్ బూత్ లు ఏర్పాటు

- అన్నీ సమస్యాత్మకంగానే గుర్తింపు

రింగ్ రోడ్ల చుట్టూ చెక్ పోస్టులు - బయటి వ్యక్తుల రాకపై నిఘా

నేడు పులివెందులకు వస్తున్న మాజీ సీఎం జగన్ - పటిష్ట భద్రత

ప్రజాభూమి,పులివెందుల

పులివెందుల మున్సిపాలిటీలో జరగనున్న 2వ మున్సిపల్ ఎన్నికలు శాంతియుతంగా జరిగేందుకు గట్టి చర్యలు తీసుకున్నట్లు కడప రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ తెలిపారు.శనివారం పులివెందుల డీఎస్పీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని 40 వార్డులకు గాను అధికారు లు 80 పోలింగ్ బూత్ లను ఏర్పాటు చేశారని, 40 వార్డులను సమస్యాత్మక వార్డులుగా గుర్తించామని తెలిపారు. ప్రతి బూత్ వద్ద స్పెషల్ పార్టీ పోలీసులతో గట్టి నిఘా ఏర్పాటు చేశామన్నారు.రింగ్ రోడ్ల చుట్టూ చెక్ పోస్టులు ఏర్పాటు చేసి వేరే ప్రాంతాల నుంచి జనాలు రాకుండా చర్యలు తీసుకున్నామని స్పష్టం చేశారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి నేడు మధ్యాహ్నం 1 గంట ప్రాంతంలో బెంగళూరు నుంచి పులివెందులకు చేరుకుని ఓటు హక్కును వినియోగించుకుని, సాయంత్రం 4 గంటలకు తిరిగి బెంగళూరు వెళ్తారని తమకు సమాచారం అందిందని తెలిపారు. జగన్ పర్యటన దృష్ట్యా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. శాంతియుతంగా ఎన్నికలు జరిగేందుకు రాజకీయ పార్టీలు, ప్రజలు సహకరించాలని కోరారు.ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ ప్రకాష్ బాబు, డీఎస్పీ మురళీ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటే పునాది !

ఓటు మన హక్కు-ఓటు మన బాధ్యత

స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలి

ఏఐఎఫ్ఇటిఓ జాతీయ కార్యదర్శి పి.రమణారెడ్డి

ప్రజాభూమి పోరుమామిళ్ల :

మున్సిపాలిటీలు, జెడ్పీటీసీ, ఎంపీటీసీ మరియు గ్రామ పంచాయతీ ఎన్నికలలో యువత, విద్యావంతులు, ఉద్యోగులు, మహిళలు, ప్రజలందరూ తప్పనిసరిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ ఎలివెంటరీ టీచర్స్ ఆర్గనైజేషన్ (ఎఐఎఫ్ఇటిఓ) జాతీయకార్యదర్శి పి.రమణారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం కలసపాడు లో రమణారెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు అనేది కేవలం ఒక హక్కు మాత్రమే కాదు,సమాజ భవిష్యత్తును నిర్ణయించే మహత్తర బాధ్యత అని పేర్కొన్నారు.మన ప్రాంత అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, నాణ్యమైన విద్య, మెరుగైన వైద్య సదుపాయాలు, తాగునీరు, పారిశుధ్యం, రహదారులు,ఉపాధి అవకాశాలు వంటి అంశాలపై బాధ్యతాయుతమైన పాలన అందించగల ప్రజాప్రతినిధులను ఎన్నుకోవడంలో ప్రతి ఓటు కీలకమని తెలిపారు. ముఖ్యంగా యువత రాజకీయ చైతన్యంతో ముందుకు రావాలని,విద్యావంతులు, ఉద్యోగులు ప్రజాస్వామ్య విలువల పరిరక్షణలో భాగస్వాములు కావాలని, మహిళలు స్వతంత్రంగా తమ నిర్ణయాన్ని ఓటు రూపంలో వ్యక్తపరచాలని కోరారు.కులం, మతం,ప్రాంతం,ప్రలోభాలు, డబ్బు,మద్యం వంటి



ప్రభావాలకు లోనుకాకుండా అభ్యర్థుల నిజాయితీ, సామర్థ్యం,ప్రజాసేవా దృక్పథం, గత పనితీరును పరిశీలించి ఓటు వేయాలని సూచించారు. ఒక్క ఓటు కూడా వృథా కాకూడదు.ఓటు వేయకుండా ఉండటం వల్ల మన గొంతును, మన అభిప్రాయాన్ని,మన భవిష్యత్తును నిర్ణయించే అవకాశాన్ని కోల్పోతామని అన్నారు. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఓటరు జాబితాలో తమ పేరు ఉందో లేదో ముందుగానే పరిశీలించుకుని,పోలింగ్ రోజున ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు."ఓటు మన హక్కు -- ఓటు మన బాధ్యత -- ఓటే ప్రజాస్వామ్య బలం. ప్రతి ఓటు అభివృద్ధికి బాట కావాలి. ప్రతి ఓటు ప్రజా స్వామ్యానికి రక్షణ కావాలి" అని ఆయన పేర్కొన్నారు.

రాప్తాడు పాఠశాలలో విద్యార్థినిపై దాడి చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలి

అంబేద్కర్ సర్కిల్ వద్ద నిరసన

ప్రజాభూమి,పులివెందుల

అనంతపురం జిల్లా రాప్తాడు మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థినిపై చెట్లు నరికే యంత్రంతో దాడికి పాల్పడిన ఘటనను ఆల్ ఇండియా స్టూడెంట్ పవర్ తీవ్రంగా ఖండించిందని కడప జిల్లా అధ్యక్షుడు సిదిగే దినేష్ కుమార్ అన్నారు. శనివారం పులివెందుల పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్ వద్ద ఏఐఎస్ఎఫ్ కడప జిల్లా



అధ్యక్షుడు సిదిగే దినేష్ కుమార్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థినులకే రక్షణ లేకపోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు. తరగతులు జరుగుతున్న సమయంలో పాఠశాలలోకి ప్రవేశించిన వ్యక్తి విద్యార్థినిపై దాడికి పాల్పడటమే కాకుండా, అడ్డుకునేందుకు ప్రయత్నించిన మరో విద్యార్థినిపై కూడా దాడి చేయడం బాధాకరమన్నారు.నిందితుడిని వెంటనే అరెస్టు చేసి సమగ్ర విచారణ జరిపి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బాధిత విద్యార్థినులకు మెరుగైన వైద్యం అందించి, వారి కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలవాలని కోరారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థినుల భద్రతకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, అనుమతి లేని వ్యక్తులు పాఠశాలల్లోకి ప్రవేశించకుండా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని విజ్ఞప్తి చేశారు.విద్యార్థుల హక్కులు, భద్రత, న్యాయం కోసం ఏఐఎస్ఎఫ్ నిరంతరం పోరాడుతుందని, బాధిత విద్యార్థినులకు న్యాయం జరిగే వరకు తమ నిరసన కొనసాగిస్తామని దినేష్ కుమార్ స్పష్టం చేశారు.

పుట్లూరు లో వైసీపీ ఎన్నికల ప్రచార హోరు

ఎంపీటీసీ అభ్యర్థి భూమి రెడ్డి గారి రాధమ్మ ఇంటింటా ప్రచారం.

ప్రజాభూమి, పుట్లూరు. మండల కేంద్రంలోని పుట్లూరుగ్రామంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారం శనివారం నిర్వహించింది. ఎంపీటీసీ అభ్యర్థి భూమి రెడ్డి గారి రాధమ్మ ఇంటింటా పర్యటిస్తూ ఓటర్లను కలిశారు. ఈ నందర్భంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అమలైన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తమకు మద్దతు తెలిపి గెలిపించాలని అభ్యర్థించారు. మండలంలోని అన్ని గ్రామాల్లోనూ వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు ప్రజలు మద్దతు తెలపాలని కోరారు.జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాలు, వృద్ధాప్య పింఛన్లు, గ్రామాలకు సచివాల వ్యవస్థను తీసుకువచ్చి అందరికీ అందుబాటులో ఉండి సంక్షేమ పథకాలు అందించడంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ముందు వరుసలో ఉందని కావున ప్రజలు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తమను గెలిపించాలని ఇంటింటి ప్రచారంలో ఓటర్లను ఎంపీటీసీ అభ్యర్థి భూమి రెడ్డి గారి రాధమ్మ కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ గ్రామ నాయకులు, పెద్దలు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



ఒంటిమిట్ట కోదండరామాలయంలో వైభవంగా స్నపన తిరుమంజనం



ప్రజాభూమి, ఒంటిమిట్ట: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఒంటిమిట్ట శ్రీ కోదండరామాలయంలో శనివారం ఉదయం స్వామివారికి స్నపన తిరుమంజనం సేవను అర్చకులు భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా టీటీడీ అర్చకులు, అధికారులు స్వామివారికి సమర్పించేందుకు నూతన పట్టు వస్త్రాలు, పూజా సామగ్రిని ఆలయ ప్రదక్షిణగా తీసుకువచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గర్భాలయంలో కొలువుదీరిన సీతారామలక్ష్మణ మూర్తులకు పవిత్ర జలాలు, సుగంధ ద్రవ్యాలతో శాస్త్రోక్తంగా అభిషేకం చేశారు. వివిధ పూజా కార్యక్రమాలతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. స్నపన తిరుమంజనం సేవను దర్శించుకున్న భక్తులు స్వామివారి కృపకు పాత్రులయ్యారు. సేవ ముగిసిన అనంతరం భక్తులకు స్వామివారి దర్శన సౌకర్యం కల్పించి, తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, టీటీడీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుద్ధ్య లోపంతో ఎస్సీ కాలనీవాసుల అవస్థలు

- దుర్వాసనతో ఇబ్బందులు.. దోమల బెడదతో ఆందోళన

ప్రజాభూమి, సిద్ధవటం: మండలంలోని సంటిగారిపల్లె ఎస్సీ కాలనీ సమీపంలో పారిశుద్ధ్యం అధ్వానంగా మారడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలనీ పరిసరాల్లో చెత్తాచెదారం పేరుకు పోయి దుర్వాసన వెదజల్లుతుండటంతో పాటు దోమల బెడద అధికమైందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా శనివారం వారు మాట్లాడుతూ.. కాలనీ సమీపంలోని రహదారికి



ఇరువైపులా పారిశుద్ధ్య సమస్య నెలకొని ఉందని, చెత్త తొలగింపు సక్రమంగా చేపట్టకపోవడంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయని తెలిపారు. దోమల వ్యాప్తి కారణంగా ప్రజల ఆరోగ్యానికి ముప్పు ఏర్పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి చెత్తాచెదారాన్ని తొలగించడంతో పాటు మురుగు ప్రాంతాలను శుభ్రం చేసి, దోమల నివారణకు ఫాగింగ్, బ్లీచింగ్ పౌడర్ చల్లడం వంటి చర్యలు చేపట్టాలని కోరారు. ఈ విషయమై మండల డిప్యూటీ ఎంపీడీవో మెహతాబ్ యాస్మిన్‌ను వివరణ కోరగా, సంటిగారిపల్లె ఎస్సీ కాలనీ సమీపంలోని పారిశుద్ధ్య సమస్యను పంచాయతీ కార్యదర్శి రజియా దృష్టికి తీసుకెళ్లి, తగిన చర్యలు చేపట్టి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

జనన, మరణాల నమోదు నిబంధనల్లో మార్పులు

అక్టోబర్ 1 నుంచి నూతన విధానం అమలు: తహసీల్దార్ విజయ్ కుమార్



ప్రజాభూమి, సిద్ధవటం: జనన, మరణాల నమోదు విషయంలో ప్రభుత్వం నూతన నిబంధనలను అమల్లోకి తీసుకొచ్చిందని సిద్ధవటం తహసీల్దార్ విజయ్ కుమార్ తెలిపారు. ఈ నూతన నిబంధనలు 2026 అక్టోబర్ 1వ తేదీ నుంచి అమల్లోకి వచ్చాయని ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ, శిశువు జన్మించిన 21 రోజుల్లోపు సంబంధిత ఆసుపత్రిలోనే జనన ధ్రువీకరణ పత్రం పొందవచ్చని తెలిపారు. నిర్ణీత గడువు దాటిన అనంతరం, రెండు సంవత్సరాల లోపు జననాన్ని నమోదు చేయించుకోవాల్సి వస్తే సంబంధిత వ్యక్తులు తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. తహసీల్దార్ కార్యాలయంలో స్వీకరించిన దరఖాస్తును పరిశీలన నిమిత్తం రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయానికి పంపిస్తామని, ఆర్డీఓ ధ్రువీకరణ అనంతరం జనన ధ్రువీకరణ పత్రం జారీ అవుతుందని వివరించారు. పార్లమెంట్ ఆమోదించిన చట్ట నిబంధనలకు అనుగుణంగా ఆలస్యంగా జరిగే జనన, మరణాల నమోదుకు సంబంధించిన ప్రక్రియలో మార్పులు తీసుకొచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రజలు ఈ నూతన నిబంధనలను గమనించి, జనన, మరణాల నమోదును నిర్ణీత గడువులోగా పూర్తి చేసుకోవాలని తహసీల్దార్ విజయ్ కుమార్ సూచించారు.

మాధవరం--1 ఎంపిటిసి గా సుభాషిణి ఏకగ్రీవ ఎన్నిక..

- అభినందించిన అడ్వకేట్ షేక్ నాయబ్ రసూల్



ప్రజాభూమి, సిద్ధవటం: సిద్ధవటం మండలం మాధవరం--1 ఎంపీటీసీ గా ఏకగ్రీవంగా అవ్వారు రవిశంకర్ సతీమణి సుభాషిణి ఎన్నికైన సందర్భంగా ఆయన మిత్రుడు, అన్నమయ్య జిల్లా ఇంటెలెక్చువల్ ఫోరమ్ అధ్యక్షుడు అడ్వకేట్ షేక్ నాయబ్ రసూల్ మర్యాదపూర్వకంగా కలిసి రవిశంకర్ దంపతులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా రవిశంకర్ నిర్వహిస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలను ప్రస్తావిస్తూ, మన ఊరికోసం స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్‌గా, రాష్ట్ర పద్మశాలి సంక్షేమ సంఘం యువజన విభాగం కార్యదర్శిగా ఆయన అందిస్తున్న సేవలను అభినందించారు. ప్రజలతో సన్నిహిత సంబంధాలు కలిగి, సామాజిక సేవలో చురుకుగా పాల్గొంటున్న రవిశంకర్‌కు ఎంపీటీసీ గా ఏకగ్రీవ ఎన్నిక మరింత బాధ్యతను పెంచిందని పేర్కొన్నారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ గ్రామాభివృద్ధికి కృషి చేయాలని, ప్రజాసేవలో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి ప్రజల ఆదరాభిమానాలతో మంచి పేరు సంపాదించాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు.

రన్ ఫర్ యూనిటీ కార్యక్రమం నిర్వహణ

ప్రజాభూమి, సిద్ధవటం: రాష్ట్రీయ ఏక్తా దివస్--2026 సందర్భంగా సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని భాకరాపేట 11వ పోలీసు బెటాలియన్‌లో శనివారం 'రన్ ఫర్ యూనిటీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. కమాండెంట్ కె. ఆనందరెడ్డి ఆదేశాల మేరకు జరిగిన ఈ కార్యక్రమంలో అధికారులు, పోలీసు సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. జాతీయ ఐక్యతా ప్రతిజ్ఞ చేసి, దేశ సమైక్యత, సమగ్రత, సోదరభావ పరిరక్షణకు కట్టుబడి ఉంటామని ప్రతినబూనారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ పి. రాజశేఖర్‌తో పాటు ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, ఏఆర్ఎస్ఐలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



ప్రజాభూమి

తిరుపతి,చిత్తూరు 8

ఆదివారం 01 నవంబరు 2026

పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌పై ప్రత్యేక దృష్టి.. ఎన్నికల విధుల్లో ఉన్న సిబ్బందికి సూచనలు

ప్రజా భూమి ప్రతినిధి: బుచ్చినాయుడు కండ్రిగ



తిరుపతి జిల్లా, బి.ఎన్. కండ్రిగ మండలంలో స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునే ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులు, సిబ్బందికి సంబంధించి నవంబర్ 2వ తేదీ సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం నందు ఉదయం 10 గంటలకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకునే విధానంపై అవసరమైన సమాచారం, సూచనలు అందించనున్నారు. అర్హులైన ఉద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు. ఎన్నికల విధుల్లో ఉన్న ప్రతి ఒక్కరూ పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియపై అవగాహన కలిగి ఉండాలని అధికారులు పేర్కొన్నారు.

ఫ్యాన్ గుర్తుకు ఓటెయ్యండి- మా నాన్నను గెలిపించండి

-జడ్పిటిసి అభ్యర్థి తనయుడు ఎద్దుల గిరీష్ రెడ్డి

ప్రజా భూమి ప్రతినిధి,రామచంద్రాపురం



స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారం మండలంలో అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో హోరెత్తు తోంది. మండల జడ్పీటీసీ అభ్యర్థి ఎద్దుల చంద్రశేఖ ర్‌రెడ్డి విజయాన్ని ఆకాంక్షిస్తూ ఆయన తనయుడు ఎద్దుల గిరీష్‌రెడ్డి శనివారం అనుపల్లి పంచాయతీ పరిధిలో జోరుగా ప్రచారం నిర్వహించారు. మానాన్న చంద్రశేఖర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించండని కోరుతూ గిరీష్‌రెడ్డి స్థానికులను అభ్యర్థించారు.ప్రచార కార్యక్రమంలో భాగంగా ఎంపీటీసీ అభ్యర్థి ఆరేపల్లి నందినితో కలిసి ఇంటింటికీ తిరుగుతూ 'ఫ్యాన్' గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను ఆశీర్వదించాలని కోరారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేసే తమ నాయకులను గెలిపిస్తే గ్రామాలు మరింత అభివృద్ధితో విరాజిల్లుతాయని వివరించారు. వైఎస్సార్‌సీపీ జెండాలు చేతబూని జగనన్నసంక్షేమ పథకాలు,స్థానిక అభివృద్ధిపై నినాదాలు చేస్తూ పరిసరాలను హోరెత్తించారు.ఈ కార్యక్రమంలో శంకర్ రెడ్డి,మాజీ సర్పంచ్ సాంబయాదవ్, మాజీ వార్డు మెంబర్లు కోర్లకుంట రాజశేఖర్‌రెడ్డి, కామసాని సాంబశివారెడ్డి, బోడిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి లతో పాటు పెద్ద ఎత్తున పార్టీ అభిమానులు, కార్యకర్తలు పాల్గొని ప్రచారాన్ని విజయవంతం చేశారు.

ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నేపథ్యంలో నవంబర్ 4, 5 తేదీలలో స్థానిక సెలవు ప్రకటన

ప్రజా భూమి ప్రతినిధి,తిరుపతి,



తిరుపతి జిల్లాలో 2026 సంవత్సరానికి సంబంధించి నిర్వహించనున్న రెండవ సాధారణ ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి డా. ఎస్. వెంకటేశ్వర్, ఐ.ఏ.ఎస్. స్థానిక సెలవులను ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వుల ప్రకారం, ఎన్నికల పోలింగ్ నిర్వహణకు వినియోగించే అన్ని ప్రభుత్వ భవనాలు, విద్యా సంస్థల భవనాలు మరియు ఇతర భవనాలకు 2026 నవంబర్ 4వ తేదీన (బుధవారం) మరియు పోలింగ్ జరిగే 2026 నవంబర్ 5వ తేదీన (గురువారం) స్థానిక సెలవు ప్రకటించారు. అదేవిధంగా, పోలింగ్ జరిగే ప్రాంతాలలో ఉన్న అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, స్థానిక సంస్థలు మరియు ఇతర ప్రభుత్వ సంస్థలకు 2026 నవంబర్ 5వ తేదీన (గురువారం) స్థానిక సెలవు ప్రకటించారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు, సంబంధిత అధికారులు ఈ ఉత్తర్వులను అమలు చేయాలని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఆదేశించారు.

ఎలక్షన్ మెటీరియల్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రం, కౌంటింగ్ కేంద్రం, స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించిన ఎన్నికల పరిశీలకులు

ప్రజా భూమి ప్రతినిధి,పుత్తూరు,



పుత్తూరు నగరపాలక సంస్థ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల పరిశీలకులు ఎమ్. వరప్రసాద్ ఐఏఎస్ శనివారం పుత్తూరు లోని సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఎలక్షన్ స్ట్రాంగ్ రూమ్ మరియు కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎలక్షన్ ఓట్ల కౌంటింగ్ కేంద్రం మరియు స్ట్రాంగ్ రూమ్ ను పరిశీలించి, ఎన్నికల ప్రక్రియ నిబంధనల ప్రకారం సజావుగా జరిగేలా చేపట్టిన ఏర్పాట్లను సమీక్షించారు. అదేవిధంగా ఓట్ల లెక్కింపు కేంద్రంలో చేపట్టిన ఏర్పాట్లను, స్ట్రాంగ్ రూమ్ భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నాగేశ్వరరావు, అధికారులు పాల్గొన్నారు.

ఎలక్షన్ మెటీరియల్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రం, కౌంటింగ్ కేంద్రం, స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించిన ఎన్నికల పరిశీలకులు

ప్రజా భూమి ప్రతినిధి,తిరుపతి,



తిరువతి నగరపాలక సంస్థ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల పరిశీలకులు ఎమ్. వరప్రసాద్ ఐఏఎస్ శని వారం తిరుపతిలోని ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఎలక్షన్ మెటీరియల్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని పరిశీలించారు.ఈ సందర్భంగా ఎలక్షన్ మెటీరియల్ డిస్ట్రిబ్యూషన్ మరియు మైక్రో అబ్జర్వర్ నిర్వహణ విధానాన్ని పరిశీలించి, ఎన్నికల ప్రక్రియ నిబంధనల ప్రకారం సజావుగా జరిగేలా చేపట్టిన ఏర్పాట్లను సమీక్షించారు. అదేవిధంగా ఓట్ల లెక్కింపు కేంద్రంలో చేపట్టిన ఏర్పాట్లను, స్ట్రాంగ్ రూమ్ భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ అమరయ్య, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ భరత్ నాయక్, తదితర అధికారులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

జిల్లా వ్యాప్తంగా 2,500 మంది పోలీసులతో పటిష్ట భద్రత -- సున్నిత, అత్యంత సున్నిత పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్, మైక్రో అబ్జర్వర్ల పర్యవేక్షణ - జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్

ప్రజా భూమి ప్రతినిధి,తిరుపతి,



తిరువతి నగరపాలక సంస్థతో పాటు జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల పరిధిలో నవంబర్ 1న నిర్వహించనున్న మున్సిపల్ ఎన్నికలను ప్రశాంతంగా, స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు. శనివారం ఉదయం స్థానిక ఎస్ వి ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని మున్సిపల్ కమిషనర్ ఎం. జయకృష్ణతో కలిసి పరిశీలించిన కలెక్టర్, పోలింగ్ పార్టీలకు బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పేపర్లు, ఇతర ఎన్నికల సామగ్రి పంపిణీ తీరును సమీక్షించారు. పోలింగ్ సిబ్బందికి అవసరమైన వసతులు, రవాణా ఏర్పాట్లు కల్పించినట్లు తెలిపారు. నవంబర్ 1వ తేదీ ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని, ఓటర్లు తమ ఓటరు స్లిప్పులో పేర్కొన్న పోలింగ్ కేంద్రానికి చేరుకుని ఓటు హక్కును వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే 90 శాతం ఓటరు స్లిప్పుల పంపిణీ పూర్తయిందని తెలిపారు. గర్భిణులు, బాలింతలు, దివ్యాంగులు, వృద్ధులు, మహిళా ఓటర్లకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించడంతో పాటు క్యూ నిర్వహణకు ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల సేవలను వినియోగించనున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల భద్రత కోసం జిల్లా వ్యాప్తంగా సుమారు 2,500 మంది పోలీసు సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. సున్నిత, అత్యంత సున్నిత పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్, ప్రత్యామ్నాయంగా వీడియో రికార్డింగ్ ఏర్పాటు చేశామని, ప్రతి పోలింగ్ కేంద్రంలో మైక్రో అబ్జర్వర్లను నియమించి ఎన్నికల ప్రక్రియను స్వతంత్రంగా పర్యవేక్షించేలా చర్యలు తీసుకున్నామని వివరించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో భాగంగా సంబంధిత మున్సిపల్ పరిధిలో మద్యం దుకాణాలను మూసివేసినట్లు తెలిపారు. అధికారులు, సిబ్బంది ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటిస్తూ సమన్వయంతో పనిచేయాలని, ప్రతి ఓటరు ఎలాంటి భయం, ఒత్తిడి లేకుండా స్వేచ్ఛగా ఓటు వేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ శారదా దేవి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, స్మార్ట్ సిటీ జనరల్ మేనేజర్ చంద్రమౌళి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ భరత్ నాయక్, తహసీల్దార్లు, ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థులను గెలిపించండి

-: నరసింహ యాదవ్

అభివృద్ధి, సంక్షేమానికి తిరుపతి ప్రజలు మద్దతు ఇవ్వాలి

ప్రజా భూమి ప్రతినిధి,తిరుపతి:



స్థానిక సంస్థల ఎన్నికల్లో అభివృద్ధి, సంక్షేమమే ప్రధాన అజెండాగా ముందుకు సాగుతున్న ఎన్డీఏ కూటమికి తిరుపతి ప్రజలు పూర్తి మద్దతు ఇవ్వాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గొల్ల నరసింహ యాదవ్ పిలుపునిచ్చారు. తిరుపతి మేయర్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న జేబీ శ్రీనివాస్‌తో పాటు ఎన్డీఏ కూటమి బలపరిచిన కార్పొరేటర్ అభ్యర్థులను గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో నరసింహ యాదవ్ మాట్లాడారు. రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా భావిస్తూ పాలన సాగిస్తోందని అన్నారు. అదే తరహాలో తిరుపతి నగర అభివృద్ధికి కూడా కూటమి అభ్యర్థులకు ప్రజలు అండగా నిలవాలని కోరారు.గత ప్రభుత్వ హయాంలో వైసీపీ నేతలు భూమన కరుణాకర్ రెడ్డి, భూమన అభినయ్ రెడ్డి ఆధ్వర్యంలో తిరుపతిలో అరాచకాలు, దాడులు, రౌడీయిజం చోటుచేసుకున్నాయని నరసింహ యాదవ్ ఆరోపించారు. ఆ పరిణామాలతో ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురయ్యారని విమర్శించారు.గత ఎన్నికల్లో ప్రజల ఆగ్రహానికి వైసీపీ గురై కేవలం 11 సీట్లకే పరిమితమైందని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వానికి ప్రజల్లో పెరుగుతున్న ఆదరణను చూసి వైసీపీ నేతలు ఆందోళన చెందుతున్నారని ఆరోపించారు. దొంగ ఓట్లతో ఎన్నికల్లో గెలవాలని ప్రయత్నిస్తున్నారని, ఇలాంటి చర్యలను ప్రజలు గమనించాలని కోరారు. అభివృద్ధి, సంక్షేమం కోసం కూటమి అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని, వైసీపీకి ప్రజలు తగిన సమాధానం చెప్పాలని గొల్ల నరసింహ యాదవ్ పిలుపునిచ్చారు. తిరుపతి భవిష్యత్తు అభివృద్ధికి ఈ ఎన్నికలు కీలకమని ఆయన అన్నారు.

కమలం అభ్యర్థుల గెలుపునకు ఎమ్మెల్యే బొజ్జల ప్రచారం

ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట.



బీజేపీ అభ్యర్థులకు మద్దతుగా రేణిగుంటలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో రేణిగుంట మండలంలో ఎన్డీఏ కూటమి అభ్యర్థుల తరఫున ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. ఇందులో భాగంగా శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి శనివారం బీజేపీ తరఫున జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు.అభ్యర్థులతో కలిసి మండలంలోని పలు ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలిశారు. రాబోయే ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు కమలం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కూటమి అభ్యర్థుల విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్, టీడీపీ మండల అధ్యక్షుడు చంద్రారెడ్డి, పట్టణ అధ్యక్షుడు మహబూబ్ బాషా, జి.పాలెం రాజశేఖర్‌రెడ్డి , చెర్లోపల్లి సుబ్రహ్మణ్యం రెడ్డి, ఐదవ సెగ్మెంట్ ఎన్డీఏ కూటమి అభ్యర్థి,బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బీడీ బాలాజీ, నెల్లూరు సుబ్రమణ్యం,రాజారాయల్, రాజు, వేణు, మండల ప్రధాన కార్యదర్శి సొంగా పురుషోత్తం, డి పుష్ప నాదం, మైనారిటీ నాయకులు నవాబ్,స్థానిక బీజేపీ నాయకులు, పవిత్ర రాజకుమార్, భాగ్యలక్ష్మి, మహబూబ్బాషా,ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రేణిగుంటలో నవంబర్ 2న పోస్టల్ బ్యాలెట్ పోలింగ్

ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట.



ఎన్నికల విధుల్లో ఉన్న సిబ్బందికి ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం. ఎంపీటీసీ, జెడ్పీటీసీ రెండో సాధారణ ఎన్నికలు--2026లో భాగంగా రేణిగుంట మండలంలో నవంబర్ 2న పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కె.వి. రవిచంద్ర, ఎన్నికల అధికారి ఆదినారాయణ తెలిపారు. ఈ మేరకు శనివారం రేణిగుంట ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ఏర్పాట్ల వివరాలను వెల్లడించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో నవంబర్ 2న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని తెలిపారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఈ అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ నిర్వహణకు ఆరుగురు సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. ఎల్. కృష్ణను ఓవరాల్ ఇన్‌చార్జిగా నియమించి, మిగిలిన సిబ్బందికి ఎంపీటీసీ, జెడ్పీటీసీ సెగ్మెంట్ల వారీగా బాధ్యతలు అప్పగించారు. విధులకు కేటాయించిన సిబ్బంది నవంబర్ 2న ఉదయం 8.30 గంటలకు కార్యాలయంలో హాజరుకావాలని ఆదేశించారు. పోలింగ్ ప్రక్రియలో బ్యాలెట్ రిజిస్టర్ల నిర్వహణ, ఓటర్ల సంతకాల సేకరణ, పోలింగ్ అనంతరం బ్యాలెట్లు, రిజిస్టర్లను అధికారులకు అప్పగించడం వంటి బాధ్యతలను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ఎన్నికల విధుల్లో ఉన్న అర్హులైన సిబ్బంది ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఎంపీడీవో రవిచంద్ర కోరారు.

డీపీఆర్వో శ్యామ్ కుమార్ ఉద్యోగ విరమణ

జర్నలిస్టు సంఘాల ఆధ్వర్యంలో ఘన వీడ్కోలు

ప్రజాభూమి ప్రతినిధి,నెల్లూరు:



సమాచార, పౌర సంబంధాల శాఖ (ఐ అండ్ పీఆర్)లో 33 సంవత్సరాల పాటు అంకితభావంతో విశిష్ట సేవలందించి పదవీ విరమణ పొందిన జిల్లా పౌర సంబంధాల అధికారి (డీపీఆర్వో) జొన్నకూటి శ్యామ్ కుమార్‌కు నెల్లూరులో ఘనంగా వీడ్కోలు సత్కార కార్యక్రమం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ ఎంప్యానల్ న్యూస్ పేపర్స్ అసోసియేషన్ (ఏపీఈఎన్‌పీఏ) నాయకులు వల్లూరు ప్రసాద్ కుమార్, ఉడతా రామకృష్ణ, ఆంధ్రప్రదేశ్ జర్నలిస్ట్ ఫోరం (ఏపీజేఎఫ్) జిల్లా అధ్యక్షులు శాఖమూరి శ్రీనివాసులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, "శ్యామ్ కుమార్ గారు సమాచార శాఖలో ఎన్నో ఏళ్లుగా విధి నిర్వహణలో నిబద్ధతతో పనిచేశారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య సమర్థవంతమైన వారధిగా నిలిచి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషించారు. అంతేకాకుండా జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో ఎల్లప్పుడూ ముందుంటూ, మీడియా ప్రతినిధులతో నిరంతరం స్నేహపూర్వక సంబంధాలను కొనసాగించారు. సిబ్బంది స్థాయి నుంచి క్రమశిక్షణతో డీపీఆర్వో స్థాయికి ఎదిగిన ఆయన ప్రస్థానం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకం. తన బాధ్యతలను విజయవంతంగా పూర్తి చేసుకుని పదవీ విరమణ చేస్తున్న ఆయన విశ్రాంత జీవితం ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో సాగాలి" అని మనసారా ఆకాంక్షించారు. అనంతరం శ్యామ్ కుమార్ గారిని శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

కూటమి పార్టీల అభ్యర్థుల తరఫున ప్రచారంలో శంకర్ రెడ్డి..

టీడీపీ, జనసేన ఎంపీటీసీ అభ్యర్థులకు మద్దతుగా ఇంటింటా ప్రచారం

ప్రజా భూమి ప్రతినిధి: బుచ్చినాయుడు కండ్రిగ



తిరుపతి జిల్లా బుచ్చినాయుడు కండ్రిగ మండలంలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. ఈ నేపథ్యంలో శంకర్ రెడ్డి తెలుగుదేశం, జనసేన పార్టీలకు చెందిన ఎంపీటీసీ అభ్యర్థుల తరఫున వేర్వేరు గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో పాల్గొనడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. మండల కేంద్రం బుచ్చినాయుడు కండ్రిగలో తెలుగుదేశం పార్టీ ఎంపీటీసీ అభ్యర్థి చాముండేశ్వరి విజయాన్ని కాంక్షిస్తూ శంకర్ రెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గ్రామంలోని ఓటర్లను కలుసుకొని పార్టీ అభ్యర్థికి మద్దతు తెలపాలని కోరారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రచారంలో పాల్గొన్నారు.అదేవిధంగా కంచనపుత్తూరు గ్రామంలో జనసేన పార్టీ ఎంపీటీసీ అభ్యర్థి కి. భాషకు మద్దతుగా శంకర్ రెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గ్రామ ప్రజలను కలుసుకొని అభ్యర్థికి మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. గ్రామ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేసే నాయకత్వాన్ని ఆదరించాలని కోరారు. ఇలా రెండు పార్టీలకు చెందిన ఎంపీటీసీ అభ్యర్థుల తరఫున శంకర్ రెడ్డి ప్రచార కార్యక్రమాల్లో పాల్గొనడం మండల రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది. ఆయా గ్రామాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రచారంలో పాల్గొన్నారు.

రేణిగుంట మండలంలో వైఎస్సార్‌సీపీ జోరుగా ఎన్నికల ప్రచారం

ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట.



ప్రజా సమస్యలను ఓటు రూపంలో చూపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా రేణిగుంట మండలం,కరకంబాడి తారక రామానగర్ లో మన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జడ్పిటిసి అభ్యర్థి గంగారి సుజాత ని అలాగే ఎంపీటీసీ సభ్యులు నాగరాజ్, హేమలత, దిలీపులను అఖండ మెజారిటీతో గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి , ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,ఒక మంచి మనసున్న నాయకుడు,ఎవరు ఏ సమస్య చెప్పిన ఆయన సమస్యల భావించి ప్రజల పక్షాన నిలిచే రమేష్ గారి సతీమణి గంగారి సుజాత ని జడ్పిటిసి అభ్యర్థిగా అఖండ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరుతున్నట్లు తెలిపారు. అలాగే జగనన్న ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఎన్నో సంక్షేమ పథకాల ద్వారా పేద ప్రజలకు అండగా ఉన్నారని కానీ నేడు రాష్ట్రంలో ఆ పరిస్థితి లేదని అన్నారు. గడపగడపలో ప్రజలు ఎన్నో సమస్యలు తెలుపుతున్నారని వాళ్ళ బాధను అన్నింటిని ఓటు రూపంలో చూపించబోతున్నారు అన్నారు.జడ్పిటిసి ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని మరోసారి కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిద్ధగుంట సుధాకర్ రెడ్డి, తిరుమలరెడ్డి, హరి ప్రసాద్ రెడ్డి,రమేష్, శ్రీధర్ రెడ్డి,సంధ్య, పురుషోత్తం, సుబ్రహ్మణ్యం, పార్థసారథి, దిలీప్, శివ కుమార్ జయదేవ్ శ్రీను ధర్మ వెంకటయ్య భాస్కర్ కన్నయ్య ఇంటియాద్ మురగయ్య దశరథ ముని కృష్ణయ్య గణేష్ స్వర్ణలత అమ్ములమ్మ హసీనా సాహిదా జయంతి యుగంధర్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాభూమి
తిరుపతి,చిత్తూరు 9
ఆదివారం 01 నవంబరు 2026

ప్రజాస్వామ్య భద్రత మీ చేతుల్లోనే ఉంది

మీ అప్రమత్తతతో పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసేలా చర్యలు చేపడదాం - అడిషనల్ ఎస్పీ అడ్మిన్ మహబూబ్ బాష.

స్థానిక మున్సిపల్ ఎన్నికల పోలింగ్ బందోబస్తుకు కేటాయించిన సిబ్బందికి దిశానిర్దేశం చేసిన అడిషనల్ ఎస్పీ అడ్మిన్.





ప్రజా భూమి ప్రతినిధి చిత్తూరు

అందరూ సమిష్టిగా శ్రమించి పోలింగ్ ప్రక్రియను ప్రశాంతంగా ముగిసేలా విధులు నిర్వర్తించాలని అడిషనల్ ఎస్పీ అడ్మిన్ మహబూబ్ బాష పిలుపునిచ్చారు. జిల్లా ఎస్పీ తుషార్ డూడి, ఐపీఎస్ ఆదేశాల మేరకు స్థానిక మున్సిపల్ ఎన్నికల పోలింగ్ విధులకు వెళు్తన్న పోలీసు అధికారులు, రూట్ ఆఫీసర్లు మరియు సిబ్బందితో ఈరోజు సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ అడ్మిన్ మహబూబ్ బాష మాట్లాడుతూ, జిల్లాలో ఆదివారం జరిగే పోలింగ్ రోజున పోలీసు సిబ్బంది పాటించాల్సిన విధివిధానాలు, చేయాల్సినవి, చేయకూడనివి వివరించారు. పోలింగ్ లొకేషన్ బందోబస్తు సిబ్బంది నుంచి మొబైల్ పార్టీలు, ట్రైకింగ్ ఫోర్స్, , స్పెషల్ ట్రైకింగ్ బృందాల వరకు ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఏదైనా సమస్య తలెత్తే అవకాశం ఉంటే వెంటనే ఉన్నతాధికారులు మరియు ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకెళ్లి, సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. చిత్తూరు సబ్ డివిజన్ డీఎస్పీ జె. వెంకటనారాయణ మాట్లాడుతూ, పోలింగ్ విధుల్లో ఉన్న సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ఎన్నికల నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రతి ఒక్కరూ తమకు కేటాయించిన విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలని తెలిపారు.

ఓటర్లతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, క్యూలైన్ నిర్వహణ సక్రమంగా చేపట్టాలని సూచించారు. ప్రిసైడింగ్ అధికారి అనుమతి లేకుండా బందోబస్తు సిబ్బంది పోలింగ్ స్టేషన్లలోకి ప్రవేశించరాదని స్పష్టం చేశారు. ప్రజలు గుంపులుగా గుమిగూడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పోలింగ్ ముగిసిన అనంతరం ఓటింగ్ యంత్రాలు స్ట్రాంగ్ రూమ్‌లకు చేరుకునే వరకు పటిష్టమైన భద్రత కల్పించాలని ఆదేశించారు. ప్రతి పోలీసు సిబ్బంది అప్రమత్తత, సమన్వయం, క్రమశిక్షణతో విధులు నిర్వర్తించి ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు కృషి చేయాలని అధికారులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏ.ఆ.డి.ఎస్పి రామకృష్ణ సబ్ డివిజన్ ఇన్స్పెక్టర్లు, ఎస్.ఐ. లు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల ప్రశాంతతకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు

తప్పుడు ప్రచారాలు, అసత్య సమాచారంతో సెన్సేషన్ సృష్టిస్తే కేసులు తప్పవు: జిల్లా ఎస్పీ. సుబ్బరాయుడు





ప్రజా భూమి ప్రతినిధి,తిరుపతి,

తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు జిల్లా పరిధిలోని నూళ్లూరుపేట, నాయుడుపేట, వెంకటగిరి, పుత్తూరు మున్సిపాలిటీల ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం, పోలీస్ శాఖ సమన్వయంతో పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాయి. ఈ నేపథ్యంలో తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, ఐపీఎస్., శనివారం తిరుపతి ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని పరిశీలించారు. ఎన్నికల విధులకు హాజరైన సిబ్బందికి ఎన్నికల సామగ్రి పంపిణీ ప్రక్రియ, అక్కడ చేపట్టిన ఏర్పాట్లను తనిఖీ చేశారు. ఎన్నికల విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలని, అధికారులు, సిబ్బంది సమన్వయంతో వ్యవహరించాలని సూచించారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నుంచి ఎన్నికల సామగ్రితో సిబ్బంది తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు బయలుదేరి వెళ్లారు. ఎన్నికల భద్రతలో భాగంగా సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి అవసరమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. రూట్ మొబైల్స్, స్ట్రైకింగ్ ఫోర్సులు, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్సులను అందుబాటులో ఉంచారు. ప్రతి మున్సిపాలిటీ పరిధిలో అదనపు ఎస్పీ స్థాయి అధికారులు భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టారు. అనంతరం మీడియాతో మాట్లాడిన జిల్లా ఎస్పీ , ఎన్నికల సమయంలో ప్రజల్లో భయాందోళనలు కలిగించేలా, తప్పుడు సమాచారంతో గందరగోళం సృష్టించేలా ఎవరైనా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. 39వ వార్డుకు సంబంధించి భర్త కిడ్నాప్ అయ్యాడంటూ ఉదయాన్నే ప్రచారం చేసి సెన్సేషన్ సృష్టించిన ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారని తెలిపారు. సంబంధిత వ్యక్తులతో మాట్లాడి వివరాలు సేకరించగా, సదరు వ్యక్తి స్వయంగా ఫోన్ స్విచ్ఛాఫ్ చేసుకుని వెళ్లినట్లు వెల్లడైందని, ఆయన క్షేమంగా ఉన్నారని తెలిపారు. నాయకులే స్వయంగా ఆయనను పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి హాజరుపరిచారని వివరించారు. ఈ వ్యవహారంలో తప్పుడు సమాచారంతో ప్రజల్లో గందరగోళం సృష్టించిన చర్యలపై ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘన కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు. రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పకడ్బందీగా అమలు చేస్తున్నామని, రాజకీయ నాయకులు, అభ్యర్థులు ఎన్నికల నియమ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని జిల్లా ఎస్పీ సూచించారు. ఓటర్లను ప్రలోభపెట్టడం, ప్రభావితం చేయడం, బెదిరించడం లేదా ఎన్నికల ప్రశాంతతకు భంగం కలిగించే చర్యలకు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముఖ్యంగా సోషల్ మీడియా వేదికగా నిర్ధారణ లేని సమాచారాన్ని, అసత్య ప్రచారాలను వ్యాప్తి చేసి ప్రజల్లో గందరగోళం సృష్టించవద్దని సూచించారు. ప్రజలకు లేదా ఓటర్లకు ఏవైనా సమస్యలు, ఇబ్బందులు ఎదురైతే వెంటనే పోలీస్ శాఖకు ఫిర్యాదు చేయవచ్చని, సమస్యల పరిష్కారానికి పోలీస్ యంత్రాంగం అందుబాటులో ఉంటుందని ఎస్పీ గారు తెలిపారు. ప్రజలు ఎలాంటి భయాందోళనలకు, ప్రలోభాలకు, ఒత్తిళ్లకు గురికాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా, ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా జరిగేలా జిల్లా యంత్రాంగం, పోలీస్ శాఖ నిరంతరం అప్రమత్తంగా ఉంటాయని లిజిల్లా ఎస్పీ స్పష్టం చేశారు.

చంద్రగిరి పట్టణంలో ఊపందుకున్న కూటమి ప్రచారం..!

ఎమ్మెల్యే పులివర్తి నాని అభివృద్ధి సంకల్పమే మా గెలుపు బాట: జెడ్పీటీసీ అభ్యర్థి కొండేపాటి మధుమతి

3వ సెగ్మెంట్ అభ్యర్థి కాపువీధి సునీల్, 4వ సెగ్మెంట్ అభ్యర్థి సక్కురు ధనంజయ రెడ్డిల ఇంటింటి బాట..

కూటమి నాయకులు, ప్రజాప్రతినిధుల భారీ బలప్రదర్శన.. సైకిల్ గుర్తుకే పట్టం కట్టాలని పిలుపు..





ప్రజాభూమి ప్రతినిధి,చంద్రగిరి:

స్థానిక సంస్థల ఎన్నికల సమరంలో చంద్రగిరి పట్టణంలో తెలుగుదేశం పార్టీ ఎన్నికల ప్రచారం సరికొత్త ఊపందుకుంది. చంద్రగిరి మండల జెడ్పీటీసీ అభ్యర్థిని కొండేపాటి మధుమతితో పాటు పట్టణ పరిధిలోని 3వ సెగ్మెంట్ ఎంపీటీసీ అభ్యర్థి కాపువీధి సునీల్ రెడ్డి, 4వ సెగ్మెంట్ ఎంపీటీసీ అభ్యర్థి సక్కురు ధనంజయ రెడ్డిల గెలుపే ధ్యేయంగా నాయకులు, కార్యకర్తలు పట్టణ వీధుల్లో విస్తృత ప్రచారం నిర్వహించారు. స్థానిక ప్రజలను ఎంతో ఆప్యాయంగా పలకరిస్తూ, ఇంటింటికీ తిరుగుతూ ఓట్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ అభ్యర్థి కొండేపాటి మధుమతి మాట్లాడుతూ.. చంద్రగిరి శాసనసభ్యులు పులివర్తి నాని తనపై సంపూర్ణ నమ్మకంతో జెడ్పీటీసీ అభ్యర్థిగా సేవ చేసే అవకాశం కల్పించారని తెలిపారు. చంద్రగిరి నియోజకవర్గంలో మహిళా ఓటర్లు అత్యధిక సంఖ్యలో ఉన్నారని, మహిళల ఆత్మగౌరవానికి, ఉన్నతికి సరైన గుర్తింపు ఇచ్చే ఏకైక పార్టీ తెలుగుదేశం మాత్రమేనని ఆమె స్పష్టం చేశారు. పేదరిక నిర్మూలన లక్ష్యంగా ప్రభుత్వం అందిస్తున్న పెరిగిన పెన్షన్లు, దీపం పథకం కింద ఉచిత గ్యాస్ సిలిండర్లు, స్త్రీ శక్తి పథకంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలతో ప్రజల్లో పూర్తి సంతృప్తి నెలకొందని పేర్కొన్నారు.ఎమ్మెల్యే పులివర్తి నాని కృషితోనే నేడు చంద్రగిరి పట్టణం సర్వతోముఖాభివృద్ధి సాధిస్తోందని అభ్యర్థులు తెలిపారు. పట్టణంలో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న ఆధునిక వైకుంఠ ధామం (శ్మశాన వాటిక), అంతర్గత సిమెంట్ రోడ్లు, పురాతన హిందూ దేవాలయాల పునర్నిర్మాణం, జీర్ణోద్ధరణ పనులు, చెరువుల అనుసంధానం వంటి భారీ ప్రగతి పనులు వేగంగా సాగుతున్నాయని గుర్తుచేశారు. జెడ్పీటీసీగా తనను, 3, 4వ సెగ్మెంట్లలో సునీల్, ధనంజయ రెడ్డిలను, 1వ సెగ్మెంట్లో ఉగ్రాణం గురునాథం రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపిస్తే జిల్లా, మండల పరిషత్ నిధులను మరింతగా సాధించి పట్టణాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు.పట్టణంలోని బజారు వీధి, ఆకుతోట వీధి, కసాయి వీధి, జెండామాను వీధి, రాములవారి గుడి వీధి, భారతీనగర్, ఆర్.ఎఫ్. రోడ్డు, రెడ్డి వీధి, దిగువ వీధి, కాపు వీధి, ముకుంద వీధి, శ్రీ మూలస్థాన ఎల్లమ్మ గుడి వీధి, కావమ్మ గుడి వీధుల్లో అభ్యర్థులు ఇంటింటికీ వెళ్తూ ఓటర్లను నేరుగా కలిశారు. అడుగడుగునా మహిళలు మంగళహారతులు పట్టి, పూలవర్షం కురిపిస్తూ అభ్యర్థులకు ఘన స్వాగతం పలికారు.ఈ ప్రచార కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గౌస్ బాషా, మాజీ జెడ్పీటీసీ సభ్యులు వీరంగారి రమేష్ రెడ్డి, ప్రముఖ నేత రమణమూర్తి, శ్రీ మూలస్థాన ఎల్లమ్మ ఆలయ చైర్మన్ మొక్కల చంద్రశేఖర్ రెడ్డి, నాయకులు కొండూరు ప్రవీణ్, పోతల ప్రవీణ్ కుమార్, కొమ్మినేని అజయ్ స్వామి, రాజులగారి వినోద్ కుమార్ రెడ్డి, కోట లోక, ఉగ్రాణం మురళి, అంగేరెడ్డి వెంకటరెడ్డి, ఉగ్రాణం చరణ్, రవి యాదవ్, దివాకర్ రెడ్డి, యారాసి రవి, యారాసి చందు, డిష్ గోపి, కొమ్మినేని నాగరాజు, ప్రిన్స్ టైలర్ చిన్నిలతో పాటు పెద్ద సంఖ్యలో మహిళలు, పట్టణ ప్రముఖులు, కూటమి కార్యకర్తలు పాల్గొన్నారు. అభ్యర్థులందరినీ 'సైకిల్' గుర్తుపై ఓటు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

పోస్టల్ బ్యాలెట్ ను సద్వినియోగం చేసుకోండి -ఆర్వో వసంత భాయ్



ప్రజాభూమి ప్రతినిధి,రామచంద్రపురం

ఎన్నికల విధులు నిర్వహించే ఉద్యోగులు పోస్టల్ బ్యాలెటును సద్వినియోగం చేసుకోవాలని ఆర్ఓ వసంత బాయ్ కోరారు శనివారం ఎంపీడీవో కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఎంపీడీవో కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారురెండవ తేదీ ఉదయం 10 గంటల నుంచి సాయంకాలం 5 గంటల వరకు అభ్యర్థులు తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చు అన్నారు.

మున్సిపల్ ఎన్నికలకు సర్వం సిద్ధం - ప్రశాంత పోలింగ్‌కు పటిష్ట ఏర్పాట్లు

నమస్యాత్మక కేంద్రాల్లో అదనపు బలగాలు – వెబ్‌కాస్టింగ్‌తో నిఘా

208 మంది సూక్ష్మ పరిశీలకుల నియామకం: జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి



ప్రజాభూమి, పులివెందుల:

వైఎస్సార్ కడప జిల్లాలో నవంబర్ 1వ తేదీన జరగనున్న మున్సిపల్ ఎన్నికల పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి తెలిపారు. ప్రశాంత వాతావరణంలో, స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు జరిగేలా అన్ని చర్యలు తీసుకున్నామని చెప్పారు.శనివారం పులివెందుల జేఎన్టీయూ క్యాంపస్‌లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలిం చారు. అక్కడి సౌకర్యాలపై పోలింగ్ సిబ్బందిని అడిగి తెలుసు కుని అధికారులకు పలు సూచనలు చేశారు.పోలింగ్ సామగ్రి పంపిణీ ప్రక్రియ సజావుగా సాగుతోందని, ఈ ఏడు కేంద్రాలనే ఎన్నికల సామగ్రి స్వీకరణ, భద్రపరిచే గదులు, ఓట్ల లెక్కింపు కేంద్రాలుగా సిద్ధం చేశామని తెలిపారు. పోలింగ్ సిబ్బందికి తాగునీరు, భోజనం, కూర్చునే సదుపాయం, మరుగుదొడ్లు, విద్యుత్ దీపాలు వంటి సౌకర్యాలు కల్పించామన్నారు.ప్రతి పోలింగ్ కేంద్రానికి నాలుగు చొప్పున ఓటర్ల జాబితా ప్రతులు, బ్యాలెట్ పత్రాలు, బ్యాలెట్ పెట్టెలు, బాణం గుర్తు రబ్బరు ముద్రలు, చెరగని సిరా తదితర సామగ్రిని అందజేశామని తెలిపారు.గత నామినేషన్ల సమయంలో జరిగిన ఘటనలను దృష్టిలో ఉంచుకుని కడప, పులివెందుల, జమ్మలమడుగు ప్రాంతాల్లో ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టామని, అదనపు పోలీసు బలగాలను సిద్ధంగా ఉంచామని తెలిపారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక కేంద్రాలను గుర్తించి ప్రత్యేక నిఘా, వెబ్‌కాస్టింగ్, సీసీ కెమెరాలతో పర్యవేక్షిస్తున్నామని, పోలింగ్ కేంద్రాలను నిశితంగా గమనించేందుకు 208 మంది సూక్ష్మ పరిశీలకులను నియమించామన్నారు. ఓటర్లు ఎలాంటి భయం లేకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో చిన్నయ్య, మున్సిపల్ కమిషనర్ తనూజ తదితర అధికారులు పాల్గొన్నారు.

ఫ్యాన్ జెండాలతో హరిజనవాడ వీధుల్లో వైసీపీ ప్రచార సందడి!

వాకాడు హరిజనవాడలో వైసీపీ ప్రచార సందడి.. ఇంటింటికీ వెళ్లిన అభ్యర్థులు, మహిళా కార్యకర్తలు



ప్రజాభూమి ప్రతినిధి, వాకాడు

వాకాడు హరిజనవాడలో వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ అభ్యర్థి గూడూరు సుధారెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రచారానికి ముందు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె భర్త గూడూరు సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. హరిజనవాడలో మురుగు కాలువల సమస్య పరిష్కారం, వీధిలైట్ల ఏర్పాటు, ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధికి కృషి చేస్తామని అభ్యర్థి తరపున హామీ ఇచ్చారు. ప్రచారంలో మహిళా కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పార్టీ జెండాలతో నాయకులు, కార్యకర్తలు వీధుల్లో పర్యటిస్తూ ఓటర్లను కలుసుకున్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీనాయకుడు రామ్ కుమార్ రెడ్డి పిలుపుమేరకు ప్రతి కార్యకర్త ప్రజలతో మమేకమై ప్రజాసేవా దృక్పథంతో పనిచేయాలని, ప్రతి కార్యకర్త మరో జగన్‌గా మారాలని తెలిపారు.కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, మహిళా కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

వివాహ వార్షికోత్సవ వేడుకల్లో సేవా కార్యక్రమం.. గిరిజన మహిళలకు బిర్యానీ ప్యాకెట్ల పంపిణీ!

ఎం.వి. రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆప్యాయంగా వేడుకలు.. గిరిజనులతో కలిసి భోజనం చేసిన దంపతులు



ప్రజాభూమి ప్రతినిధి,వాకాడు

వివాహ వార్షికోత్సవాన్ని ఆడంబరాలకు దూరంగా సేవా కార్యక్రమంతో జరుపుకుంటూ ఎం.వి. రావు ఫౌండేషన్ చైర్మన్ ముప్పవరపు లీలా మోహన్ కృష్ణ, కార్యదర్శి ఎం. విజయలక్ష్మి ఆదర్శంగా నిలిచారు. తమ 39వ వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం వాకాడు పంచాయతీ పరిధిలోని నేదురుమల్లి జనార్ధన్ రెడ్డి గిరిజన కాలనీలో నివసిస్తున్న మహిళలు, చిన్నారులు, వృద్ధులకు ఆహార పొట్లాలను పంపిణీ చేశారు. కోట మండలం చెందోడు గ్రామానికి చెందిన లీలా మోహన్ కృష్ణ, విజయలక్ష్మి దంపతులు స్థానిక అంగన్‌వాడీ కేంద్రం వద్ద అంగన్‌వాడీ కార్యకర్త చెంతమ్మ పర్యవేక్షణలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కాలనీలోని మహిళలు, వృద్ధులకు మధ్యాహ్న భోజనంగా బిర్యానీ ప్యాకెట్లను అందజేశారు. ఈ సందర్భంగా లీలా మోహన్ కృష్ణ మాట్లాడుతూ.. మహిళలు, చిన్నారులు, వృద్ధులతో కలిసి తమ వివాహ వార్షికోత్సవాన్ని జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. సమాజంలోని నిరుపేదలు, అవసరంలో ఉన్నవారికి చేతనైన సహాయం అందించడమే తమకు నిజమైన సంతృప్తినిస్తుందని తెలిపారు. ఆహార పొట్లాల పంపిణీ అనంతరం దంపతులు గిరిజనులతో కలిసి భోజనం చేసి వారి ఆత్మీయ శుభాకాంక్షలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎం.వి. రావు ఫౌండేషన్ చైర్మన్ ముప్పవరపు లీలా మోహన్ కృష్ణ, కార్యదర్శి ఎం. విజయలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్త, ఆయమ్మలు, గిరిజన మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.

రాయలపురం, వెంకటంపేటలో టీడీపీ ఎంపీటీసీ అభ్యర్థి కె. భువనేశ్వరి ప్రచార హోరు..!



ప్రజాభూమి ప్రతినిధి, చంద్రగిరి:

చంద్రగిరి మండలం తొండవాడ గ్రామంలో కూటమి అభ్యర్థి టీడీపీ ఎంపీటీసీ అభ్యర్థి కె. భువనేశ్వరి ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. ప్రచారంలో భాగంగా రాయలపురం, వెంకటంపేట ప్రాంతాల్లో ఆమె విస్తృతంగా పర్యటించి ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలుసుకున్నారు.ఈ సందర్భంగా స్థానిక ప్రజలు, మహిళలు ఆమెకు ఘన స్వాగతం పలుకుతూ ప్రచారంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రజలతో మమేకమవుతూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్న భువనేశ్వరి, గ్రామ అభివృద్ధికి అంకితభావంతో కృషి చేస్తానని తెలిపారు. గ్రామంలో మౌలిక వసతుల కల్పన, మహిళా సంక్షేమం, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ సేవ చేసే అవకాశం కల్పించాలని ఓటర్లను అభ్యర్థించారు. రాయలపురం, వెంకటంపేట వీధుల్లో సాగిన ఎన్నికల ప్రచారంతో గ్రామంలో రాజకీయ సందడి నెలకొంది. ఈ కార్యక్రమంలో జనసేన, బిజెపి, టీడీపీ కూటమి నాయకులు, కార్యకర్తలు, మహిళలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని అభ్యర్థికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు.

ప్రజాభూమి

జనరల్ 10

ఆదివారం 01 నవంబరు 2026

ఎన్నికల వేళ 100 మందిపై బైండోవర్

ప్రజా భూమి యల్లనూరు



స్థానిక ఎన్నికలు ఎంపీటీసీ జడ్పిటిసి గ్రామపంచాయతీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు ముందస్తు చర్యల్లో భాగంగా యల్లనూరు మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన 100 మందికి ముందుగా నోటీసులు ఇచ్చి ఆపై బైండోవర్ చేసినట్లు ఎస్సై రామాంజనేయ రెడ్డి తెలియజేశారు అదేవిధంగా ఈ సంవత్సరం(2026) జనవరి నుండి అక్టోబర్ వరకు దాదాపు 150 మందిని బైండోవర్ చేసామన్నారు ఎన్నికలవేళ ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదని నిబంధనలను ఉల్లంఘించి గొడవలకు ప్రేరేపించే వారి పైన బైండోవర్ కేసులు నమోదు చేయడంతో పాటు నాన్ బెయిలబుల్ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు కావున ప్రజలు ఎన్నికలు ప్రశాంతంగా జరుపుకోవాలని పోలీసులు తప్పకుండా ప్రజలకు రక్షణ కల్పిస్తామని అదేవిధంగా ప్రజలు పోలీసులకు సహకరించాలని మండల ప్రజలను ఆయన కోరారు.

గూగూడులో వైసీపీ ఎన్నికల ప్రచార హోరు

జడ్పీటీసీ, ఎంపీటీసీ అభ్యర్థులకు మద్దతుగా ఇంటింటా ప్రచారం

ప్రజా భూమి నార్పల

మండలంలోని గూగూడు గ్రామంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారం నిర్వహించింది. సింగనమల నియోజకవర్గం, నార్పల మండల జడ్పీటీసీ అభ్యర్థి బి. శివానందరెడ్డి, గూగూడు ఎంపీటీసీ అభ్యర్థి సుజాత ఇంటింటా పర్యటిస్తూ ఓటర్లను కలిశారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అమలైన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తమకు మద్దతు తెలిపి గెలిపించాలని అభ్యర్థించారు. మండలంలోని అన్ని గ్రామాల్లోనూ వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు ప్రజలు మద్దతు తెలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి నార్పల సత్యనారాయణరెడ్డి పాల్గొని ప్రచారంలో భాగస్వాములయ్యారు. గ్రామ నాయకులు, పెద్దలు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

70 వారాలుగా నిరంతర అన్నదాన సేవ

సేవా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న జే రాంచరణ్ యాదవ్

ప్రజా భూమి శింగనమల





శింగనమల మండలం వరిధిలోని క్రాస్‌లోని అమరావతి రోడ్డు వద్ద శ్రీ ఋష్యశృంగ మహాముని, శ్రీ రంగరాయల వారి జ్ఞాపకార్థం 70వ శనివారం అన్న దాన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమ నిర్వాహకుడు జె. రామ్ చరణ్ యాదవ్ మాట్లాడుతూ 70 వారాలుగా అన్నదానానికి సహకరిస్తున్న భక్తులకు కృతజ్ఞతలు తెలిపారు. చిన్న జలాలపురానికి చెందిన బోయ నారాయణ నిత్యావసర సరుకులు అందించి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆయనకు స్వామివారి చిత్రపటాన్ని అందించి సన్మానించారు.

రాప్తాడు ఘటనపై అనంతపురం ఎంపీ అంబికా దిగ్భ్రాంతి

ప్రజాభూమి ప్రతినిధి, అనంతపురం



రాప్తాడులోని ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థినిపై జరిగిన దాడి ఘటనపై అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పట్టపగలు.. సహచర విద్యార్థులతో కలసి నిండు తరగతి గదిలో చదువుకుంటున్న విద్యార్థినిపై ఓ ప్రేమోన్మాది దాడి చేయడం దారుణమని ఆయన పేర్కొన్నారు. ఇటువంటి ఘటనలను తమ ప్రభుత్వం ఉపేక్షించదని స్పష్టం చేశారు. ఘటన జరిగిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ స్పందించి బాధిత విద్యార్థిని కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి మాట్లాడి ధైర్యం చెప్పారని, మెరుగైన వైద్యం అందేలా కలెక్టర్ ఆనంద్, ప్రభుత్వ ఆస్పత్రి వర్గాలను ఆదేశించారని తెలిపారు. నిందితుడిపై నాన్ బెయిలబుల కేసులు నమోదు చేసి, శిక్ష పడేలా చూడాలని ఎస్పీ జగదీశ్ ను సీఎం ఆదేశించారన్నారు. ఇటువంటి దుర్మార్గులను వదిలే ప్రసక్తే లేదని, ప్రతి ఆడబిడ్డ సురక్షితంగా, స్వేచ్ఛగా చదువుకునే వాతావరణం తమ ప్రభుత్వం కల్పిస్తున్నారు. బాధిత విద్యార్థినికి మెరుగైన వైద్యం కోసం బెంగళూరులోని కార్పొరేట్ ఆస్పత్రికి తరలించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందని వెల్లడించారు.

పుట్లూరు మండల కేంద్రంలో కేబుల్ వైర్ ను దొంగలించిన గుర్తు తెలియని వ్యక్తులు

ప్రజాభూమి, పుట్లూరు.



పుట్లూరు మండలంలో వలుచోట్ల కేబుల్ వైర్ల దొంగతనాలు జరుగుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పుట్లూరుమండలంలో శుక్రవారం కే సురేష్ రెడ్డికి చెందిన 800 అడుగులు కేబుల్ వైర్ ను గుర్తుతెలియని వ్యక్తులు దొంగలించడం జరిగినది సురేష్ రెడ్డి తో పాటు ఇదే గ్రామానికి చెందిన పెద్దయ్య అనే వ్యక్తి ఎఆ సంబంధించిన కేబుల్ వైర్ ను కూడా దొంగలించడం జరిగినది. వరునగా.దొంగతనాలు పెరుగుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కే సురేష్ రెడ్డికి చెందిన వైరు సుమారు ఒక 1,20000 రూపాయలు అవుతుందని సురేష్ రెడ్డి కన్నీరు మున్నీరవుతున్నారు. అసలే ఎలివినో ప్రభావం వర్షాలు లేక బోర్లు ఎండిపోయి రైతులు ఇబ్బంది పడుతుంటే పుట్లూరు మండలంలో యదేచ్ఛగా దొంగతనాలు జరుగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పుట్లూరు గ్రామానికి చెందిన కే. సురేష్ రెడ్డి అనే రైతు తమ పొలంలో ఉన్న బోరు లోని మోటారు కాలిపోవడంతో రిపేరు నిమిత్తం మోటర్ ని బోరులో నుంచి బయటకు తీసి రిపేరు కోసం తీసుకెళ్లడం జరిగిందని కేబుల్ వైరు మాత్రం తమ తోటలోనే ఉంచడంతో 400 మీటర్ల కేబుల్ వైరు దొంగతనానికి గురైందనీ గుర్తుతెలియని వ్యక్తులు కేబుల్ వైర్లను అపహరించడంతో రైతుకు ఆర్థిక నష్టం వాటిల్లింది. మండలంలో తరచూ ఇలాంటి ఘటనలు జరగకుండా రాత్రి వేళల్లో వ్యవసాయ పొలాల వద్ద నిఘా పెంచాలని, కేబుల్ వైర్ల దొంగతనానికి పాల్పడుతున్న దుండగులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు...

ప్రశాంత ఎన్నికల నిర్వహణకు పటిష్ట బందోబస్తు

-సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఎస్పీ సతీష్ కుమార్

-అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా అప్రమత్తంగా ఉండాలని ఆదేశం

ప్రజాభూమి, హిందూపురం టౌన్



మున్సిపల్ ఎన్నికలను ప్రశాంతంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించేందుకు పటిష్టమైన పోలీసు భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా ఎస్పీ ఎన్. సతీష్ కుమార్ పోలీసు అధికారులను ఆదేశించారు. ఎన్నికల విధుల్లో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో శనివారం హిందూపురం పట్టణంలోని వన్‌టౌన్, టూటౌన్ పోలీస్ స్టేషన్ల పరిధిలోని సమస్యాత్మక ప్రాంతాలతో పాటు మోతుకపల్లి, హస్నాబాద్, రహమత్‌పూర్ ప్రాంతాల్లోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను డీఎస్పీ రవిబాబుతో కలిసి ఎస్పీ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అక్కడ చేపట్టిన భద్రతా ఏర్పాట్లను సమీక్షించి పోలీసు అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద అదనపు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి నిరంతర నిఘా ఉంచాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల వద్ద గుంపులు గుమిగూడకుండా, ఓటర్లు క్రమపద్ధతిలో క్యూలైన్లలో నిలబడి ప్రశాంతంగా ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఓటు వేసిన వెంటనే ఓటర్లు పోలింగ్ కేంద్రాల నుంచి వెళ్లేలా చూడాలని, అనుమతి లేని వ్యక్తులను కేంద్రాల్లోకి అనుమతించరాదని స్పష్టం చేశారు. స్ట్రాంగ్ రూమ్‌లు, ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద పటిష్ట భద్రత కల్పించాలని, సీసీ కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. రౌడీషీటర్లు, సమస్యాత్మక వ్యక్తుల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచాలని, ఎన్నికల నియమావళిని ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఏ చిన్న అవాంఛనీయ ఘటన జరిగినా వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రతి ఓటరు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునేలా పోలీసు అధికారులు, సిబ్బంది సమన్వయంతో అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఎస్పీ సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐలు ఆంజనేయులు, ప్రసాద్ బాబు, కరీం, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

పురపోరుకు సర్వం సిద్ధం-52 వార్డుల్లో 156 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు

- 1,31,427 మంది ఓటర్లు.. -ఎన్నికల విధులకు సిబ్బంది కేటాయింపు
- ప్రతి పోలింగ్ కేంద్రంలో వెబ్‌కాస్టింగ్, సీసీ కెమెరాల నిఘా
- ఏర్పాట్లను పరిశీలించిన ఎన్నికల పరిశీలకులు అరుణ్‌బాబు

ప్రజాభూమి, హిందూపురం టౌన్





హిందూపురం పురపాలక సంఘ పరిధిలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మున్సిపల్ ఎన్నికల అధికారి, కమిషనర్ మల్లికార్జున వెల్లడించారు. పట్టణంలోని 52 వార్డులకు సంబంధించి 156 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని, మొత్తం 1,31,427 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకొనేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఆదివారం ఉదయం 7 గంటల నుంచే పోలింగ్ ప్రారంభమయ్యేలా సిబ్బందికి ఆదేశాలు జారీ చేశామన్నారు. ఎంజీఎం పాఠశాలలో ఏర్పాటు చేసిన రిసెప్షన్ కేంద్రాన్ని మున్సిపల్ ఎన్నికల పరిశీలకులు అరుణ్‌బాబు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్నికల నిర్వహణకు చేపట్టిన ఏర్పాట్లు, పోలింగ్ సిబ్బంది కేటాయింపు, ఎన్నికల సామాగ్రి పంపిణీ తదితర అంశాలపై మున్సిపల్ ఎన్నికల అధికారి, కమిషనర్ మల్లికార్జునను అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ కేంద్రాల్లో కల్పించిన సదుపాయాలు, భద్రతా ఏర్పాట్లపై ఆరా తీశారు. ఈ సందర్భంగా కమిషనర్ మల్లికార్జున మాట్లాడుతూ, ప్రతి పోలింగ్ కేంద్రానికి ఒక ప్రిసైడింగ్ అధికారి, ఒక సహాయ ప్రిసైడింగ్ అధికారి, నలుగురు ఇతర పోలింగ్ అధికారుల చొప్పున మొత్తం 936 మంది సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. వీరితో పాటు 21 మంది రూట్ అధికారులు, ఐదుగురు జోనల్ అధికారులు, వది మంది నూక్ష్మ పరిశీలకులను కేటాయించామన్నారు. ప్రతి నాలుగు వార్డులకు ఒకరు చొప్పున ఎన్నికల అధికారులను నియమించి ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించేలా చర్యలు తీసుకున్నట్లు వివరించారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించామని, ఎన్నికల విధులకు హాజరయ్యే సిబ్బందికి ముందస్తు సూచనలు ఇచ్చామని పేర్కొన్నారు. ఉదయం ఏడు గంటలకే పోలింగ్ ప్రారంభమయ్యేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు అవసరమైన భద్రతా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో వెబ్‌కాస్టింగ్, సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామని, ఎన్నికల ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తామని కమిషనర్ వెల్లడించారు. ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు సెల్‌ఫోన్లు తీసుకురావద్దని సూచించారు. పట్టణ ప్రజలందరూ ఉదయం నుంచే తమ పోలింగ్ కేంద్రాలకు చేరుకుని ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ఎన్నికలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కమిషనర్ మల్లికార్జున వివరించారు.

వైసీపీ అభ్యర్థి ఇంట్లో సోదాలు

-ఓటరు స్లిప్పులు, నగదు స్వాధీనం చేసుకున్న ఫ్లయింగ్ స్క్వాడ్ -అభ్యర్థితో పాటు పలువురిని పోలీస్ స్టేషన్‌కు తరలింపు

ప్రజాభూమి, హిందూపురం టౌన్



మున్సిపల్ ఎన్నికల వేళ అధికారుల తనిఖీలు రాజకీయ చర్చకు దారితీశాయి. ఒకవైపు ఎన్నికల్లో అక్రమాలకు తావులేకుండా నిబంధనలు కఠినంగా అమలు చేస్తున్నామని అధికారులు చెబుతుండగా, మరోవైపు కేవలం రూ.13,500 నగదు లభించిందనే కారణంతో ప్రతిపక్ష పార్టీకి చెందిన కౌన్సిలర్ అభ్యర్థితో పాటు మరికొందరిపై కేసులు నమోదు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆదివారం పోలింగ్ జరగనున్న నేపథ్యంలో శనివారం చోటుచేసుకుంది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి నాగేంద్ర, మహాలక్ష్మి నివాసంలో ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్, ఎస్ఎస్‌టీ బృందాలు తనిఖీలు నిర్వహించాయి. బృందాలకు చెందిన అధికారులు చంద్రమోహన్, మదన్‌మోహన్, శంకర్ తమ సిబ్బందితో కలిసి వన్‌టౌన్ ఎస్సై రాజేష్‌తో పాటు ఇంట్లో సోదాలు చేపట్టారు. ఈ సందర్భంగా రూ.13,500 నగదుతో పాటు ఓటరు స్లిప్పులు లభించినట్లు అధికారులు గుర్తించారు. దీంతో నాగేంద్రతో పాటు మరికొందరిపై కేసు నమోదు చేసి వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అయితే ఈ వ్యవహారంపై పలు ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. సాధారణంగా ప్రతి ఒక్కరూ తమ వ్యక్తిగత అవసరాల కోసం ఇంట్లో కొంత నగదును ఉంచుకోవడం సహజం. ఎన్నికల సమయంలోనూ నిబంధనలకు అనుగుణంగా సరైన ఆధారాలతో రూ.50 వేల వరకు నగదును వెంట ఉంచుకునే వెసులుబాటు ఉందనే అంశాన్ని పలువురు ప్రస్తావిస్తున్నారు. అలాంటప్పుడు ఇంట్లో రూ.13,500 నగదు లభించడమే నేరానికి ఆధారమవుతుందా.. ఆ నగదును ఓటర్లకు పంపిణీ చేయడానికి సిద్ధం చేశారనే ఆధారాలు ఉన్నాయా.. అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. మరో వైపు మున్సిపల్ ఎన్నికల్లో ఒక్కో కౌన్సిలర్ అభ్యర్థి రూ.7.50 లక్షల వరకు ఎన్నికల ప్రచారానికి ఖర్చు చేసుకునేందుకు వ్యయ పరిమితి ఉన్నట్లు పేర్కొంటున్నారు. ప్రచార ఖర్చులకు లక్షల రూపాయల పరిమితి ఉండగా, వ్యక్తిగత నివాసంలో లభించిన రూ.13,500 నగదుపై ఇంతటి చర్యలు తీసుకోవడంపై రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. అయితే ఎన్నికల వ్యయ పరిమితి నగదును ఎలాంటి నిబంధనలు లేకుండా ఉంచుకోవడానికి ఇచ్చిన అనుమతి కాదన్న విషయాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంది. ఎన్నికల నిబంధనలు అమలు చేయడంలో తప్పులేదు. ఓటర్లను ప్రలోభపెట్టేందుకు నగదు పంపిణీ చేసినట్లు ఆధారాలు లభిస్తే చర్యలు తీసుకోవాల్సిందే. అయితే అలాంటి ఆధారాలు లేకుండా కేవలం నగదు, ఓటరు స్లిప్పులు లభించాయనే కారణంతో కేసు నమోదు చేశారా అన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. అధికార, ప్రతిపక్ష పార్టీలకు ఒకే విధమైన నిబంధనలు పర్తింపజేస్తున్నారా.. అనే సందేహాలు కూడా వ్యక్తమవుతున్నాయి. అసలు నగదు ఎందుకు స్వాధీనం చేసుకున్నారు, ఓటరు స్లిప్పులకు, నగదుకు ఉన్న సంబంధం ఏమిటి, అభ్యర్థిపై నమోదైన కేసులోని అభియోగాలేమిటి అనే అంశాలపై అధికారులు స్పష్టత ఇవ్వాల్సి ఉంది. ఏది ఏమైనా రూ.13,500 నగదు స్వాధీనం వ్యవహారం ఇప్పుడు పట్టణంలో హాట్‌టాపిక్‌గా మారింది.

క్రీడల్లో సత్తా చాటిన బెస్తవారిపల్లి అంబేద్కర్ గురుకుల విద్యార్థులు

- అథ్లెటిక్స్‌లో జాతీయ స్థాయికి ఒకరు.. రాష్ట్ర స్థాయికి మరొకరు
- ఎస్‌జీఎఫ్ అండర్-17 పోటీల్లో ప్రతిభ - గురుకుల విద్యార్థులకు అభినందనలు

ప్రజాభూమి, పులివెందుల



బెస్తవారిపల్లిలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకుల బాలుర పాఠశాల విద్యార్థులు ఎస్‌జీఎఫ్ అండర్-17 క్రీడా పోటీల్లో సత్తా చాటారు. అథ్లెటిక్స్, సాఫ్ట్‌బాల్ విభాగాల్లో రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎంపికై పాఠశాలకు పేరు తెచ్చారని ప్రిన్సిపాల్ సి. నరసింహులు తెలిపారు.అథ్లెటిక్స్ విభాగంలో విద్యార్థి సాయికృష్ణ 100 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానం, 200 మీటర్ల పరుగులో ద్వితీయ స్థానం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు.అదేవిధంగా మరో విద్యార్థి 60 మీటర్ల పరుగులో, లాంగ్‌జంప్‌లో ప్రథమ స్థానాలు సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికై ఘనత సాధించాడు.ఎస్‌జీఎఫ్ అండర్-17 సాఫ్ట్‌బాల్ విభాగంలో పి. మహేష్ అద్భుత ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యా డు.విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎంపిక కావడంపై కళా శాల ప్రిన్సిపాల్ సి. నరసింహులు, వైస్ ప్రిన్సిపాల్ టి.వి. నుబ్బయ్య, వ్యాయామ ఉపాధ్యాయులు బి. రామిరెడ్డి, డి. నురేంద్రతో పాటు ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులను అభినం దించి, ఉన్నత స్థాయి పోటీల్లోనూ విజయం సాధించాలని ఆకాంక్షించారు.

ప్రజాభూమి
జనరల్ 11
ఆదివారం 01 నవంబరు 2026

ఓటుకు వేలం..!! -రూ.500 నుంచి రూ.5 వేల వరకు...

-ఎన్నికల్లో నగదు పంపిణీపై జోరుగా ప్రచారం -పలు వార్డుల్లో ఓటుకు భారీ డిమాండ్
-డబ్బుతో పాటు మద్యం పంపిణీకి తెర -గెలుపే లక్ష్యంగా ప్రలోభాలు

ప్రజాభూమి, హిందూపురం టౌన్

ఓటు విలువను వేల రూపాయల్లోకి మార్చేస్తున్నారు, ప్రజాస్వామ్య పండుగగా జరగాల్సిన హిందూపురం పురపాలక ఎన్నికల్లో ప్రలోభాల పర్వం తెరపైకి వచ్చినట్లు ప్రచారం సాగుతోంది. ఓటర్లను తమవైపు తిప్పుకునేందుకు కొందరు అభ్యర్థులు నగదు, మద్యం పంపిణీకి తెరతీసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం ఒక్కో ఓటుకు రూ.500 నుంచి రూ.2 వేల వరకు ఇస్తున్నట్లు పట్టణంలో చర్చ జరుగుతుండగా, కొన్ని ప్రత్యేక వార్డుల్లో మాత్రం ఈ మొత్తం రూ.5 వేల వరకు చేరినట్లు ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా పలు వార్డుల్లో ఓటుకు రూ.2 వేల నుంచి రూ.5 వేల వరకు ఇచ్చేందుకు అభ్యర్థులు సిద్ధమవుతున్నారనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. గెలుపే లక్ష్యంగా అభ్యర్థులు ఎంతైనా ఖర్చు చేసేందుకు వెనుకాడటం లేదనే చర్చ పట్టణంలో సాగుతోంది. హిందూపురం పురపాలక సంఘ పరిధిలో మొత్తం 52 వార్డులు ఉండగా, 65,468 మంది పురుషులు, 65,945 మంది మహిళలు, 14 మంది ఇతరులు కలిపి మొత్తం 1,31,427 మంది ఓటర్లు ఉన్నారు. మున్సిపల్ చైర్మన్ స్థానానికి ఏడుగురు అభ్యర్థులు పోటీలో నిలిచారు. తెలుగు దేశం పార్టీ తరపున పురిడి మంజునాథ్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి డి. షాజియా, కాంగ్రెస్ తరపున అమానుల్లా, ఎంఐఎం నుంచి ఇమ్రాన్ భాష, బీఎస్పీ నుంచి కె. సుబ్బరాయప్పతో పాటు మరో ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులు బరిలో ఉన్నారు. మొత్తం 52 వార్డుల్లో రెండు వార్డులను తెలుగు దేశం పార్టీ ఏకగ్రీవంగా దక్కించుకోగా, మిగిలిన



50 వార్డుల్లో 154 మంది కౌన్సిలర్ అభ్యర్థులు పోటీ పడుతున్నారు.

ప్రత్యేక వార్డులపై ప్రత్యేక నిఘా

మున్సిపల్ చైర్మన్ స్థానంతో పాటు కౌన్సిలర్ స్థానాలను దక్కించుకోవడం ప్రధాన పార్టీలకు ప్రతిష్ఠాత్మకంగా మారింది. ఈ క్రమంలో కొన్ని వార్డుల్లో గెలుపోటములను ప్రభావితం చేయగల ఓటర్లపై అభ్యర్థులు ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ప్రత్యర్థి పార్టీ అభ్యర్థులను ఎలాగైనా ఓడించాలనే లక్ష్యంతో ఇతర వార్డులకు చెందిన నాయకులు సైతం రంగంలోకి దిగుతున్నట్లు స్థానికంగా ప్రచారం జరుగుతోంది. దీంతో ఆయా వార్డుల్లో ఓటర్లకు ఇచ్చే నగదు విషయంలో పోటీ పెరిగి రేట్లు అమాంతం పెరిగినట్లు చర్చ సాగుతోంది. ముఖ్యంగా పలు వార్డుల్లో రూ.5 వేల వరకు ఇచ్చేందుకు సిద్ధమవుతున్నారనే ప్రచారం ఆసక్తికరంగా మారింది.

నగదుతో పాటు మద్యం పంపిణీ...

ఓటర్లను ఆకర్షించేందుకు నగదు పంపిణీతో పాటు ఇంటింటికీ మద్యం సరఫరా చేస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ఎన్నికల నిబంధనలను పక్కనపెట్టి రహస్యంగా పంపిణీ చేస్తున్నారనే ప్రచారం స్థానికంగా కలకలం రేపుతోంది. మరోవైపు ప్రత్యర్థి పార్టీల అభ్యర్థులు నగదు పంపిణీ చేయకుండా అడ్డుకునేందుకు అధికార పార్టీ నాయకులు పోలీసు యంత్రాంగంపై ఒత్తిడి తెస్తున్నారనే విమర్శలు ప్రతిపక్ష వర్గాల నుంచి వ్యక్తమవుతున్నాయి. ప్రతిపక్ష అభ్యర్థుల కదలికలపై నిఘా పెట్టి, వారి పంపిణీని అడ్డుకోవాలనే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపిస్తున్నారు. అదే సమయంలో అధికార పార్టీకి చెందిన కొందరు నాయకులు మాత్రం ఎలాంటి ఆటంకాలు లేకుండా నగదు పంపిణీ చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలపై అధికారిక నిర్ధారణ లేదు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల తరపున కూడా కొన్ని ప్రాంతాల్లో నగదు పంపిణీ జరిగినట్లు పట్టణంలో ప్రచారం సాగుతోంది. దీంతో నగదు పంపిణీ విషయంలో ఏ పార్టీకి మినహాయింపు లేకుండా ఎన్నికల యంత్రాంగం నిష్పక్షపాతంగా వ్యవహరించాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

నిఘా మాటేమిటి...!

ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛాయుతంగా నిర్వహించేందుకు పోలీసు యంత్రాంగం ఇప్పటికే భారీ బందోబస్తు ఏర్పాటు చేసింది. సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక నిఘా పెట్టినట్లు అధికారులు ప్రకటిస్తున్నారు. అయితే ఓటర్లను ప్రలోభపెట్టేందుకు నగదు, మద్యం పంపిణీ జరుగుతోందనే ఆరోపణలు తెరపైకి రావడంతో ఎన్నికల నిఘా వ్యవస్థ పనితీరుపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అధికార, ప్రతిపక్ష పార్టీలనే తేడా లేకుండా అక్రమాలకు పాల్పడే వారిపై చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. ఓటుకు ఎంత ధర కట్టినా ఐదేళ్ల భవిష్యత్తును నిర్ణయించే ఓటు హక్కును ప్రలోభాలకు తాకట్టు పెట్టకూడదనే అభిప్రాయం ప్రజాస్వామ్యవాదుల నుంచి వ్యక్తమవుతోంది.

పనపాకంలో వైఎస్సార్ సిపి ఇంటింట ప్రచారం

అభివృద్ధిని చూసి ఓటు వేసి గెలిపించాలని కోరిన అభ్యర్థి!



ప్రజాభూమి ప్రతినిధి,చంద్రగిరి :

స్థానిక సంస్థల ఎన్నికల సమరంలో భాగంగా చంద్రగిరి మండలం, పనపాకం పంచాయతీ గడ్డంవారి పల్లె, కందులవారిపల్లె, అమాసవా రిపల్లె,పాకాలవారిపల్లె, కోనంగి వారిపల్లె, జక్కలవారిపల్లె,అం బేద్కర్ కాలనీ గ్రామాలల్లో వైఎస్సా ర్ సిపి,జడ్పీటీసీ అభ్యర్థి కొటాల పద్మజ,ఎంపిటిసి అభ్యర్థి బొజ్జా కోమల లను గెలించాలని పార్టీ శ్రేణులు ఇంటింట ప్రచారం నిర్వహించారు.గ్రామాలల్లో ఎన్నికల వేడి ఒక్కసారిగా రాజుకుంది,పార్టీ నాయకుల నినాదాల నడుమ ప్రచార పర్వం ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది.గత ప్రభుత్వంలో చెవిరెడ్డి మోహిత్ రెడ్డి సహకారం తో జాతీయ రహదారి నుంచి గ్రామాలలోకి సిమెంటు రోడ్లు,గ్రామంలో అభివృద్ధి చేశామని, తమను గెలిపిస్తే ఇంకా అభివృద్ధి చేస్తామన్నారు.కూటమి ప్రభుత్వం మూడు సంవత్సరాలలో పంచాయతీ లో ఏమి అభివృద్ధి చేశారో చెప్పి ఓట్లు అడగాలన్నారు. అడుగడుగునా ఘన స్వాగతం-ఇంటింట ప్రచారంలో భాగంగా గ్రామంలో అడుగుపెట్టిన అభ్యర్థికి గ్రామస్తులు, మహిళలు మంగళహారతులు పట్టారు, గత ప్రభుత్వంలో తాము చేసిన గ్రామాభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం,చూసి ప్యాన్ గుర్తుపై ఓటు వేసి తమను భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. వైఎస్సార్ సిపి శ్రేణుల గ్రామాలల్లోప్రచారంనిర్వహించారు. ఈకార్యక్రమంలో బొజ్జవెంకటరత్నం,వరలక్ష్మి,కసాగోపాల్,సిహెచ్ రెడ్డెప్ప,అమాన నాగేశ్వరరావు,చెంగల్రాయశెట్టి (చెంగల్ పండు) మునిరత్నం,అజయ్, మాతయ్య,బొజ్జా ఆనంద, అభ్యర్థి బొజ్జా కోమల, దూర్వాసులు,అమాస భాస్కర్,పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

వేపకుప్పం పంచాయతీలో హోరెత్తిన కూటమి ప్రచారం

జెడ్పీటీసీ అభ్యర్థి మేకల తిరుమలరెడ్డి, ఎంపీటీసీ అభ్యర్థి కౌసల్యల ఇంటింటి బాట!
శ్రీ బాట గంగమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలతో మొదలైన ఎన్నికల శంఖారావం
సైకిల్ గుర్తుకే ఓటేసి జెడ్పీటీసీ, ఎంపీటీసీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపు!

ప్రజా భూమి ప్రతినిధి,రామచంద్రాపురం

స్థానిక సంస్థల ఎన్నికల సమరంలో భాగంగా చంద్రగిరి నియోజకవర్గంలోని రామచంద్రాపురం మండల పరిధి వేపకుప్పం పంచాయతీలో ఎన్డీయే కూటమి ప్రచార భేరి మిన్నంటింది. రామచంద్రాపురం మండల టీడీపీ అధ్యక్షుడు, మాజీ డీసీసీబీ డైరెక్టర్, మాజీ సింగిల్ విండో చైర్మన్ మేకల తిరుమలరెడ్డికి చంద్రగిరి శాసనసభ్యులు పులివర్తి నాని జెడ్పీటీసీ అభ్యర్థిగా అవకాశం కల్పించడంతో.. ఆయన శనివారం సాయంత్రం పంచాయతీ పరిధిలో విస్తృత స్థాయి ఇంటింటి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు.

- గ్రామదేవత శ్రీ బాట గంగమ్మ ఆలయంలో పూజలతో శుభారంభం:

- జెడ్పీటీసీ అభ్యర్థి మేకల తిరుమలరెడ్డి కొత్త వేపకుప్పం గ్రామానికి చేరుకోగానే కూటమి నాయకులు, కార్యకర్తలు, మహిళలు, గ్రామ పెద్దలు పార్టీ జెండాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం గ్రామంలో కొలువైన శ్రీ బాట గంగమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు.





అక్కడి నుంచి కూటమి శ్రేణులు, స్థానిక నాయకులతో కలిసి ప్రచార ర్యాలీని ప్రారంభించారు.

- గ్రామగ్రామాన ఆత్మీయ వలకరింపులు:

- కొత్త వేపకుప్పం నుంచి ప్రారంభమైన ఈ ప్రచారం పాత వేపకుప్పం, మిట్ట వేపకుప్పం, ఎస్టీ కాలనీ, ఆది ఆంధ్రవాడ, కునేపల్లి మీదుగా కొనసాగింది. రాజకీయాల్లో సుదీర్ఘ అనుభవం ఉండి, ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొంటూ ప్రజాసేవలోనే నిలిచిన సీనియర్ నేత తిరుమల రెడ్డిని ప్రతి ఇంటా కుటుంబ సభ్యుడిలా భావిస్తూ స్థానికులు సాదరంగా ఆహ్వానించారు. గ్రామస్తులను పేరుపేరునా ఆప్యాయంగా పలకరిస్తూ తిరుమలరెడ్డి ఓట్లను అభ్యర్థించారు.


- జెడ్పీటీసీ, ఎంపీటీసీల సమష్టి విజయమే లక్ష్యం:

- ఈ సందర్భంగా మేకల తిరుమలరెడ్డి మాట్లాడుతూ.. తనను జెడ్పీటీసీగా ఆశీర్వదించడంతో పాటు, స్థానిక ఎంపీటీసీ అభ్యర్థిని కుమ్మరి కౌసల్యను సైతం అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని నాయకత్వంలో మండల సమగ్ర ప్రగతి, గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, నిరుపేదలకు సంక్షేమ పథకాల సంపూర్ణ అమలు లక్ష్యంగా పనిచేస్తామని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అందిస్తున్న సూపర్ సిక్స్ పథకాలను, పెంచిన పింఛన్లు, ఉచిత గ్యాస్ సిలిండర్లు, మహిళలకు ఉచిత బస్సు పథకం వంటి పథకాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీకూటమి ముఖ్య నాయకులు, కార్యకర్తలు, మహిళలు, గ్రామ ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రచారాన్ని విజయవంతం చేశారు.

కేసులతో బెదిరించలేరు.. అరెస్టులతో అణచలేరు..
ప్రజల కోసం పోరాడుతూనే ఉంటా!

రాజకీయ కక్ష సాధింపులకు అరెస్టులే సమాధానమా? అధికారానికి ప్రజాస్వామ్యమే జవాబు: కొడవలూరు భక్తవత్సల రెడ్డి

ప్రజాభూమి ప్రతినిధి,వాకాడు:



ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలపై వరుసగా జరుగుతున్న అరెస్టులు, కేసుల పరిణామాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని వాకాడు మండలానికి చెందిన కొడవలూరు భక్తవత్సల రెడ్డి పేర్కొన్నారు. రాజకీయ విభేదాలను కేసులు, అరెస్టులతో అణచివేయాలని చూడటం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యంలో రాజకీయంగా విభేదించడం నేరం కాదని, ప్రజల తరపున ప్రశ్నించడం ప్రతి ఒక్కరి హక్కు అని అన్నారు. ప్రతిపక్ష గొంతుకను అణచివేయడానికి అధికారాన్ని ఉపయోగించకూడదని స్పష్టం చేశారు. వాకాడు గడ్డపై రాజకీయ కక్ష సాధింపు సంస్కృతికి ఎప్పుడూ చోటు లేదని, ఇక్కడి ప్రజలు ఆత్మగౌరవం కలిగినవారని పేర్కొన్నారు. తనపై కేసులు పెట్టినా, అరెస్టు చేసినా ప్రజా సమస్యలపై ప్రశ్నించే తన గొంతును అణచలేరని ధీమా వ్యక్తం చేశారు. పదవులు, కేసులు, అరెస్టులు తాత్కాలికమని.. ప్రజల అభిమానం, నమ్మకం శాశ్వతమని అన్నారు. వాకాడు మండల ప్రజలు ఎలాంటి భయాలు, ఒత్తిళ్లు, ప్రలోభాలకు లొంగకుండా తమ మనస్సాక్షి ప్రకారం స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. వాకాడు ఆత్మగౌరవాన్ని, ప్రజాస్వామ్య హక్కులను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. అధికారం శాశ్వతం కాదు.. ప్రజాస్వామ్యం శాశ్వతం. కేసులతో భయపెట్టగలరేమో కానీ ప్రజల ప్రశ్నలను ఆపలేరు.. అరెస్టులతో ప్రజాస్వామ్య స్ఫూర్తిని అణచలేరు అని కొడవలూరు భక్తవత్సల రెడ్డి పేర్కొన్నారు.

పార్టీకి నిబద్ధతతో పనిచేసిన వారికే.. భవిష్యత్తులో నాయకునిగా అవకాశం..!

ఎంతటి వారైనా పార్టీకి నష్టం చేస్తే ఉపేక్షించేది లేదు -అభ్యర్థుల విజయానికి ప్రతి కార్యకర్త కష్టపడాలి
చంద్రగిరి కోటపై వైఎస్సార్సీపీ జెండా ఎగరాలి-చంద్రగిరి పార్టీ శ్రేణులకు మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి స్పష్టీకరణ

ప్రజాభూమి ప్రతినిధి చంద్రగిరి:

పార్టీ కష్టకాలంలో వున్నపుడు అండగా నిలిచి, ఎన్నికల్లో పోటీ చేయడంతో పాటు పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేసిన వారికే భవిష్యత్తులో నాయకత్వ అవకాశాలు కల్పిస్తామని చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే, ప్రభుత్వ మాజీ విప్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రస్తుత ఎన్నికల సమయంలో పార్టీకి, బరిలో నిలిచిన అభ్యర్థులకు నష్టం కలిగించేలా వ్యవహరిస్తూ, దోబూచులాడే వారిని ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని తేల్చిచెప్పారు. ఆర్థికంగా ఎంతటి సంపన్నులైనా, బలమైన రాజకీయ కుటుంబాల నుంచి వచ్చినా పార్టీ కోసం నిబద్ధతతో లేని వారిని భవిష్యత్తులో నాయకులుగా గుర్తించే ప్రసక్తే లేదన్నారు. చంద్రగిరిలోని వైఎస్ఎంఆర్ కల్యాణ మండపంలో శనివారం చంద్రగిరి మండల పార్టీ నాయకులు, ఎంపీటీసీ, జడ్పీటీసీ అభ్యర్థులతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నవంబర్ 5న జరగనున్న స్థానిక



ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రస్తుత కష్టకాలంలో పార్టీ కోసం పనిచేసిన వారిని గుర్తించి, భవిష్యత్తులో పార్టీ అధికారంలోకి వచ్చిన అనంతరం రాజకీయంగా తగిన ప్రాధాన్యం, పదవులతో గౌరవిస్తామని పేర్కొన్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో పార్టీకి, అభ్యర్థుల విజయానికి కష్టపడకుండా తప్పించుకు తిరిగే వారికి భవిష్యత్తులో నాయకత్వ బాధ్యతలు అప్పగించే అవకాశం లేదని స్పష్టం చేశారు. ఎంతమంది ఒత్తిడి తెచ్చినా అలాంటి వారిని ప్రోత్సహించే ప్రసక్తే లేదన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత ప్రయోజనాలను పక్కనపెట్టి పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలని సూచించారు. చంద్రబాబు సొంత మండలమైన చంద్రగిరిలో గత పదిహేను ఏళ్లుగా ఎంపీపీ, జడ్పీటీసీ స్థానాలను వైఎస్సార్‌సీపీ కైవసం చేసుకుంటూ వస్తోందని చెవిరెడ్డి గుర్తుచేశారు. ఈసారి కూడా అదే సంప్రదాయాన్ని కొనసాగించేలా ఎంపీపీ అభ్యర్థి మల్లం దీపికారెడ్డి, జడ్పీటీసీ అభ్యర్థి కొటాల పద్మజ విజయానికి ప్రతి ఒక్కరూ సమష్టిగా పనిచేయాలని కోరారు. చంద్రగిరి కోటపై వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా శ్రేణులంతా కదలాలని పిలుపునిచ్చారు. పోలింగ్ రోజున ప్రతి ఒక్కరూ తమకు కేటాయించిన బూత్‌లలో అప్రమత్తంగా ఉండి పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలన్నారు. పోరాటాల నుంచి పుట్టిన పార్టీలోని ప్రతి కార్యకర్త జగనన్న సైనికుడిగా పనిచేయాలని సూచించారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ అభ్యర్థుల విజయానికి అనుసరించాల్సిన వ్యూహాలు, పోలింగ్ నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో మండలంలోని పార్టీ ముఖ్య నాయకులు, ఎంపీటీసీ, జడ్పీటీసీ అభ్యర్థులు పాల్గొన్నారు.

కోడివాకలో టీడీపీ ప్రచార జోరు..

రాయపు నరసింహులుకు మద్దతుగా జనార్దన్ రెడ్డి పర్యటన!

ప్రజాభూమి ప్రతినిధి, వాకాడు

తిరుపతి జిల్లా వాకాడు మండలం కోడివాక గ్రామంలో టీడీపీ ఎంపీటీసీ అభ్యర్థి రాయపు నరసింహులుకు మద్దతుగా టీడీపీ సీనియర్ నాయకుడు దువ్వూరు జనార్దన్ రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గ్రామంలోని పలు వీధుల్లో పర్యటిస్తూ ప్రజలను కలుసుకుని సైకిల్ గుర్తుకు మద్దతు ఇవ్వాలని అభ్యర్థించారు.ప్రచారంలో భాగంగా గ్రామ ప్రజలతో మమేకమైన దువ్వూరు జనార్దన్ రెడ్డి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామీణ రహదారుల అభివృద్ధి, వీధి దీపాల ఏర్పాటు, తాగునీటి సమస్యల పరిష్కారం వంటి మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించాల్సిన అవసరాన్ని వివరించారు.రాయపు నరసింహులు ఎంపీటీసీగా ఎన్నికైతే గ్రామంలోని సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తారని ప్రజలకు వివరించారు. ప్రతి వీధిలోని సమస్యలను గుర్తించి గ్రామాభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు.ఈ సందర్భంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి సైకిల్ గుర్తును ప్రజలకు పరిచయం చేస్తూ ప్రచారం నిర్వహించారు. దువ్వూరు జనార్దన్ రెడ్డి ఆధ్వర్యంలో సాగిన ప్రచార కార్యక్రమంలో టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల విస్తరణకు మనవతా సంస్థ నిర్ణయం

- సభ్యత్వం పెంపు, సమీప గ్రామాలకు సేవల విస్తరణపై చర్చ



ప్రజాభూమి, వేంపల్లె

మనవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన వేంపల్లె మండల సమావేశం విజయవంతంగా జరిగింది. ఈ సమావేశానికి సంస్థ జిల్లా అధ్యక్షుడు శివశంకర్ రెడ్డి, కమిటీ సభ్యులు సుబ్బరాయుడు, సుబ్బారెడ్డి, డా. యోగీశ్వర బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా వేంపల్లె మండల పరిధిలో సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలపై విస్తృతంగా చర్చించారు. మరిన్ని సేవా కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేయడంతో పాటు సంస్థ కార్యకలాపాలను విస్తరించాలని నిర్ణయించారు. సంస్థ సభ్యత్వాన్ని పెంచి, సమీప గ్రామాలు, వ్యాపార వర్గాలకు చెందిన సేవాభావం కలిగిన మరింత మందిని సంస్థలో భాగస్వాములను చేయాలని నిర్ణయించారు. ఐకమత్యం, సమన్వయంతో ముందుకు సాగుతూ సమాజానికి మరింత సేవలందించాలని సభ్యులు అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో మానవత స్వచ్ఛంద సేవా మండల కమిటీ చైర్మన్ చక్రపాణి రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ సుభాష్, ఆత్మీయ సహకార కమిటీ చైర్మన్ బాలాజీ, కోశాధికారి ధనుంజయ, బోర్డు సభ్యులు నాగభూషణ, చలపతి, కొప్పల గంగయ్య, డా. రంగయ్య పాల్గొన్నారు. మానవ సేవే మాధవ సేవ అనే లక్ష్యంతో సంస్థను మరింత బలోపేతం చేస్తూ భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు.



ప్రజాభూమి

జనరల్

ఆదివారం, నవంబర్ 01, 2026 **12**

ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం..

ప్రశాంత వాతావరణంలో విజయవంతం చేసేందుకు సమగ్ర ఏర్పాట్లు

జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, వ్యయ పరిశీలకులు బి.విజయ్ కుమార్, వీఎంసీ ధ్యానచంద్ర



ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ: జిల్లాలో విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు నాలుగు మున్సిపాలిటీల పరిధిలో ఎన్నికల ను ప్రశాంత వాతావరణంలో విజయ వంతంగా నిర్వహించేందుకు సమగ్ర ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ.. ఎన్నికల జిల్లా వ్యయ పరిశీలకులు బి.విజయ్ కుమార్, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్‌ఎం శనివారం విజయవాడ లయోలా కళాశాలలోని డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని సందర్శించారు. పోలింగ్ బృందాలకు అందిస్తున్న ఎన్నికల సామగ్రిని, వివిధ ఫారాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ జిల్లాలో విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు నాలుగు మున్సిపాలిటీల పరిధిలో మొత్తం 222 వార్డులకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఓటర్లు తమ ఓటు హక్కును స్వేచ్ఛాయుతంగా వినియోగించుకునేందుకు మొత్తం 1,104 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పటిష్ట భద్రత ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సెన్సిటివ్, హైపర్ సెన్సిటివ్ కేంద్రాలను గుర్తించామని.. సీసీటీవీ కెమెరాలతో పాటు వెబ్‌క్యాస్టింగ్‌కు ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ (ఎస్ఈసీ) మార్గదర్శకాలకు అనుగు ణంగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు.

ఎన్నికల వ్యయ పరిశీలకులు బి.విజయ్ కుమార్ మాట్లాడుతూ ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, స్టాటిక్ సర్వైలెన్స్ బృందాలు క్రియాశీలంగా పని చేస్తున్నాయన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియ మావళి (ఎంసీసీ), ఎంసీఎంసీ, అకౌంటింగ్ బృం దా లు వంటివి సమష్టి కృషితో పనిచేస్తున్నాయని తెలిపారు. నిబంధనల ఉల్లంఘనకు సంబం ధించి ఏవైనా ఫిర్యాదులు వస్తే వెంటనే పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. విజ య వాడ నగరపాలక సంస్థ పరిధిలో ఎన్నికల నిర్వహణకు చేసిన ఏర్పాట్లను ధ్యానచంద్ర హెచ్‌ఎం వివరించారు.

మచిలీపట్నంలో పకడ్బందీగా ఎన్నికల ఏర్పాట్లు



*** ప్రశాంతంగా పోలింగ్ జరిగేలా అధికార యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలి**

*** ప్రత్యేక ఎన్నికల అధికారి నీలకంఠేశ్వర రెడ్డి**

ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నంః మచిలీపట్నం నగరపాలక సంస్థ పరిధిలో ఆదివారం జరగనున్న ఎన్నికలకు 1.39 లక్షల మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. మేయర్, 60 డివిజన్ల కార్పొరేటర్ల ఎన్నికల నిర్వహణకు సంబంధించి స్థానిక నోబుల్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఎన్నికల ఏర్పాట్లను ప్రత్యేక ఎన్నికల అధికారి నీలకంఠేశ్వర రెడ్డి పరిశీలించారు. 15 మంది ఆర్వోలు, 9 మంది జోనల్ అధికారులు, 16 మంది రూట్ ఆఫీసర్లు ఏర్పాటు చేశారు.ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఓటర్లు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా అవసరమైన ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేశారు.ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ తమకు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ప్రశాంతంగా, సజావుగా పోలింగ్ జరిగేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఎన్నికల నిర్వహణకు సహకరించాలని ప్రత్యేక ఎన్నికల అధికారి నీలకంఠేశ్వర రెడ్డి కోరారు.

నగర పాలక సంస్థ ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి

ప్రజాభూమి, కృష్ణా బ్యూరో:

నేడు జరిగే మచిలీపట్నం నగర పాలక సంస్థ ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. నగరంలో 60 డివిజన్లలో ఎన్నికలు జరుగుతాయి. మేయర్ అభ్యర్థినిని ఓటర్లే నేరుగా ఎన్నుకుంటారు. ఆయా డివిజన్లలో పోటీ చేస్తున్న కార్పొరేటర్లను కూడా ఓటర్లు ఎన్నుకుంటారు. ఇందువల్ల ఒక్కో ఓటరు రెండు ఓట్లను వేయవలసి వుంటుంది. మేయర్ అభ్యర్థికి ఒక ఓటు, కార్పొరేటర్ అభ్యర్థికి ఒక ఓటు వేయవలసి వుంటుంది.

మచిలీపట్నం నగరంలో మొత్తం ఓటర్లు 1,39,246 మంది వున్నారు. అందులో బీసీలు 68,417 మంది, ఎస్సీలు 11,215 మంది, ఎస్టీలు 2,321 మంది. ఇతర కులాల ఓటర్లు 57,293 మంది వున్నారు. ఇందులో పురుష ఓటర్లు 66,504 మంది, మహిళా ఓటర్లు 72,732 మంది. ఇతరులు 10 మంది వున్నారు. పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లు 6,228 అధికంగా వున్నారు.

60 డివిజన్లలో 161 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు. ఇందులో సమస్యాత్మక పోలింగ్ బూత్‌లను 25, అత్యంత సమస్యాత్మక బూత్‌లుగా 44 వున్నట్లు అధికారులు గుర్తించారు. ఇలా గుర్తించిన బూత్‌లలో ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి అదనపు పోలీసు బలగాలను మోహరింపజేస్తున్నారు. పోలింగ్ సిబ్బందిని 1160 మందిని, బ్యాలెట్ బాక్సులను 366 ఏర్పాటు చేయనున్నారు. పోలింగ్ కేంద్రాలలో జరిగే ఎన్నికల సరళిని వీడియోలు తీస్తారు. ఎన్నికలు అనంతరం బాక్సలను కృష్ణా విశ్వవిద్యాలయంలో పటిష్టమైన స్ట్రాంగ్ రూమ్‌లో, గట్టి భద్రతతో పోలీసు పహారాలో భద్రపరుస్తారు. ఓట్ల లెక్కింపును కూడా కృష్ణా విశ్వవిద్యాలయంలోనే జరుపుతారు.

కూటమి అభ్యర్థుల్ని గెలిపించండి.. బందరుని అభివృద్ధి చేసుకుందాం

పెద్దపట్నం, కానూరు గ్రామాల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో మంత్రి కొల్లు రవీంద్ర



ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నంః అభివృద్ధి కోరుకునే ప్రతి ఒక్కరూ కూటమికే మద్దతిస్తారని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. ఈ మేరకు మచిలీపట్నం నార్త్ మండలం జెడ్పీటీసీ అభ్యర్థి లంకె ఉషారాణి, కానూరు ఎంపీటీసీ అభ్యర్థి కాకర భవానీ, పార్టీసీనియర్ నాయకులు కొనకళ్ల జగన్నాథరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి గోపు సత్యన్నారాయణతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ కార్యకర్తలు, గ్రామ ప్రజల జనసందోహం మధ్య ఎన్నికల ప్రచారం హోరెత్తించారు. కూటమి అభ్యర్థులకే తమ మద్దతు ఉంటుందని ప్రజలు నీరాజనాలు పలికారు. మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేశాం. ఎల్ నినో కారణంగా ప్రపంచం మొత్తం ఇబ్బందులు పడుతున్నప్పటికీ.. గతంలో చంద్రబాబు నాయుడు గారు పట్టిసీమ నిర్మాణంతో నేడు ఈ ప్రాంతం మొత్తాన్ని సస్యశ్యామలం చేశారు. పట్టి సీమ ద్వారా సుమారు 500 టీఎంసీల సాగునీరు ప్రాంతానికి తీసుకొచ్చిన ఘనత చంద్రబాబుది. మంగినపూడి, పెదపట్నం పరిసర ప్రాంతాలన్నింటినీ పర్యాటకంగా అభివృద్ధి చేయబోతున్నాం. గతంలో బీచ్ ఫెస్టివల్ నిర్వహించాం. తాజాగా సాగరతీర మహాగణపతి ఉత్సవాల నిర్వహణతో ఆ ప్రాంతం పర్యాటకంగా అభివృద్ధి చేస్తున్నాం. టెంపుల్ టూరిజం ఏర్పాటు చేస్తాం. ఫలితంగా ఈ ప్రాంత ప్రజలకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. బందరు మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించే లక్ష్యంతో ఉత్తర మండలం, దక్షిణ మండలాలుగా విభజించాం. ఉత్తర మండలం జెడ్పీటీసీ అభ్యర్థి లంకె ఉషారాణి గారు, ఎంపీటీసీ అభ్యర్థిగా కాకర్ల భవానీ గారితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గత ఐదు సంవత్సరాలు రాష్ట్రం అభివృద్ధికి దూరమైంది. వైసీపీ దుర్మార్గాలను సహించలేక కూటమిని గెలిపించారు. ప్రజల ఆశలు, ఆశయాలకు అనుగుణంగా రాష్ట్రంలో పాలన సాగుతోంది. అభివృద్ధికి పెద్దపీట వేశాం. గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు, తాగునీటి సదుపాయాలు, డ్రైనేజీల నిర్మాణానికి అధిక ప్రాధాన్యమిచ్చాం. జగన్ రెడ్డి ఐదేళ్ల అధికారంలో ఉండి.. కేంద్రం నిధులు కూడా తీసుకురాలేకపోయారు. కనీసం స్థానిక ఎన్నికలు కూడా నిర్వహించకుండా అభివృద్ధిని దెబ్బతీశారు. కానీ కూటమి అధికారంలోకి రాగానే కేంద్రం నిధులు విస్తృతంగా తీసుకొచ్చాం. వందల కోట్ల కేంద్ర నిధులు తీసుకొచ్చి నియోజకవర్గంలో పనులు చేస్తున్నాం. కానూరు-మోరి గ్రామానికి మధ్య రూ.20 కోట్ల వ్యయంతో వంతెన, రోడ్డు నిర్మాణం చేస్తున్నాం. పోలాటితిప్ప-గరాలదిబ్బ మధ్య గడిమేరు, గుండేరుపై రెండు వంతెనలు నిర్మిస్తున్నామన్నారు.గతంలో సెంటు స్థలం పేరుతో పేదలను దగా చేశారు. కాన నేడు అందరికీ కనీసం 2 సెంట్ల స్థలం ఇచ్చేలా ప్రణాళిక రచిస్తున్నాం. సబ్సిడీ కూడా రూ.2.50 లక్షలు మంజూరు చేయనున్నాం. పెద్దపట్నం గ్రామంలో తాగునీటి కుళాయిల ఏర్పాటుకు చిత్తశుద్ధితో ఉన్నాం. కేంద్రంలో రాష్ట్రంలో ఉమ్మడి ప్రభుత్వం ఉంది. స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల గెలుపుతో ట్రిపుల్ ఇంజిన్ సర్కారును ఏర్పాటు చేస్తాం. పెద్దపట్నం గ్రామానికి 24 గంటల విద్యుత్ అందించిన ఘనత కూడా కూటమి ప్రభుత్వానిదే. చేపలు, రొయ్యల చెరువులకు సబ్సిడీతో విద్యుత్ సదుపాయం కల్పిస్తున్నాం. పని చేసే వారిని గెలిపించండి. మాటలు చెప్పి మభ్యబెట్టే వైసీపీ నేతల్ని రాష్ట్రం నుండి తరిమికొడదాం. పెద్దపట్నం తీరాన్ని కూడా అభివృద్ధి చేస్తాం. బందరు కోటలో సీ వీడ్ పరిశ్రమ ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. తద్వారా స్థానిక మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించబోతున్నాం. రాష్ట్రం అభివృద్ధి కోసం కూటమి చేస్తున్న అభివృద్ధిని గుర్తించండి. ఇల్లు లేని ప్రతి ఒక్కరికీ సొంత ఇంటి కలను సాకారం చేసి చూపిస్తాను. వచ్చే సంవత్సరం నుండి బందరు పోర్టు వినియోగంలోకి రాబోతోంది. రూ.8000 కోట్లతో యుద్ధ నౌకల తయారీ పరిశ్రమను బందరుకు తీసుకొచ్చామన్నారు. బందరు యువతకు ఇక్కడే ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు.గొడ్డలి పార్టీ ఐదేళ్ల పాలనలో అరాచకాలు, దాడులు, దౌర్జన్యాలు తప్ప సాధించిందేమీ లేదు. రాష్ట్రంలో స్వేచ్ఛ లేకుండా చేశారు. బందరు మండలంలో అభివృద్ధి జరిగిందంటే అది కేవలం కూటమి ప్రభుత్వ హయాంలో మాత్రమే. అన్ని ప్రాంతాలకు రోడ్డు సదుపాయం కల్పిస్తున్నామన్నారు. లంక గ్రామాలకు వంతెనలు ఏర్పాటు చేసి అనుసంధానం పెంచుతామన్నారు. బందరు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అగ్రస్థానంలో నిలిపి తీరుతాను అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని విజయవంతంగా అమలు చేశామన్నారు. సూపర్ సిక్స్ హామీలు అమలు చేశామని, మత్స్యకారులకు వేట నిషేధ భృతి రూ.20 వేల చొప్పున అందిస్తున్నామన్నారు. తాజాగా వచ్చిన తుపానుతో నష్టపోయిన ప్రతి ఒక్కరికీ ఆర్థిక సాయం అందిస్తామన్నారు. అభివృద్ధికి.. అరాచకానికి మధ్య జరుగుతున్న ఈ ఎన్నికల సమరంలో ప్రజలే తమ ఓటు ఎవరికో నిర్ణయించుకోవాలని మంత్రి కొల్లు రవీంద్ర పిలుపునిచ్చారు.

నేడు కృష్ణా జిల్లాలో మూడు పట్టణ స్థానిక సంస్థలకు పోలింగ్

*** 1,97,412 మంది ఓటర్లు.. 241 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు**

*** ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఓటింగ్**

నవంబరు 3న ఓట్ల లెక్కింపు



మచిలీపట్నం, ప్రజాభూమి ప్రతినిధి

కృష్ణా జిల్లాలో రెండో సాధారణ స్థానిక సంస్థల ఎన్నికలు–2026లో భాగంగా మచిలీపట్నం నగరపాలక సంస్థతో పాటు పెడన, ఉయ్యూరు పురపాలక సంఘాలకు ఆదివారం (నవంబరు 1) పోలింగ్ నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి ఎన్నికల అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మూడు పట్టణ స్థానిక సంస్థల పరిధిలో మొత్తం 1,97,412 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఎన్నికల నిర్వహణ కోసం 241 పోలింగ్ కేంద్రాలను ఏర్పా టు చేసి, 241 మంది ప్రిసైడింగ్ అధికారులు, 723 మంది ఇతర పోలింగ్ సిబ్బందిని నియ మిం చారు. ఈ వివరాలను కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డి.కె. బాలాజీ వెల్లడిం చారు.

మచిలీపట్నం నగరపాలక సంస్థ పరిధిలో..

మచిలీపట్నం నగరపాలక సంస్థ పరిధిలో మొత్తం 1,39,246 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 66,504 మంది పురుషులు, 72,732 మంది మహిళలు ఉన్నారు. ఎన్నికల కోసం 161 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మేయర్ పదవికి ఐదుగురు అభ్యర్థులు పోటీలో ఉండగా, 60 డివిజన్లలో కార్పొరేటర్ స్థానాలకు 142 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. మొత్తంగా 147 మంది అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు.

పెడన పురపాలక సంఘంలో..

పెడన పురపాలక సంఘం పరిధిలో 25,373 మంది ఓటర్లు ఉండగా, వారిలో 12,212 మంది పురుషులు, 13,161 మంది మహిళలు ఉన్నారు. మొత్తం 32 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పదవికి ముగ్గురు అభ్యర్థులు, 28 వార్డు కౌన్సిలర్ స్థానాలకు 61 మంది అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. మొత్తంగా 64 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచారు.

ఉయ్యూరులో..

ఉయ్యూరు పురపాలక సంఘం పరిధిలో 32,793 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 15,768 మంది పురుషులు, 17,024 మంది మహిళలు ఉన్నారు. ఎన్నికల నిర్వహణకు 48 పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పదవికి ఆరుగురు అభ్యర్థులు, 32 వార్డు కౌన్సిలర్ స్థానాలకు 86 మంది అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. మొత్తంగా 92 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉన్నారు.

ఉదయం 7 నుంచి పోలింగ్..

మూడు పట్టణ స్థానిక సంస్థల్లో ఆదివారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ కొనసాగనుంది. పోలింగ్ ప్రక్రియ పూర్తయిన అనంతరం నవంబరు 3వ తేదీన ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు.ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, అర్హులైన ప్రతి ఓటరు తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రానికి చేరుకుని ఎలాంటి భయాందో ళనలకు తావులేకుండా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డి.కె. బాలాజీ విజ్ఞప్తి చేశారు.

నవంబర్ 1న మున్సిపల్ ఎన్నికల పోలింగ్ సందర్భంగా వేతనంతో కూడిన సెలవు

*** ఎన్నికలు జరిగే ప్రాంతాల్లోని దుకాణాలు, వాణిజ్య సంస్థల ఉద్యోగులు, కార్మికులకు సెలవు వర్తింపు * ఉత్తర్వులు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవు.... జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ**




ప్రజాభూమి ప్రతినిధి,విజయవాడ: జిల్లాలో మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీలు సాధారణ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో షెడ్యూల్ ప్రకారం నవంబర్ 1, 2026 (ఆదివారం)న ఎన్నికలు జరిగే ప్రాంతాల్లోని దుకాణాలు, వాణిజ్య సంస్థలు, ప్రైవేటు సంస్థల్లో పనిచేసే ఉద్యోగులు, కార్మికులకు వేతనంతో కూడిన సెలవు ప్రకటించినట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ తెలిపారు.ప్రభుత్వం జారీ చేసిన జీవో నెం.1316 (మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ & అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ)తో పాటు కార్మిక శాఖ సవరించిన ఆదేశాల మేరకు ఈ సెలవు వర్తిస్తుందని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ షాప్స్ అండ్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ చట్టం,1988 నిబంధనల ప్రకారం ఎన్నికలు జరిగే ప్రాంతాల్లోని అన్ని దుకాణాలు, వాణిజ్య సం స్థలు, ప్రైవేటు సంస్థల యాజమాన్యాలు తమ వద్ద పనిచేసే ఉద్యోగులు, కార్మికులకు వేతనంతో కూడిన సెలవు తప్పనిసరిగా కల్పించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ ఆదేశాలను అన్ని యాజమాన్యాలు కచ్చితంగా అమలు చేయాలని, నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, అర్హులైన ఓటర్లందరూ తమ ఓటు హక్కును బాధ్యతాయుతంగా వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ విజ్ఞప్తి చేశారు.

మున్సిపల్ ఎన్నికల పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియకు పటిష్ట పోలీసు భద్రత

–జిల్లా ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు



ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నంః కృష్ణా జిల్లాలో నవంబర్ 1వ తేదీన జరగనున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఉయ్యూరు పరిధిలో ఏర్పాటు చేసిన మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ కేంద్రాన్ని జిల్లా ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు, పోలీసు అధికారులతో కలిసి సందర్శించి, అక్కడ చేపట్టిన భద్రతా ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.జిల్లాలోని ఒక మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు ఉయ్యూరు, పెడన మున్సిపాలిటీలలో జరగనున్న ఎన్నికల పోలింగ్, తదనంతర కౌంటింగ్ ప్రక్రియ ను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో విస్తృత భద్రతా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ ప్రక్రియ కోసం సుమారు 1,000 మంది సిబ్బందిని నియమించి, అవసరమైన ప్రాంతాల్లో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.నిరంతర నిఘా.. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పర్యవేక్షణఎన్నికల పోలింగ్, కౌంటింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు ఆస్కారం లేకుండా డీఎస్పీల పర్యవేక్షణలో పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నిరంతర నిఘాతో పాటు బాడీ వార్న్ కెమెరాలు, డ్రోన్ కెమెరాల ద్వారా పరిస్థితులను పర్యవేక్షిస్తూ, అవసరమైన చోట్ల వీడియో చిత్రీకరణ చేపట్టాలని సూచించారు.కౌంటింగ్ కేంద్రాల వద్ద ఎన్నికల నియమావళిని కచ్చితంగా అమలు చేయాలని, కేంద్రాలకు వచ్చే ప్రతి ఒక్కరినీ నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా తనిఖీ చేసిన అనంతరమే లోపలికి అనుమతించాలని స్పష్టం చేశారు. ఎన్నికల విధులకు ఆటంకం కలగకుండా, భద్రతా నిబంధనలకు అనుగుణంగా రెవెన్యూ శాఖ సమన్వయంతో మొబైల్ ఫోన్ల డిపాజిట్‌కు అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని అధికారులకు సూచించారు.సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టిఉయ్యూరు పరిధిలో రెండు ప్రాంతాలను సమస్యాత్మక ప్రాంతాలుగా గుర్తించిన నేపథ్యంలో అక్కడ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడంతో పాటు, అవసరమైన పోలీసు అధికారులను అందుబాటులో ఉంచి పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.ప్రలోభాలకు లొంగకుండా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలిప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి ఓటరు ఎలాంటి భయం, ఒత్తిడి, ప్రలోభాలకు లోనుకాకుండా రాజ్యాంగం కల్పించిన తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే లేదా ఎన్నికల ప్రక్రియకు విఘాతం కలిగించే వ్యక్తుల సమాచారాన్ని పోలీసులకు తెలియజేయాలని, అటువంటి వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎన్నికల ప్రక్రియ మొత్తం ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగే లా ప్రజలు, ప్రజాప్రతినిధులు, ఎన్నికల సిబ్బంది పోలీస్ శాఖకు సహకరించాలని ఎస్పీ కోరారు.



పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంతంగా, స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు పటిష్ట ఏర్పాట్లు

*** ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలి**

*** పోలింగ్ కేంద్రాల పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు * ప్రతి ఓటరు బాధ్యతగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి:**

జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ



ప్రజాభూమి ప్రతినిధి,విజయవాడ:ఎన్టీఆర్ జిల్లాలో పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో, స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని విధాలా పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టిందని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జి. లక్ష్మీశ తెలిపారు.విజయవాడ కలెక్టరేట్‌లోని ఏవీఎస్ రెడ్డి సమావేశ మందిరంలో శనివారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ, ఎన్టీఆర్ జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల వ్యయ పరిశీలకులు బి.విజయకుమార్ సంయుక్తంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రవర్తనా నియమా వళి, పోలింగ్ కేంద్రాల వద్ద పాటించాల్సిన నిబంధనలు, అభ్యర్థుల ఎన్నికల వ్యయ పర్యవేక్షణ తదితర అంశాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, వారి ప్రతినిధులు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు ప్రజలు, రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, ఓటర్లు జిల్లా యంత్రాంగానికి పూర్తి సహకారం అందించాలని కోరారు. ప్రజాస్వా మ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి ఓటరు తమ ఓటు హక్కు ప్రాధాన్యతను గుర్తించి బాధ్యతగా తప్పనిసరిగా ఓటు వేయాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఎన్నికల వ్యయానికి సంబంధించి నిర్దేశించిన నిబంధనలను ప్రతి అభ్యర్థి తప్పనిసరిగా పాటించాలని, ఎవరూ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించరాదని సూచించారు. ఎన్నికల నిర్వహణలో పారదర్శకత, జవాబుదారీతనం ఉండేలా ఎన్నికల అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తారని తెలిపారు.ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు ఐఎన్‌సీ నుంచి బి.మురళీకృష్ణ, ఆమ్ ఆద్మీ పార్టీ నుంచి పి.హరికృష్ణ, సీపీఎం నుంచి డి.వి.కృష్ణ, వైఎస్సార్‌సీపీ నుంచి పి.రాజశేఖర్, వి.యశోధర్, టీడీపీ నుంచి బి.అనిల్, బీఎస్పీ నుంచి బి.కిరణ్, జనసేన పార్టీ నుంచి జె.శ్రీనివాస్, ఎన్నికల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో అప్రమత్తంగా వ్యవహరించాలి

ఎన్నికల విధులను నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించాలి: కలెక్టర్ డీకే బాలాజీ



ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నంః రెండో సాధారణ స్థానిక సంస్థల ఎన్నికలు–2026లో భాగంగా రేపు (నవంబర్ 1) జరగనున్న మున్సిపల్ ఎన్నికలకు సంబం ధించి జిల్లాలో ఏర్పాటు చేసిన ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాలను జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి డీకే బాలాజీ శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.మచిలీపట్నంలోని నోబుల్ కళాశాల, పెడనలోని సెయింట్ విన్సెంట్ పల్లోట్టి ఇంగ్లీష్ మీడియం స్కూల్, ఉయ్యూరులోని సిద్ధార్థ డిగ్రీ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్స్‌లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను సందర్శించి, పోలింగ్ సిబ్బందికి ఎన్నికల సామగ్రి పంపిణీ జరుగుతున్న తీరును పరిశీలించారు. పంపిణీ కేంద్రాల్లో చేపట్టిన ఏర్పాట్లు, సిబ్బందికి అందిస్తున్న ఎన్నికల సామగ్రి, ఇతర సదుపాయాలను తనిఖీ చేశారు.ఈ సందర్భంగా పోలింగ్ విధులకు హాజరైన ప్రిసైడింగ్ అధికారులు, ఇతర పోలింగ్ అధికారులతో కలెక్టర్ మాట్లాడి, ఎన్నికల నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. రిటర్నింగ్ అధికారుల హ్యాండ్‌బుక్, ప్రిసైడింగ్ అధికారుల హ్యాండ్‌బుక్ లో పొందుపరిచిన ప్రతి నిబంధనను అక్షరాలా, స్ఫూర్తితో సహా తూచా తప్పకుండా పాటించాలని స్పష్టం చేశారు.శిక్షణా కార్యక్రమాల్లో అందించిన సూచనలను మరోసారి గుర్తుచేసుకుంటూ, హ్యాండ్ బుక్‌లోని ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా చదివి పూర్తిస్థాయిలో అవగాహన చేసుకోవాలని సూచించారు. ఎన్నికల విధుల నిర్వహణలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా, నిబంధనలకు అనుగుణంగా ప్రతి దశను జాగ్రత్తగా పూర్తి చేయాలని తెలిపారు.డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో అందించే ఎన్నికల సామగ్రిని చెక్‌లిస్ట్ ప్రకారం ఒక్కొక్కటిగా సరిచూసుకొని స్వీకరించాలని, ముఖ్యంగా బ్యాలెట్ పేపర్లు, బ్యాలెట్ బాక్సులు, ఇతర ఎన్నికల సామగ్రి వివరాలు, సీరియల్ నంబర్లను జాగ్రత్తగా పరిశీలించుకోవాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రానికి చేరుకున్న అనంతరం కూడా సామగ్రిని మరోసారి సరిచూసుకొని, ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేసుకోవాలని సూచించారు.పోలింగ్ ప్రక్రియలో ఎలాంటి రాగద్వేషాలకు, పక్షపాత ధోరణులకు తావులేకుండా పూర్తిస్థాయి నిష్పక్షపాతంతో, పారదర్శకంగా విధులు నిర్వహించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎన్నికల నియమావళిని ఖచ్చితంగా పాటిస్తూ, ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రశాంత వాతావరణంలో పోలింగ్ ప్రక్రియ విజయవంతంగా నిర్వహించే బాధ్యత ప్రతి పోలింగ్ అధికారిపై ఉందని తెలిపారు.పోలింగ్ సిబ్బందికి 'కృష్ణ కానుక' కిట్ఎన్నికల విధుల నిర్వహణకు హాజరవుతున్న ప్రిసైడింగ్ అధికారులు, ఇతర పోలింగ్ సిబ్బంది సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని జిల్లా యంత్రాంగం తరపున ప్రతి ఒక్కరికీ 'కృష్ణ కానుక' పేరుతో ప్రత్యేక బహుమతి కిట్ అందజేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.

Printed and Published and owned by A.RAMAMOHANREDDY,Printed at Sri Lakshmi Offset Printers, R.S. No.268/2;D.No. 8/180,Surampalli Village, Gannavaram Mandalam, Krishna district, Andhra Pradesh and Published from D.NO. 32-26-85/6, MSR Street Marutinagar, Eluru Road, Vijayawada-520004,Krishna district, Andhra Pradesh, Editor :A.RAMAMOHANREDDY, RNI NO. APTEL/2011/41440, Phone No. Cell : 9502116677

ప్రజాభూమి
జనరల్ 13
ఆదివారం 1 నవంబర్ 2026


జనసేన అభ్యర్థినిని దెబ్బతీసేందుకే స్వతంత్ర అభ్యర్థి పోటీనా?

- జీలుగుమిల్లిలో బీజేపీ నాయకుడి తీరుపై
- చర్యలు తీసుకోవాలంటున్న కూటమి శ్రేణులు!
- బిజెపి అధిష్టానాని దృష్టికి తీసుకెళ్లి స్థానిక నాయకులు!

ప్రజాభూమి ప్రతినిధి, జీలుగుమిల్లి

జీలుగుమిల్లి మండల కేంద్రంలోని ఎంపీటీసీ స్థానంలో కూటమి పార్టీల ఉమ్మడి అభ్యర్థి కారం సుజాతకు మద్దతుగా ఆయా పార్టీల నాయకులు ఎన్నికల సమీకరణాలు చేసుకుంటుండగా, కూటమిలోని బీజేపీకి చెందిన ఓ సీనియర్ నాయకుడు స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలవడం రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది.

మిత్రపక్షమైన జనసేన అభ్యర్థినికి పోటీగా ఆయన స్వతంత్రంగా పోటీ చేయడం వెనుక ఉద్దేశం ఏమిటనే ప్రశ్నలు కూటమి వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి. వివరాల్లోకి



వెళితే.. జీలుగుమిల్లి ఎంపీటీసీ స్థానం జనరల్ కావడంతో టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల ఉమ్మడి మద్దతుతో కారం సుజాత పోటీలో నిలిచారు. ఎన్నికల్లో విజయం సాధిస్తే ఆమెకు ఎంపీపీ పదవి అప్పగించాలనే నిర్ణయంతో కూటమి నాయకులు ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. మరోవైపు వైఎస్సార్‌సీపీ తరఫున గంగుల రమేష్ పోటీ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కూటమి పార్టీలకు చెందిన నాయకుడే స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగడం పొత్తు ధర్మానికి విరుద్ధమనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఆయన పోటీ కారణంగా కూటమి ఓట్లు చీలే అవకాశం ఉందని పలువురు చర్చించుకుంటున్నారు. ఈ పరిణామం ప్రతిపక్ష అభ్యర్థికి అనుకూలంగా మారుతుందనే అభిప్రాయాలు కూడా వ్యక్తమవుతున్నాయి. కూటమి పార్టీల మధ్య అవగాహన ఉన్నప్పటికీ, ఒకే కూటమికి చెందిన నాయకుడు స్వతంత్రంగా పోటీ చేయడంపై సంబంధిత పార్టీ నాయకత్వం ఎలా స్పందిస్తుందోనని రాజకీయ వర్గాలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి.

కూటమి అభ్యర్థికి వ్యతిరేకంగా పోటీ చేస్తున్న నాయకుడిపై పార్టీ పరంగా ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సి ఉంది. ఇప్పటికే దీని పైన బిజెపి నాయకులు కూడా కరపత్రాలు, ప్రచార సామాగ్రి, కేంద్ర రాష్ట్ర నాయకుల ఫోటోలను పెట్టి ప్రచారం చేయడం పైన ఇస్మయ వ్యక్తం చేస్తున్నారు. ప్రధానమంత్రి ఫోటో, అమీషా ఫోటో, రాజ్ నాథ్ సింగ్ ఫోటో, జయశంకర్ ఫోటోలను ప్రచార రథం పై వాడటంతో జిల్లా రాష్ట్ర నాయకులు దృష్టికి తీసుకుని వెళ్లి తగు చర్యలు తీసుకోవాలని ముక్తకంఠతో కోరుతున్నారు.

ఒమ్మంగిలో కూటమి ఎన్నికల ప్రచార ర్యాలీ.. భారీగా తరలివచ్చిన శ్రేణులు!

ప్రజా భూమి, ప్రత్తిపాడు

ప్రత్తిపాడు మండలం ఒమ్మంగి గ్రామంలో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ఎన్నికల ప్రచారం జోరుగా సాగింది. ఇందులో భాగంగా కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొని గ్రామంలో ఘనంగా ప్రచార ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ప్రత్తిపాడు మండల పరిషత్ అధ్యక్ష (ఎంపీపీ) అభ్యర్థిని యాళ్ల మంగాదేవి, జెడ్పీటీసీ అభ్యర్థి రొంగల సత్యనారాయణ, ఒమ్మంగి ఎంపీటీసీ–1 అభ్యర్థిని సుంకర గంగాభవాని, ఎంపీటీసీ–2 అభ్యర్థి ముమ్మిడి వీరబాబు పాల్గొన్నారు. గ్రామంలోని ప్రధాన వీధుల మీదుగా ర్యాలీ కొనసాగగా, కూటమి శ్రేణులు ఉత్సాహంగా నినాదాలు చేస్తూ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. రాబోయే ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. గ్రామాభివృద్ధికి కృషి చేయడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి, స్థానిక అవసరాలకు ప్రాధాన్యత ఇస్తామని ప్రజలకు వివరించారు. కూటమి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ప్రచార కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లారు. భారీ సంఖ్యలో పార్టీ శ్రేణులు తరలిరావడంతో ఒమ్మంగి గ్రామంలో ఎన్నికల ప్రచార సందడి నెలకొంది.



కె కోట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ ఐక్యత దినోత్సవ వేడుకలు

ప్రజా భూమి ప్రతినిధి, కామవరపుకోట

స్థానిక కామవరపుకోట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె విజయబాబు సూచనలు మరియు కళాశాల ఉన్నత విద్య అకడమిక్ క్యాలెండర్ ప్రకారం నేడు రాజనీతి శాస్త్రం మరియు ఎన్. ఎస్. ఎస్ విభాగముల సంయుక్త ఆధ్వర్యంలో "జాతీయ ఐక్యతా దినోత్సవం" వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ఇంఛార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం మధు వల్లభాయ్ పటేల్ చిత్ర పటానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. అనంతరం



ఇంఛార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం మధు ప్రసంగిస్తూ స్వతంత్ర భారతదేశంలోని అనేక సంస్థానాలను ఏకం చేసి అఖండ భారతదేశ నిర్మాణంలో పటేల్ ఎంతో కృషి చేశారని పటేల్ చేసిన సేవలను కొనియాడారు. అనంతరం రాజనీతి శాస్త్ర అధ్యాపకుడు ధారావతు మల్లేష్ ప్రసంగిస్తూ పటేల్ ఆశయ సాధన కోసం ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. అనంతరం ఎన్ ఎస్ ఎస్ విభాగం ఆధ్వర్యంలో ఐక్యత ప్రతిజ్ఞ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఇంఛార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం మధు అధ్యాపకులు కె మహేష్ బాబు, ఎస్ సుశ్యలత, ధారావతు మల్లేష్, ఎం విజయ కృష్ణ, పి. కల్పనతో పాటు సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రచారంలో దూకుడు పెంచిన రాజకీయ పార్టీలు

మైకులమాతతో ఓరెత్తిపోతున్న వేలేరుపాడు

- అధికార పార్టీకి మొగ్గుచూపుతున్న ఓటర్లు

ప్రజాభూమి, ప్రతినిధి వేలేరుపాడు.

జడ్పిటిసి ఎంపిటిసి ఎన్నికల సమయం చేరువ అవుతుండటంతో రాజకీయ పార్టీలు ప్రచారంలో దూకుడు పెంచాయి. రకరకాలుగా ఓటర్లను మభ్యపెట్టే ప్రయత్నంలో రాజకీయ పార్టీలు నిమగ్నమై, ఓరాహోరీగా ఆటోలు, రకరకాల వాహనాలతో డిజె సౌండ్ లతో అభ్యర్థుల గెలుపుకై విస్తృత ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. ఎవరు ఎన్ని చెప్పినా ఓటర్లు మాత్రం తమదైన శైలిలో దృఢ నిశ్చయములో ఉన్నారు. ప్రస్తుత ప్రభుత్వం తమకు అన్ని విధాలుగా అనుకూలంగానే పనిచేస్తుందని, అభివృద్ధి సంక్షేమం రెండు



కళ్ళుగా ముఖ్యమంత్రి చంద్రబాబు పాలన కొనసాగుతుందని, ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి ఏ విధంగా ఉన్నప్పటికీ ఒకటో తారీకున తమ గృహం వద్దకు వచ్చి తలుపు తట్టి మరీ పెన్షన్లు అందిస్తున్నారని, రహదారుల విషయంలో ఎంతో మెరుగు కనపడిందని, ప్రయాణం చేయాలంటే గతంలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చేదని, ప్రస్తుతం ఏ వాహనంలో వెళ్లిన సంతృప్తిగా ఉందని పేర్కొంటున్నారు. పోలవరం నష్టపరిహారాల్లో సైతం అన్ని విధాలుగా అర్హులందరికీ ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ తో పాటు గృహ నష్టపరిహారాలు అందించారని పునరావాస కాలనీలో ప్రభుత్వం నిర్మించే గృహాలు ఎంతో సంతృప్తిగా ఉన్నాయని పేర్కొంటున్నారు.ఇన్ని విధాలుగా పాలన కొనసాగిస్తున్న అధికార పార్టీ అభ్యర్థులను గెలిపించడమే ఉత్తమం అన్న నిశ్చయానికి ఓటర్లు వచ్చారు. ఇక ప్రతిపక్ష వైసిపి సైతం తమ అభ్యర్థులు గెలుపు కోసం ప్రచారాన్ని ముమ్మరం చేసింది. ఏది ఏమైనా వేలేరుపాడు లో అన్ని రాజకీయ పార్టీల ప్రచారాలతో మైకులు మోతతో హోరెత్తిపోతుంది.

మున్సిపల్ ఎన్నికలకు పటిష్ట పోలీసు బందోబస్తు

- మున్సిపల్ ఎన్నికలకు పటిష్ట పోలీసు బందోబస్తు
- ఓటర్లు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకునేలా భద్రతా చర్యలు
- నర్సీపట్నం, ఎలమంచిలి, జీవీఎంసీ పరిధిలోని 9 వార్డులకు భారీ బందోబస్తు
- విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు: ఎస్పీ తుహిన్ సిన్హా

ప్రజాభూమి ప్రతినిధి-అనకాపల్లి

జిల్లాలో నేడు జరగనున్న మున్సిపల్ ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు పటిష్టమైన పోలీసు భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఐపీఎస్ తెలిపారు. జీవీఎంసీ పరిధిలోని 9 వార్డులతో పాటు నర్సీపట్నం, ఎలమంచిలి మున్సిపాలిటీలలో ఎన్నికల నేపథ్యంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. శనివారం నర్సీపట్నం టౌన్ పోలీస్ స్టేషన్ మైదానంలో ఎన్నికల విధులకు కేటాయించిన పోలీసు అధికారులు, సిబ్బందికి ఎస్పీ బ్రీఫింగ్ సమావేశం నిర్వహించారు. ఎన్నికల విధుల్లో పోలీసులు అనుసరించాల్సిన మార్గదర్శకాలు, చేయాల్సిన పనులు, చేయకూడని అంశాలపై స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం నర్సీపట్నం, బొడ్డేపల్లిలోని డాన్ బాస్కో డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రం, కౌంటింగ్ కేంద్రాన్ని నర్సీపట్నం ఆర్డీవో వి.వి.రమణతో కలిసి ఎస్పీ పరిశీలించారు. కేంద్రాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు, భద్రతా ఏర్పాట్లను సమీక్షించి సంబంధిత అధికారులకు తగిన సూచనలు చేశారు.

పోలీస్ యాక్ట్ సెక్షన్ 30, బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 163 అమలు

ఎన్నికల సందర్భంగా పోలింగ్ కేంద్రాల వద్ద శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీస్ యాక్ట్ సెక్షన్ 30, బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 163 అమల్లో ఉంటాయని ఎస్పీ తెలిపారు. ప్రజలు, రాజకీయ పార్టీల అభ్యర్థులు పోలీసు యంత్రాంగానికి సహకరించాలని కోరారు.



నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలి

ఎన్నికల విధుల్లో ఉన్న పోలీసు అధికారులు, సిబ్బంది ఎలాంటి పక్షపాతం లేకుండా నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలని ఎస్పీ ఆదేశించారు. కేటాయించిన పోలింగ్ కేంద్రాలు, సమస్యాత్మక ప్రాంతాల్లో నిరంతరం అప్రమత్తంగా ఉంటూ శాంతిభద్రతలను పర్యవేక్షించాలని సూచించారు. ఓటర్లు ఎలాంటి భయభ్రాంతులకు గురికాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా రక్షణ కల్పించాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద క్యూలైన్లను క్రమబద్ధీకరించడంతో పాటు వృద్ధులు, గర్భిణులు, దివ్యాంగులకు ప్రాధాన్యతనిస్తూ అవసరమైన సహాయం అందించాలని తెలిపారు. రిటర్నింగ్ అధికారులు, సెక్టోరల్ అధికారులు, పోలింగ్ బృందాలతో సమన్వయం చేసుకుంటూ ఎన్నికల నిబంధనలను పక్కాగా అమలు చేయాలని ఆదేశించారు.

పోలింగ్ కేంద్రాల వద్ద అనధికార వ్యక్తులకు అనుమతి లేదు

పోలింగ్ కేంద్రాల లోపలికి ఓటర్లు, గుర్తింపు పొందిన పోలింగ్ ఏజెంట్లు మినహా అనధికార వ్యక్తులను, రాజకీయ నాయకులను అనుమతించరాదని ఎస్పీ స్పష్టం చేశారు. విధుల్లో ఉన్న సంబంధిత అధికారులకు మినహా ఇతరులకు పోలింగ్ కేంద్రాల్లో మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకెళ్లకుండా కఠినంగా వ్యవహరించాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల పరిసరాల్లో గుంపులుగా చేరడం, రాజకీయ చర్చలు నిర్వహించడం వంటి చర్యలను నివారించాలని, చిన్న వివాదం తలెత్తినా వెంటనే స్పందించి పరిస్థితిని అదుపులోకి తీసుకురావాలని ఆదేశించారు. విధుల్లో అలసత్వం వహించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం డీఎస్పీ పోతిరెడ్డి శ్రీనివాసరావు, ఏఆర్ డీఎస్పీ ఎ.రవికుమార్, పలువురు సీఐలు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



గుప్తా దంపతులకు ఘన సన్మానం

82వ జన్మదిన వేడుకలు

ప్రజాభూమి ఏలూరు

గుప్తా ఫౌండేషన్ వ్యవస్థాపకులు, ప్రముఖ సేవా కార్యకర్త మడుపల్లి మోహన గుప్త 82వ జన్మదిన వేడుకలు, ఆత్మీయ సన్మాన కార్యక్రమం స్థానిక వై.ఎం.హెచ్.ఏ. ఏ.సి. హాలులో ఘనంగా నిర్వహించారు.హిందూ యువజన సంఘం (వై.ఎం.హెచ్.ఏ.)తో పాటు వివిధ సంస్థల ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో 49 సంస్థల ప్రతినిధులు,వేద పండితులు,ప్రముఖులు పాల్గొని మడుపల్లి మోహన గుప్త,మల్లేశ్వరి దంపతులను ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు మాట్లాడుతూ సాంస్కృతిక,కళా,సేవా, ఆధ్యాత్మిక,విద్యా రంగాల్లో గుప్త దంపతులు అందిస్తున్న సేవలను కొనియాడారు.వారి సేవలను గుర్తించి పద్మశ్రీ లేదా పద్మ విభూషణ్ పురస్కారంతో భారత ప్రభుత్వం గౌరవించాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో వేద పండితుల ఆశీర్వచనాలు, వేదమంత్ర పఠనం నిర్వహించారు.కళారత్న కె.వి. సత్యనారాయణ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.వై.ఎం.హెచ్.ఏ.కమిటీ సభ్యులు,వివిధ సంస్థల ప్రతినిధులు, కళాకారులు, నగర ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులదే విజయం

- గ్రామగ్రామాన ప్రచారంలో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు



ప్రజాభూమిప్రతినిధి, తాళ్లపూడి

తాళ్లపూడి మండలంలో జరగనున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, మండల టీడీపీ అధ్యక్షుడు సిద్ధా దుర్గారావుతో కలిసి గ్రామాల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కూటమి అభ్యర్థులను గెలిపిస్తేనే గ్రామాల అభివృద్ధికి మరింత అవకాశం ఉంటుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మండలంలోని అన్ని స్థానాల్లో కూటమి అభ్యర్థులే విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. జెడ్పీటీసీ అభ్యర్థి కొక్కిరిపాటి అనంతలక్ష్మి, ఎంపీపీ అభ్యర్థి నామా నాగశంకర రాణి, కొండబాబు తదితరులు పాల్గొని వేగేశ్వరపురం, తాళ్లపూడి, ప్రక్కిలంక, తాడిపూడి, పెద్దేవం, తిరుగుడుమెట్ట, మలకపల్లి, గజ్జరం, బల్లిపాడు, పోచవరం, అన్నదేవరపేట గ్రామాల్లో ప్రచారం నిర్వహించి కూటమి అభ్యర్థులకు మద్దతు కోరారు.

జడ్పిటిసి 15 ఎంపీటీసీలు మనమే గెలవాలి

ప్రజాభూమి ప్రతినిధి - చాట్రాయి

రానున్న ఐదో తేదీన జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలు 15ఎంపిటిసి, జడ్పిటిసి పోటీలో తెలుగుదేశం కూటమి విజయం సాధించి ఎంపిటిసి సభ్యులను జడ్పిటిసిని మనమే గెలవాలని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. చాట్రాయి మండలంలోని ఆరుగొలను పేట కళ్యాణ మండపంలో శనివారం కూటమి ఎన్నికల సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ ,పౌర సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి హాజరై మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం ఐదు సంవత్సరాలలో చేయలేని అభివృద్ధిని తెలుగుదేశం ప్రభుత్వం రెండున్నర సంవత్సరాలలో చేసి చూపించిందని అన్నారు. 2024 ఎన్నికలకు ముందు చాట్రాయి మండలంలో ఏ రోడ్డు చూసిన గుంటలమయంగా ఉన్నదని తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మండలంలో సిమెంట్ రోడ్లు, తారు రోడ్లు వేయడం జరిగిందని అన్నారు. రానున్న రెండేళ్లలో చింతలపూడి ఎత్తిపోతల పథకం పనులు ,అదేవిధంగా చాట్రాయి మండలంలో మెరక ప్రాంతముగా ఉన్నందున 50 వేల ఎకరాలకు డ్రిప్ ఇరిగేషన్ ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. వైసీపీ నాయకులు ఎన్ని కుట్రల పన్నిన మన పార్టీ




కార్యకర్తలు వాటిని తిప్పి కొట్టి చాట్రాయి మండలంలోని 15 ఎంపీటీసీ సభ్యులను జెడ్పిటిసిని మన పార్టీ కైవసం చేసుకోవాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమానికి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ఇజ్జి గాని వెంకటేశ్వర రావు అధ్యక్షత వహించగా పార్టీ నాయకులు మండపాటి బసవ రెడ్డి ,మోరంపూడి శ్రీనివాసరావు, మరిడి వెంకటేశ్వరరావు ,బొట్టు రామచంద్రరావు ,జనసేన పార్టీ నాయకులు తుమ్మల జగన్, బిజెపి నాయకుడు బుర్రి శ్రీకర్ తదితరులు మాట్లాడారు .ఈ కార్యక్రమంలో వేలాదిమంది కూటమి కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

ప్రచారంలో దూసుకుపోతున్న ఆత్రేయపురం వైస్సార్సీపీ జడ్పీటీసి అభ్యర్థి కప్పల శ్రీధర్

- అంకంపాలెం, నార్కెట్‌మిల్లి, కట్టుంగపాలెంలో ఇంటింటా ప్రచారం

ప్రజాభూమి ప్రతినిధి కొత్తపేట



ఆత్రేయపురం మండల వైఎస్సార్‌సీపీ జడ్పీటీసీ అభ్యర్థి కప్పల శ్రీధర్ ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్నారు. ప్రచారంలో భాగంగా అంకంపాలెం, నార్కెట్‌మిల్లి, కట్టుంగపాలెం గ్రామాల్లో ఆయన విస్తృతంగా పర్యటించారు. ఆయా గ్రామాల ఎంపీటీసీ అభ్యర్థులు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలుసుకుని తనకు, పార్టీ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా కప్పల శ్రీధర్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను తెలుసుకుని, వారి సంక్షేమం కోసం నిరంతరం అందుబాటులో ఉంటానని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించడం ద్వారా గ్రామాల అభివృద్ధికి బాటలు వేయాలని కోరారు. వైఎస్సార్‌సీపీ నాయకులు మాట్లాడుతూ సమ్మకానికి, మోసానికి మధ్య జరుగుతున్న ఈ ఎన్నికల్లో ప్రజలు వైఎస్సార్‌సీపీకి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు మద్దతుగా ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి బలపరిచిన జడ్పీటీసీ అభ్యర్థి కప్పల శ్రీధర్‌తో పాటు ఎంపీటీసీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు గంగారం చౌదరి, కొరుటూరు శ్రీనివాసరావు, పాల నాగేశ్వరరావు తదితర నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రజాభూమి

జనరల్ 14

ఆదివారం 1 నవంబర్ 2026



రోడ్డు ప్రమాద బాధిత కుటుంబానికి అండగా ఉంటాం

- మంత్రి పార్థసారథి

ప్రజా భూమి ప్రతినిధి, ఆగిరిపల్లి

నూజీవీడు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన దాసరి గోపికృష్ణ కుటుంబాన్ని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి శనివారం పరామర్శించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు. బాధిత కుటుంబానికి, మృతుడి ఇద్దరు పిల్లల చదువుకు ప్రభుత్వం తరఫున అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఎస్.ఏ.పేట సమీపంలో బీరు లారీ ప్రమాదంలో గోపికృష్ణ మృతిచెంది మూడు రోజులైనా గుర్తించకపోవడం విచారకరమని పేర్కొంటూ, లారీ డ్రైవర్, సరుకు యజమానిపై కేసులు నమోదు చేసి బాధిత కుటుంబానికి న్యాయమైన పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు. త్వరితగతిన పోస్టుమార్టం పూర్తి చేసి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించాలని వైద్యాధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు, పోలీసులు, కూటమి నాయకులు, గ్రామ నాయకులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థులకు మద్దతుగా

ఎమ్మెల్యే ముప్పిడి ప్రచారం

- సూరంపేట, అన్నదేవరపేటలో ఇంటింటి ఎన్నికల ప్రచారం



ప్రజాభూమి ప్రతినిధి, తాళ్లపూడి

తాళ్లపూడి మండలం అన్నదేవరపేట పంచాయతీ సూరంపేటలో కూటమి బలపరిచిన ఎంపీటీసీ-2 టీడీపీ అభ్యర్థి మైనం వెంకటేశ్వరరావుకు మద్దతుగా కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సైకిల్ గుర్తుపై ఓటు వేసి అభ్యర్థిని గెలిపించాలని కోరుతూ ఇంటింటికీ వెళ్లి ఓటర్లను అభ్యర్థించారు. అదేవిధంగా అన్నదేవరపేటలో కూటమి బలపరిచిన ఎంపీటీసీ-1 జనసేన అభ్యర్థి చేవ్వూరి రాముకు మద్దతుగా ఎమ్మెల్యే ప్రచారం చేపట్టారు. గాజు గ్లాసు గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని గ్రామ ప్రజలను కోరారు. ఈ ప్రచార కార్యక్రమాల్లో తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్నబ్ తుఫాన్ బాధితులకు ఆహార పొట్లాలు పంపిణీ చేసిన కె.రాజ అంబేద్కర్



ప్రజాభూమి ప్రతినిధి,రామచంద్రపురం

రామచంద్రపురంలో అర్నాబ్ తుఫాన్ ప్రభావిత బాధితులకు సుమారు 200 మందికి ఆహార పొట్లాలు పంపిణీ చేశారు, పట్టణంలోని బ్రాడీపేట,చాకలిపేట,రైస్ పేట, జండా వీధిలకు చెందిన పేదలకు ఈ ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. ద్రాక్షారామ పాస్టర్ ఫిలోషిఫ్ ప్రెసిడెంట్ కుక్కల పౌల్ రాజు కుమారుడు కె.రాజా అంబేద్కర్ వరద తుఫాను బాధితులకు ఈ ఆహార పొట్లాలు పంపిణీ చేయడం జరిగింది.

మోటార్‌సైకిల్‌ను ఢీకొట్టి బోల్తాపడిన లారీ.. వ్యక్తి మృతి

ప్రజా భూమి ప్రతినిధి, ఆగిరిపల్లి



పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శోభనాపురం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి విజయవాడ లోని ప్రైవేటు గ్యాస్ కంపెనీలో డెలివరీ సిబ్బందిగా పనిచేస్తున్నారు. అక్టోబరు 29న విధులకు వెళ్లి తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. ఈ నేపథ్యంలో అక్టోబరు 31న ఉదయం సత్తాయిపేట గ్రామ శివారులో బోల్తాపడిన లారీ సమీపంలో ఆయన హెల్మెట్ కనిపించడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై వి.సురేష్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని జేసీబీ సహాయంతో లారీని తొలగించగా, కింద మృతదేహం, మోటార్‌సైకిల్ కనిపించాయి. గణపవరం క్రాస్‌రోడ్డు నుంచి విజయవాడ వైపు వెళ్తున్న 12 చక్రాల లారీ (**AP37TK2466**) డ్రైవర్ అజాగ్రత్త, అతివేగం కారణంగా మోటార్‌సైకిల్‌ను ఢీకొట్టి బోల్తాపడటంతో ఈ ప్రమాదం జరిగినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు ఎస్సై వి. సురేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రామచంద్రపురం మున్సిపల్ ఎన్నికలకు సర్వం సిద్ధం

- 32 వార్డులు.. 50 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు
- ఆదివారం ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్
- ఎన్నికల విధుల్లో 350 మంది సిబ్బంది
- 200 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు
- సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక నిఘా



ప్రజాభూమి ప్రతినిధి,రామచంద్రపురం

రామచంద్రపురం పురపాలక సంఘ ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఆదివారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నారు. మొత్తం 32 వార్డులకు సంబంధించి 50 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ఒకవైపు ఎన్నికల అధికారులు, మరోవైపు పోలీసు యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేపట్టాయి.

పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సామగ్రి తరలించారు

రామచంద్రాపురంలో చింతపల్లి సూరన్న మున్సిపల్ హైస్కూల్‌ను ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రంగా ఏర్పాటు చేశారు. శనివారం ఇక్కడకు చేరుకున్న ఎన్నికల సిబ్బంది మధ్యాహ్న భోజనాల అనంతరం 2 గంటల నుంచి బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పత్రాలు, ఇతర ఎన్నికల సామగ్రిని ఆయా పోలింగ్ కేంద్రాలకు మున్సిపల్ కమిషనర్ రాజు ఆధ్వర్యంలో మున్సిపల్ సిబ్బంది ప్రత్యేక కౌంటర్ల ద్వారా ఎన్నికల సామగ్రిని అందజేశారు. మొత్తం 8 రూట్లలో వాహనాల ద్వారా ఎన్నికల సామగ్రిని పోలింగ్ కేంద్రాలకు తరలించే ఏర్పాట్లు చేశారు.ఎన్నికల విధుల్లో 350 మంది సిబ్బంది విధులకు హాజరుకానున్నారు. ఎన్నికల నిర్వహణ కోసం 50 మంది ప్రిసైడింగ్ అధికారులు మరో 50 మంది అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు నియమించారు. వీరితోపాటు 7గురు రిజర్వు సిబ్బందిని అందుబాటులో ఉంచారు. మొత్తం 350 మంది ఎన్నికల సిబ్బందిని నియమించారు. ఒక్కో పోలింగ్ కేంద్రంలో ఐదుగురు చొప్పున విధులు నిర్వహించనున్నారు. 8 రూట్లకు 8 మంది రూట్ అధికారులతోపాటు ఇద్దరు జోనల్ అధికారులను నియమించారు. వీరి పర్యవేక్షణలో ఎన్నికల సామగ్రి ఆయా కేంద్రాలకు చేరుకునేలా చర్యలు చేపట్టారు. మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు శాఖ పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. ఇద్దరు సిఐలు 8 రూట్లో ఎన్నికల 200 మంది పోలీసులతో బందోబస్తును ఏర్పాటు చేసినట్లు రామచంద్రపురం సిఐ వెంకటనారాయణ పేర్కొన్నారు. రామచంద్రపురం సిఐ వెంకటనారాయణ, పి గన్నవరం సిఐ భీమరాజు పర్యవేక్షించనున్నారు. ఎన్నికల భద్రత కోసం ఇద్దరు సీఐలు, 10 మంది ఎస్సైలు, ఏఎస్సైలు, హెడ్ కానిస్టేబుళ్లు కానిస్టేబుళ్లు , హోంగార్డులు తదితరులతో కలిపి మొత్తం 200 మంది పోలీసు సిబ్బందిని నియమించారు. అలాగే స్పెషల్ స్ట్రైకింగ్ పోర్సులో రామచంద్రపురం డిఎస్పి శేషు, పట్టణవ్యాప్తంగా రెండు స్ట్రైకింగ్ ఫోర్స్ బృందాలు, రెండు స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ బృందాలు, ఎప్పటికప్పుడు పరిస్థితులను జిల్లా ఎస్పీకి తెలియజేస్తూ బందోబస్తును పర్యవేక్షించనున్నారు. సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా తగిన ఏర్పాట్లు చేసారు.

32 వార్డులు 35,728 మంది ఓటర్లు.

రామచంద్రపురం పురపాలిక సంఘం పరిధిలో 32 వార్డుల్లో 35,728 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 17,188 మంది పురుషులు, 18,540 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. పురుషుల కంటే మహిళా ఓటర్లు 1,352 మంది అధికంగా ఉన్నారు. రామచంద్రపురం పురపాలిక పరిధిలోని 32 వార్డుల్లో ఓటర్ల జాబితాల పరిశీలన, పోలింగ్ కేంద్రాల గుర్తింపు, ఎన్నికల సిబ్బంది అవసరాల అంచనా, పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాల కల్పన వంటి అంశాల్లో అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఉన్నతాధికారులు సూచించారు.



జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలపై సమీక్ష సమావేశం నిర్వహించిన ఎమ్మెల్యే

ప్రజాభూమి దెందులూరు

మండలంలోని చల్ల చింతలపూడిలో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నేపథ్యంలో మండల పార్టీ అధ్యక్షులు, జడ్పీటీసీ అభ్యర్థి,చల్ల చింతలపూడి ఎంపీటీసీ అభ్యర్థితో దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎన్నికల నిర్వహణ,పార్టీ బలోపేతం, గ్రామస్థాయిలో చేపట్టాల్సిన ప్రచార కార్యక్రమాలు, ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకోవడం వంటి అంశాలపై చర్చించారు. ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, ఎన్నికల ప్రచారంలో ప్రతి కార్యకర్త చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు.జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా అందరూ కలిసికట్టుగా పనిచేయాలని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సూచించారు.

గజ్జరంలో ఎల్లిన శ్రీనివాస్‌కు ప్రజల మద్దతు

- సేవా తత్వమే తన బలమంటున్న వైకాపా ఎంపీటీసీ అభ్యర్థి



ప్రజాభూమి ప్రతినిధి, తాళ్లపూడి

తాళ్లపూడి మండలం గజ్జరం గ్రామంలో వైకాపా ఎంపీటీసీ అభ్యర్థి ఎల్లిన శ్రీనివాస్ ఎన్నికల ప్రచారం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. రాజకీయ నాయకుడిగానే కాకుండా గ్రామ ప్రజలకు అందుబాటులో ఉండే వ్యక్తిగా ఆయనకు గుర్తింపు ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. గ్రామంలో ఎవరికి ఆపద వచ్చినా, సమస్య ఎదురైనా అండగా నిలుస్తూ, అర్ధరాత్రి వేళ సైతం సహాయానికి ముందుంటారని చెబుతున్నారు. ఆయన సేవా తత్వం, ప్రజలతో ఉన్న అనుబంధం కారణంగా కులమతాలకు అతీతంగా వివిధ వర్గాల ప్రజలు మద్దతు తెలుపుతున్నారని ఆయన అనుచరులు పేర్కొంటున్నారు. పెద్దలు, యువకులు, మహిళలు స్వచ్ఛందంగా ప్రచారంలో పాల్గొంటూ ఆయనకు మద్దతు ప్రకటిస్తున్నారు.

ఎల్లిన శ్రీనివాస్ ఎంపీటీసీగా ఎన్నికైతే గ్రామ అభివృద్ధికి కృషి చేస్తారనే ఆశాభావాన్ని ఆయన మద్దతుదారులు వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో అభ్యర్థి తరఫున ప్రజలే ప్రచార బాధ్యతలు చేపట్టడం ప్రత్యేకంగా నిలుస్తోంది.

మీ వెనుక మేమున్నాం



- కారం సుజాత, నాగమణిని గెలిపించండి
- జనసేన నేత గడ్డమణుగు రవికుమార్

ప్రజాభూమి ప్రతినిధి,జీలుగుమిల్లి

రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో తెలుగుదేశం జనసేన బిజెపి బలపరిచిన జీలుగుమిల్లి ఎంపీటీసీ అభ్యర్థి కారం సుజాతను, జడ్పిటిసి అభ్యర్థి కుంజా నాగమణి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని జనసేన నేత గడ్డమణుగు రవికుమార్ పేర్కొన్నారు. జీలుగుమిల్లిలో స్థానిక దాసు సంక్షేమ సంఘం శుక్రవారం శుక్రవారం రాత్రి నిర్వహించారు. ఈ సమావేశానికి రవికుమార్ తో పాటు టిడిపి మండల అధ్యక్షులు సుంకవల్లి సాయికృష్ణ, జనసేన మండల అధ్యక్షులు పసుపులేటి రాము ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ జీలుగుమిల్లి దాసులు అంటే మంచిత నానికి మారుపేరని అని అన్నారు. రానుల స్థానిక సంస్థలు ఎన్నికల్లో సుజాతను నాగమణిని గెలిపించాలని కోరారు.

ఎన్నికల విజయం సాధించిన వెంటనే ప్రభుత్వం ప్రవేశపెట్టే ప్రతి సంక్షేమ పథకాల్లో దాసులకు సముచిత స్థానం కల్పిస్తామని అన్నారు. దాసులకు ఏ అవసరం ఉన్నా నేనున్నానని గుర్తు చేశారు. దాసులు తనను ఒక కోరిక అడిగారని దానిని కచ్చితంగా సాకారం చేస్తానని హామీ ఇచ్చారు. అంతేకాకుండా రానున్న ఆర్థిక సంఘం నిధులతో సిసి రహదారులు నిర్మించే బాధ్యత తమదేనని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పసుపులేటి ప్రసాద్, ఎమ్మెల్యే బాలరాజు జ్యోతి, వీరభత్తుల ధనుంజయ, కోల మధు, గద్దె సుబ్రహ్మణ్యం, మోడియం వెంకటకృష్ణ, చిర్రి శ్రీను, దాసు సంఘ సభ్యులు గెడ్డం జనార్ధన్, కోరం చెన్నకేశవ, జెట్టి రామకృష్ణ, నేలటూరి సత్యం మాస్టర్ తదితరులు పాల్గొన్నారు.

బిజెపి జనసేన అభ్యర్థుల ఎన్నికల ప్రచారాల్లో పాల్గొంటున్న ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్

ప్రజా భూమి ప్రతినిధి పెదపాడు



తెలుగుదేశం పార్టీ స్థానిక సంస్థల అభ్యర్థులతో పాటు కూటమిలోని జనసేన బిజెపి అభ్యర్థుల ఎన్నికల ప్రచారా ల్లో గ్రామ గ్రామాన వీధి వీధిలో పర్యటిస్తూ దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ కూటమీ పార్టీలపై తనకున్న అభిమానాన్ని చాటి చెప్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారాల్లో భాగంగా శనివారం సాయంత్రం పెదపాడు మండలం వట్లూరు గ్రామంలో జరిగిన ఎన్నికల ప్రచారంలో వట్లూరు ఎంపీటీసీ 2కి జనసేన తరపున కూటమి అభ్యర్థి అయిన ఉప్పు కల్కి రమేష్, అలాగే పెదపాడు జెడ్పిటిసి కి బిజెపి తరపున కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న చౌటుపల్లి విక్రమ్ కిషోర్ కోసం ఎన్నికల ప్రచారం నిర్వహించి, గ్రామంలోని వీధి వీధిలో పర్యటిస్తూ ఓటర్లను కూటమి అభ్యర్థులకు ఓట్లు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాల్సిందిగా కోరుతూ దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ విస్తృత స్థాయి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి, పల్లెల ప్రగతి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ట్రిపుల్ ఇంజిన్ సర్కార్ కోసం కూటమి అభ్యర్థులను అఖండ మెజారిటీతో గెలిపించాలని దెందులూరు శాసనసభ్యులు చింతమనేని ప్రభాకర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ ఉప్పలపాటి రాంప్రసాద్, పెదపాడు మండల పార్టీ అధ్యక్షులు మరడాని రవి, పెదవేగి జడ్పిటిసి సభ్యురాలు చింతమనేని నవ్యశ్రీ, వట్లూరు సొసైటీ చైర్మన్, మండల పార్టీ సెక్రటరీ వేగుంట సురేష్ పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు..

30 రోజులు పట్టే విద్యుత్ పునరుద్ధరణ పనులు 7 ఏడు రోజుల్లో పూర్తిచేసేలా లక్ష్యం

- మంత్రి నిమ్మల
- విద్యుత్ సబ్ స్టేషన్లను సందర్శించి పనులను పరివేక్షణ

ప్రజాభూమి ప్రతినిధి, పాలకొల్లు



ఆర్నాబ్ తుఫాన్ ప్రభావంతో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులను రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పరుగులు పెట్టిస్తున్నారు. పనులు వేగవంతంగా ఎక్కడ జాప్యం లేకుండా జరిగేలా ఎప్పటికప్పుడు విద్యుత్ శాఖ అధికార యంత్రాంగంతో మాట్లాడుతూ సమీక్ష చేస్తున్నారు. అందులో భాగంగా శనివారం పాలకొల్లులోని ఎ ఎంసీ ఇండోర్, పూలపల్లి , అడవి పాలెం విద్యుత్ కేంద్రాలను ఆయన సందర్శించి తుఫాన్ కారణంగా దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థ పునరుద్ధరణకు చేపడుతున్న చర్యలను స్వయంగా పరిశీలించారు. విద్యుత్ సరఫరా పునరుద్ధరణలో ఎలాంటి జాప్యం జరగకుండా పనులను మరింత వేగవంతం చేయాలని సూచించారు. విద్యుత్ రంగం అస్తవ్యస్తమై గోదావరి జిల్లాలో వేలాదికి పైగా విద్యుత్ స్తంభాలు కిఎక్కడకక్కడ పరిపోవడం, వైర్లు తెగిపోవడం, ట్రాన్స్ఫార్మర్లు దెబ్బతిన్నం వంటి పరిణామాలు చోటుచేసుకున్నాయి. ప్రస్తుత స్థితిలో నెల రోజులు పట్టే విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులు వారం రోజుల్లోనే జరిగేలా వేగవంతంగా జరుగుతున్నాయని తెలిపారు. చంద్రబాబు ఆదేశాలతో పెద్ద ఎత్తున మిషనరీతోపాటు రాష్ట్రంలోని ఇతర జిల్లాలు, తెలంగాణ, ఒరిస్సా, జార్ఖండ్ తదితర ప్రాంతాల నుంచి వచ్చిన వేలాది మంది విద్యుత్ సిబ్బంది రాత్రింబవళ్లు కష్టపడి పనిచేస్తున్నారు అన్నారు. ఇటువంటి విపత్కర పరిస్థితుల్లో విద్యుత్ కష్టాలు తీర్చేందుకు నిరంతరంగా శ్రమిస్తున్న విద్యుత్ సిబ్బందితో మమేకమై వారికి టిఫిన్ స్వయంగా వడ్డించడంతోపాటు అభినందనలు తెలిపారు. మంత్రి రామానాయుడు కృషి ఫలితంగా ఇప్పటికే పాలకొల్లులో కొన్ని ప్రాంతాలకు విద్యుత్ సరఫరా పునరుద్ధరణతో ఆ ప్రాంత ప్రజలు ఊపిరి పీల్చుకుంటున్నారు. పూర్తిస్థాయిలో విద్యుత్ పునరుద్ధరణ పూ ర్తయ్యే వరకు అధికారులు సమన్వయంతో పని చేయాలని , కూటమి నాయకులు గ్రామాల్లో అన్ని విధాలుగా సహకరించా లని మంత్రి నిమ్మల పిలుపునిచ్చారు. తుఫాను నేపథ్యంలో చంద్రబాబు నష్టపోయిన వరి పొలాలు, కొబ్బరి చెట్లు, వంటివి స్వయంగా పరిశీలించి నష్టపరిహారం ప్రకటించడం రైతులకు భరోసా కలిగిందన్నారు. విద్యుత్తు పునరుద్ధరణలో మంత్రి రామానాయుడు కష్టపడుతున్న తీరును కొనియాడుతూ విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బందిని ప్రజలు కొనియాడుతున్నారు.

ప్రజాభూమి
జనరల్ 15
ఆదివారం 1 నవంబరు 2026

కూటమి అభ్యర్థుల ఇంటింటి ప్రచారానికి విశేష స్పందన

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ప్రజల మద్దతు కోరిన విష్ణుప్రియ, రమాదేవి, నాగమ్మ

ప్రజాభూమి, ప్రతినిధి-వి.ఆర్.పురం



వి.ఆర్.పురం మండలంలో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల ప్రచారం జోరందుకుంది. శనివారం రేఖపల్లి సెగ్మెంట్ పరిధిలోని ఉమ్మడివరం, ములకలపల్లి సెగ్మెంట్‌లోని జల్లివారిగూడెం గ్రామాల్లో కూటమి అభ్యర్థులు విస్తృతంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. జడ్పీటీసీ కూటమి అభ్యర్థి వాళ్ల విష్ణుప్రియ, రేఖపల్లి ఎంపీటీసీ అభ్యర్థి పాయం రమాదేవి, ములకల పల్లి ఎంపీటీసీ అభ్యర్థి బొగ్గ నాగమ్మలు ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ తమకు మద్దతు ఇవ్వాలని అభ్యర్థించారు. ఈ సందర్భం గా అభ్యర్థులు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, సంక్షేమ పథకాల సమర్థవంతమైన అమలు, ప్రజలకు మెరుగైన పాలన అందించడమే కూటమి ప్రభు త్వ లక్ష్యమని తెలిపారు. పోలవరం నిర్వాసి తుల సమస్యల పరిష్కారంతో పాటు రహదా రులు, తాగునీరు, విద్య, వైద్యం వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్న ట్లు పేర్కొన్నారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తామ ని, గ్రామాల అభివృద్ధికి నిరంతరం అందుబా టులో ఉంటామని హామీ ఇచ్చారు. మాటలు చెప్పే నాయకత్వం కంటే ఇచ్చిన హామీలను అమలు చేసే నాయకత్వానికి ప్రజలు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. జడ్పీటీసీ అభ్యర్థి వాళ్ల విష్ణుప్రియతో పాటు ఎంపీటీసీ అభ్యర్థులు పాయం రమాదేవి, బొగ్గ నాగమ్మలకు కూటమి గుర్తులపై ఓట్లు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని ఇంటింటి



కీ తిరుగుతూ ప్రజలను కోరారు. కాగా, ప్రచా ర కార్యక్రమానికి గ్రామాల్లో ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. టీడీపీ నాయకు లు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా నినాదాలు చేస్తూ ప్రచారాన్ని ఉత్సాహంగా నిర్వహించారు.

గొల్లగూడెం, వడ్డిగూడెంలో వైఎస్సార్‌సీపీ ప్రచారం

విజయలక్ష్మి, దినేష్, రామారావుకు మద్దతుగా జోరుగా ఇంటింటా ప్రచారం



ప్రజాభూమి ప్రతినిధి-వి.ఆర్.పురం



వి.ఆర్.పురం మండలంలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. వైఎస్సార్ సీపీ అభ్యర్థులు, నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లో విస్తృతంగా పర్యటిస్తూ ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా రేకపల్లి ఎంపీటీసీ సెగ్మెంట్ పరిధిలోని గొల్ల గూడెం గ్రామంలో మండల వైఎస్సార్‌సీపీ నాయకుల ఆధ్వర్యంలో జడ్పీటీసీ అభ్యర్థి బంధం విజయలక్ష్మి, ఎంపీటీసీ అభ్యర్థి సోడి దినేష ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి ఓటర్లను కలుసుకున్న అభ్యర్థులు తమకు మద్దతుగా నిలవాలని కోరారు. ప్రజల సమస్యలను తెలుసుకుంటూ, గ్రామాల అభివృద్ధి, మౌలిక వసతుల మెరుగుదల, ప్రజలకు అందుబాటు లో ఉండే పాలన కోసం కృషి చేస్తామని తెలి పారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తమను అఖండ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. అదేవిధంగా వడ్డిగూడెం గ్రామంలో జడ్పీటీసీ అభ్యర్థి బంధం విజయల క్ష్మి, ఎంపీటీసీ అభ్యర్థి పిట్ట రామారావు విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన వీధుల్లో పర్యటిస్తూ ఓట ర్లను కలుసుకున్నారు.

ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని కోరుతూ తమ ఎన్నికల గుర్తు ఫ్యాన్‌కు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా అభ్యర్థులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు. ప్రజలకు అందుబాటులో ఉం టూ వారి సమస్యలపై స్పందించే ప్రజాప్రతిని ధులుగా పనిచేస్తామని తెలిపారు. ఎన్నికల్లో తమకు ఒక్క అవకాశం ఇచ్చి గెలిపిస్తే ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునేలా పనిచేస్తామని అన్నారు. రెండు గ్రామాల్లోనూ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో ప్రచారంలో పాల్గొనడంతో ఎన్నికల సందడి నెలకొంది. అభ్యర్థులకు మద్దతుగా కార్యకర్తలు నినాదాలు చేస్తూ ఉత్సాహంగా ప్రచారాన్ని కొనసాగించారు. గ్రామాల్లో ఓటర్లను వ్యక్తిగతంగా కలిసి తమ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని కోరుతూ ప్రచారాన్ని మరింత ముమ్మరం చేశారు.

- ఎద్దుల బండిపై వెళ్తుండగా ప్రమాదం.. ప్రాణాలతో బయటపడిన తండ్రీకొడుకులు
- విద్యుత్ షాక్‌తోనే మృతి చెందాయి: పశువైద్యాధికారి డాక్టర్ తరుణ్
- పశువైద్య నివేదిక ఆధారంగా పరిహారం అందేలా చర్యలు సబ్ ఇంజనీర్ శివకిరణ్

విద్యుత్ షాక్‌తో రెండు ఎద్దుల మృతి

ప్రజా భూమి ప్రతినిధి-రాజవొమ్మంగి





రాజవొమ్మంగిలో తెగిపడిన విద్యుత్ తీగలు తగిలి రెండు ఎద్దులు మృతి చెందాయి. మరిచెట్ల దేవుడు కుమారుడు మరిచెట్ల శ్రీను, ఆయన కుమారుడు వెంకట మురళి కలిసి ఎద్దుల బండిపై వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. మార్గమధ్యంలో తెగిపడి ఉన్న విద్యుత్ తీగలు తగలడంతో రెండు ఎద్దులు అక్కడికక్కడే మృతి చెందగా, బండిపై ఉన్న తండ్రీకొడుకులు ప్రాణాలతో బయటపడ్డారు. వ్యవసాయ పనులకు ఆధారమైన రెండు ఎద్దులను కోల్పోవడంతో బాధిత కుటుంబం ఆవేదన వ్యక్తం చేసింది. ఘటనపై ప్రజాభూమి రిపోర్టర్ వినయ్ పశువైద్యాధికారి డాక్టర్ తరుణ్‌ను వివరణ కోరగా, రెండు ఎద్దులు విద్యుత్ షాక్ కారణంగానే మృతి చెందినట్లు తెలిపారు. ప్రమాదం జరిగిన మార్గంలో శు క్రవారం సాయంత్రం ఆరు గంటల సమ యంలో పశువులను తీసుకెళ్లినప్పుడు ఎలాంటి ఇబ్బంది కనిపించలేదని స్థానికులు తెలిపారు. విద్యుత్ శాఖ సబ్ ఇంజనీర్ శివకిరణ్‌ను ప్రజా భూమి రిపోర్టర్ వినయ్ సంప్రదించగా, రాజ వొమ్మంగి ఏఈ సెలవులో ఉన్నారని తెలిపారు. తమ పరిధిలోని విద్యుత్ లైన్లను సిబ్బంది ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారని వివరించారు. రాత్రి కురిసిన వర్షాల కారణంగా విద్యుత్ తీగలు తెగిపడి ఉండవచ్చని అభిప్రాయపడ్డారు. అయితే తీగలు తెగిపడటానికి గల కచ్చితమైన కారణం నిర్ధారణ కావాల్సి ఉంది. పశువైద్యాధికారుల నివేదిక ఆధారంగా విద్యుత్ శాఖ నిబంధనల మేరకు బాధిత కుటుంబానికి రావాల్సిన పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని శివకిరణ్ తెలిపారు. వ్యవసాయ పనులకు ఆధారమైన రెండు ఎద్దులను కోల్పోవడంతో బాధిత కుటుంబం ఆర్థికంగా నష్టపోయింది. పశువైద్యాధికారుల నివేదిక ఆధారంగా పరిహారం అందించే ప్రక్రియను పూర్తి చేసి బాధిత కుటుంబాన్ని ఆదుకోవాల్సిన అవసరం ఉంది. ఇటువంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా విద్యుత్ శాఖ గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ లైన్ల పర్యవేక్షణను మరింత విస్తృతం చేయడంతో పాటు వర్షాలు, ఈదురుగాలుల సమయంలో ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

ఎన్నికల ఏర్పాట్లపై జనరల్ అబ్జర్వర్‌తో అధికారుల చర్చ



ప్రజా భూమి ప్రతినిధి-రంపచోడవరం


పోలవరం జిల్లా ఎన్నికల జనరల్ అబ్జర్వర్ అంబేద్కర్‌ను శనివారం స్థానిక పీఎంఆర్‌సీ అతిథి గృహంలో జిల్లా కలెక్టర్ కె.దినేష్ కుమార్, జాయింట్ కలెక్టర్ ఎస్.ప్రశాంత్ కుమార్, సబ్ కలెక్టర్ డి.పృథ్వీరాజ్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భం గా ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేశారు. అనంతరం జిల్లాలో నిర్వహించనున్న జడ్పీటీ సీ, ఎంపీటీసీ ఎన్నికల ఏర్పాట్లు, సిబ్బంది శిక్ష ణ, ఎన్నికల నిర్వహణకు తీసుకుంటున్న చర్య లపై చర్చించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ఎన్నికలను ప్రశాం తంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు చేపట్టిన ఏర్పాట్లను కలెక్టర్ వివరించారు.

పాపికొండల జాతీయ పార్కులో

జింక వేట.. ఇద్దరి అరెస్ట్!

విల్లు, బాణాలతో జింకను వేటాడిన నిందితులు.. 15 రోజుల రిమాండ్

ప్రజాభూమి ప్రతినిధి-వి.ఆర్.పురం.



పోలవరం జిల్లా వి.ఆర్.పురం అటవీ పరిధి లోని పాపికొండల జాతీయ పార్కులో జింకను వేటాడిన ఇద్దరు వ్యక్తులను అటవీ శాఖ అధికారులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి జింక కళేబరంతో పాటు వేటకు ఉపయోగిం చిన విల్లు, బాణాలను స్వాధీనం చేసుకున్నా రు. అటవీ శాఖ అధికారులు తెలిపిన వివ రాల ప్రకారం.. అక్టోబర్ 29న జీడిగుప్ప బీట్ పరిధిలోని దారపల్లి గ్రామ సమీపంలోని కొల్లేటంగు వాగు ప్రాంతంలో పాపికొండల జాతీయ పార్కు పరిధిలో సాంబర్ జింకను విల్లు, బాణాలతో వేటాడినట్లు అధికారులు గుర్తించారు. ఈ ఘటనకు సంబంధించి వి.ఆర్.పురం మండలం బొడుగుంపు గ్రామానికి చెందిన కుర్ర రాముడు (కోసయ్య కుమారుడు), నాగేంద్రపురం గ్రామానికి చెందిన మాడివి గోవింద్ (సింగయ్య కుమా రుడు)లను సంఘటనా స్థలంలోనే అదుపు లోకి తీసుకున్నారు. నిందితుల నుంచి వేటా డిన జింక కళేబరంతో పాటు వేటకు ఉప యోగించిన విల్లు, బాణాలను స్వాధీనం చేసు కున్నారు. ఈ ఘటనపై వన్యప్రాణి సంరక్షణ చట్టం-1972 ప్రకారం కేసు నమోదు చేసి, చట్టంలోని పలు సెక్షన్ల కింద చర్యలు చేపట్టారు. అక్టోబర్ 30న ఇద్దరు నిందితుల ను రంపచోడవరం ప్రథమ శ్రేణి న్యాయ స్థానంలో హాజరుపరచగా, న్యాయస్థానం 15 రోజుల పాటు న్యాయ విచారణ నిర్బంధం విధించింది. దీంతో వారిని రాజమహేం ద్రవరం కేంద్ర కారాగారానికి తరలించారు. వి.ఆర్.పురం అటవీ క్షేత్ర అధికారి ఎస్. రామ కృష్ణ, ఉప అటవీ అధికారి ఎం. శ్రీనివాసరెడ్డి, జీడిగుప్ప విభాగ అటవీ శాఖ అధికారి ఎస్. ఆదిలక్ష్మి ఆధ్వర్యంలోని బృందం ఈ దాడి నిర్వహించింది. చింతూరు అటవీ విభాగాధికా రి సంకేత్ సునీల్ గరుడు, ఐ.ఎఫ్.ఎస్. ఆదేశాల మేరకు ఈ చర్యలు చేపట్టినట్లు అటవీ శాఖ అధికారులు వెల్లడించారు.

- పంటల రక్షణకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి
- రైతులకు అండగా వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో ఉండాలి
- భారీ వర్షాల ప్రభావిత ప్రాంతాల్లో ప్రత్యేక దృష్టి సారించాలి
- రైతులు అధైర్యపడవద్దు, ప్రభుత్వం అండగా ఉంటుంది- మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

రైతులంతా అప్రమత్తంగా ఉండాలి

ప్రజాభూమి ప్రతినిధి-అమరావతి

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం మరింత బలపడి తుఫానుగా మారే అవకాశ ముున్న నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా రైతులంతా అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర వ్యవసాయ, పశుసంవర్ధక, మత్స్య శాఖల మంత్రి కింజ రాపు అచ్చెన్నాయుడు సూచించారు. భారత వాతావరణ శాఖ అంచనాల ప్రకారం నవంబర్ 2వ తేదీ సాయంత్రానికి తుఫాను ఆంధ్రప్రదేశ్ తీరానికి సమీపించే అవకాశం ఉందని, నవంబర్ 2, 3 తేదీల్లో కోస్తాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే సూచనలున్నాయని తెలిపారు. ముఖ్యంగా కృష్ణా, గుంటూరు, బాపట్ల, ఎన్టీఆ ర్, పల్నాడు, ఏలూరు, పశ్చిమ గోదావరి, ప్రకాశం, నెల్లూరు తదితర జిల్లాల రైతులు మరింత జాగ్రత్తగా ఉండాలని కోరారు. భారీ వర్షాల వల్ల పంటలకు నష్టం వాటిల్లకుండా రైతులు ముందస్తు చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. వరి, పత్తి, మిర్చి, ఉద్యాన పంటల పొలాల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుం డా కాలువలను సిద్ధం చేసుకోవాలని, కోతలు పూర్తయిన పంట ఉత్పత్తులను సురక్షిత ప్రాంతాలకు తరలించి తడవకుండా కాపాడు కోవాలని తెలిపారు. వాతావరణ పరిస్థితులు సాధారణ స్థితికి వచ్చే వరకు పంట కోతలు, పురుగుమందుల పిచికారీ, ఎరువుల వినియో గాన్ని వాయిదా వేసుకోవాలని సూచించారు. బలమైన గాలులు, పిడుగులు పడే సమయంలో రైతులు పొలాల్లోకి వెళ్లవద్దని, పశువులను సురక్షిత ప్రాంతాల్లో ఉంచాలని విజ్ఞప్తి చేశారు. మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లకుండా వాతావరణ శాఖ హెచ్చరి కలను తప్పనిసరిగా పాటించాలని కోరారు. వ్యవసాయ, ఉద్యానవన, పశు సంవర్ధక, మత్స్య శాఖల అధికారులు రైతులకు అన్ని విధాలా అండగా నిలవాలని మంత్రి స్పష్టం చేశారు. అధికారులు కార్యాలయాలకే పరిమితం కాకుండా గ్రామస్థాయిలో అందుబా టులో ఉంటూ పంటల సంరక్షణపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. వ్యవసాయ శాస్త్రవేత్తలతో సమన్వయం చేసుకొని పంట నష్టాన్ని తగ్గించే సాంకేతిక సూచనలు అందించాలని, అవసరమైన విత్తనాలు, ఇతర వ్యవసాయ ఉత్పాదకాలను సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు. వర్షాల ప్రభావంతో ఎదురయ్యే సమస్యలపై వెంటనే స్పందించాలని, రైతుల నుంచి అందే సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఉన్నతాధికారుల కు నివేదించాలని సూచించారు. ఇటీవల తుఫాను ప్రభావంతో ఇబ్బందులు ఎదుర్కొన్న రైతులు మరోసారి వర్షాల హెచ్చరికల నేపథ్యంలో ఆందోళన చెందవద్దని మంత్రి భరోసా ఇచ్చారు.

అడ్డతీగలలో నేడు పోస్టల్ బ్యాలెట్ పోలింగ్

-ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అవకాశం

ప్రజాభూమి ప్రతినిధి-అడ్డతీగల



నవంబర్ 5 జరగనున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు సంబం ధించి పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ ను అడ్డతీగల మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో నిర్వహించనున్నట్లు రిటర్నిం గ్ అధికారి డి.ఎన్.వి. రమణ తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసేందుకు అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. అడ్డతీ గల మండల పరిధిలో ఓటు హక్కు కలిగిన సర్వీస్ ఓటర్లు, ఎన్ని కల విధుల్లో పాల్గొంటున్న సిబ్బంది తమ గుర్తింపు ఆధారాలతో హాజరై ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన సూచించారు.

అక్రమ మద్యం విక్రయాలపై ఎక్సైజ్ ఉక్కుపాదం

ఈ ఏడాది 93 కేసులు.. 93 మంది అరెస్టు

114.96 లీటర్ల మద్యం స్వాధీనం.. 68 మంది బైండోవర్

ప్రజాభూమి ప్రతినిధి-పోలవరం జిల్లా



అక్రమ మద్యం విక్రయాలపై రంపచోడవరం ఎక్సైజ్ శాఖ నిఘా ముమ్మరం చేసింది. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రత్యేక బృందంతో కలిసి ఈ ఏడాది ఇప్పటివరకు 93 బెల్ట్ షాపు కేసులు నమోదు చేసి, 93 మందిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ తెలిపారు. వారి నుంచి 114.96 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. గడిచిన రెండు నెల ల్లోనే 24 కేసులు నమోదు చేసి, 24 మందిని అరెస్టు చేయడంతో పాటు 25.56 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నామన్నారు. అక్రమ విక్రయాలకు సంబంధించి 68 మందిని తహశీల్దార్ల ఎదుట హాజరుపరిచి బైండోవర్ చేసినట్లు తెలిపారు. మద్యం దుకాణాల్లో నిబంధనల అమలుపై 179 డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించామని, కల్తీ మద్యం నిర్ధారణకు సేకరించిన 26 నమూనాల పరీక్షల్లో ఎలాంటి అక్రమాలు గుర్తించలేదని వివరించారు. ఎక్కడైనా బెల్ట్ షాపులు నిర్వహి స్తున్నట్లు తెలిస్తే ఎక్సైజ్ అధికారులకు సమాచారం అందించాలని, అక్రమ విక్రయాలకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ హెచ్చరించారు.

పోలవరం నిర్వాసితుల సమస్యలపై సీపీఎం పోరాటం

-సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు



ప్రజాభూమి ప్రతినిధి-వి.ఆర్.పురం

పోలవరం నిర్వాసితులకు న్యాయమైన పరిహారం, గిరిజనుల హక్కులు, పోడు భూములకు పట్టాలు, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కోసం సీపీఎం నిరంతరం పోరాడుతోందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు అన్నారు. సీపీఎం బలపరిచిన జడ్పీటీసీ, ఎంపీటీసీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. శనివారం వి.ఆర్.పురం మండలంలో సీపీఎం ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన చొప్పల్లి, రామవరం, వడ్డిగూడెం, వి.ఆర్.పురం, రాజుపేట, రేకపల్లి ప్రాంతాల్లో ర్యాలీ నిర్వహించి ప్రజలను కలుసుకున్నారు. పోలవరం సర్వే, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ, రహదారులు, తాగునీరు, విద్యుత్ తదితర సమస్యలను ప్రభుత్వం పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. రామవరంపాడు గ్రామంలోని 104 కుటుంబాలకు పోలవరం సర్వే పూర్తిచేసి, రేకపల్లి, అన్నవరం, శుద్ధిగూడెం, ఉమ్మడివరం, ఎస్సీ కాలనీ, గొల్లగూడెం గ్రామాల్లో తక్షణమే సర్వే నిర్వహించి నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అందించాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరా డే సీపీఎం అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏవీ నాగేశ్వరరావు, రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్, జడ్పీటీసీ అభ్యర్థి కారం సుజాత, ఎంపీటీసీ అభ్యర్థులు, సీపీఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రజాభూమి

జనరల్ 16

ఆదివారం 1 నవంబరు 2026

స్థానిక ఎన్నికల్లో ప్రజలకు చెప్పుకోవడానికి చంద్రబాబుకు ఏమీ లేదు

సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ హామీలు అట్టర్ ఫ్లాప్

యలహంక ఆస్తులపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు

మాజీ మంత్రి పేర్ని నాని విమర్శలు

ప్రజాభూమి ప్రతినిధి-మచిలీపట్నం

స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలకు చెప్పుకోవడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి ఏమీ లేదని, ప్రజల నుంచి ఆశించిన మద్దతు లభించకపోవడంతోనే వైఎస్సార్సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై విషప్రచారానికి దిగుతున్నారని మాజీ మంత్రి, వైఎస్సార్సీపీ నాయకుడు పేర్ని వెంకట్రామయ్య (నాని) విమర్శించారు. ఎన్నికల్లో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసే కుట్రలకు పాల్పడుతూ, ప్రజల దృష్టిని మళ్లించేందుకు వివాదాలను తెరపైకి తెస్తున్నారని ఆరోపించారు. శనివారం మచిలీపట్నంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

ప్రతిపక్ష అభ్యర్థులను నామినేషన్లు వేయకుండా అడ్డుకోవడంతో పాటు, పోలింగ్ కేంద్రాల్లో ప్రతిపక్ష పార్టీల ఏజెంట్లు లేకుండా చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. పోలింగ్ ఏజెంట్లు పోలీసుల నుంచి క్లియరెన్స్ తీసుకోవాలనే నిబంధన ఎక్కడైనా ఉందా? అని ప్రశ్నించారు. ఎన్నికల్లో జరుగుతున్న అక్రమాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే యలహంక ఆస్తుల వ్యవహారంపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు.

యలహంక ఆస్తి జగన్ అత్తగారిదే

యలహంకలోని ఆస్తి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్తగారు డాక్టర్ సుగుణమ్మకు చెందినదని పేర్ని నాని స్పష్టం చేశారు. భారతిగారి తల్లిదండ్రులు గంగిరెడ్డి, సుగుణమ్మ ఇద్దరూ వైద్యులని, కడప, అనంతపురం జిల్లాల్లో వైద్యులుగా మంచి పేరు సంపాదించడంతో పాటు ఆర్థికంగా స్థిరపడ్డారని తెలిపారు. తమ పిల్లలను బెంగళూరులో చదివించిన నేపథ్యంలో అక్కడ ఆస్తులు కొనుగోలు చేశారని వివరించారు. ఇందుకు సంబంధించిన పత్రాల్లో పూర్తి వివరాలు ఉన్నాయని పేర్కొన్నారు.సుమారు 20 ఏళ్ల క్రితమే జగన్‌కు చెందిన కంపెనీ యలహంకలోని స్థలాన్ని లీజుకు తీసుకుని రెండు గెస్ట్‌హౌస్‌లు నిర్మించిందని తెలిపారు. బెంగళూరుకు వెళ్లినప్పుడు షర్మిల ఒక గెస్ట్‌హౌస్‌లో ఉండాలని సూచించారని, అక్కడి నిర్మాణాలకు సంబంధించిన బిల్లులు, ఇతర ఖర్చులను ఇప్పటికీ జగన్ కంపెనీనే భరిస్తోందని చెప్పారు. అలాంటప్పుడు ఆ ఆస్తి తనదేనని చెప్పడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. జగన్ షర్మిలకు రాశారని చెబుతున్న ఎంవోయూలో కూడా యలహంక ఆస్తి ప్రస్తావన లేదన్నారు.

చెల్లెలికి రూ.230 కోట్లు ఇచ్చిన జగన్

దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి మరణం తర్వాత కూడా జగన్ తన చెల్లెలు షర్మిలకు సుమారు రూ.230 కోట్ల విలువైన ఆస్తులు ఇచ్చారని పేర్ని నాని పేర్కొన్నారు. వివాహమై పాతికేళ్లు గడిచిన తర్వాత కూడా చెల్లెలికి ఇంత పెద్ద మొత్తంలో ఆస్తులు ఇచ్చే అన్న ఎక్కడైనా ఉంటాడా? అని ప్రశ్నించారు.భద్రతా కారణాల దృష్ట్యా యలహంకలో పెళ్లి వేడుక నిర్వహించవద్దని ముందుగానే చెప్పినట్లు తెలిపారు. తన కుమార్తెల వివాహాల విషయంలోనూ ఇదే నిర్ణయం తీసుకుంటానని జగన్ స్పష్టం చేశారని అన్నారు. అయినప్పటికీ యలహంకలోనే పెళ్లి అంటూ షర్మిల వివాహ ఆహ్వాన పత్రికలు ముద్రించడం వెనుక ఉద్దేశం ఏమిటని ప్రశ్నించారు. హైదరాబాద్‌లోని లోటస్‌పాండ్ నివాసాన్ని ఉపయోగించుకోవాలని జగన్ లేఖ రాసినా షర్మిల ఎందుకు వినియోగించుకోలేదని నిలదీశారు.

చంద్రబాబు తన కుటుంబానికి ఏం చేశారు?

చంద్రబాబు తన కుటుంబ సభ్యులకు చేసిన మేలు గురించి ముందుగా ఆలోచించుకోవాలని పేర్ని నాని వ్యాఖ్యానించారు. తన తల్లిదండ్రులను ఆదుకున్నారా? తన ఇద్దరు చెల్లెళ్లకు ఆస్తుల్లో వాటా ఇచ్చారా? అని ప్రశ్నించారు. తనకు లక్ష కోట్ల ఆస్తి ఉందని చంద్రబాబు చెప్పుకున్నారని, మరి తన తమ్ముడికి, ఇద్దరు చెల్లెళ్లకు ఎంత వాటా ఇచ్చారో వెల్లడించాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ మాదాపూర్‌లోని సుమారు ఏడు ఎకరాల భూమిని చంద్రబాబు తల్లి ఆస్తి లోకేష్‌కు మాత్రమే బహుమతిగా ఎందుకు ఇచ్చారని ప్రశ్నించారు. ఆమెకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు కూడా ఉండగా అందరికీ సమానంగా ఎందుకు పంచలేదు అని గుర్తుచేశారు.

సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ హామీలు విఫలం

చంద్రబాబు పాలన పూర్తిగా విఫలమైందని పేర్ని నాని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ హామీలు అమలులో విఫలమయ్యాయని, మేనిఫెస్టోలో ప్రకటించిన 143 హామీలు అట్టర్ ఫ్లాప్ అయ్యాయని ఆరోపించారు. రాష్ట్రంలోని ఏ వర్గం కూడా ప్రభుత్వ పాలనపై సంతృప్తిగా లేదని అన్నారు.

ప్రజా పోరాటాల నేపథ్యంతో జడ్పీటీసీ బరిలో లోతా రామారావు

- రాజవొమ్మంగిలో సీపీఎం ప్రచారానికి భారీగా తరలివచ్చిన కార్యకర్తలు
- రహదారుల కోసం చేసిన పోరాటాలను గుర్తుచేసిన నాయకులు





ప్రజాభూమి ప్రతినిధి-రాజవొమ్మంగి

రాజవొమ్మంగి జడ్పీటీసీ ఎన్నికల ప్రచారంలో సీపీఎం అభ్యర్థి లోతా రామారావు తన గత ప్రజా పోరాటాలను ప్రధానంగా ప్రస్తావిస్తున్నారు. శనివారం రాజవొమ్మంగి వారపు సంతలో నిర్వహించిన ఎన్నికల ప్రచారానికి మండలంలోని పలు గ్రామాల నుంచి గిరిజనులు, మహిళలు, యువకులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఎర్రజెండాలతో నిర్వహించిన ర్యాలీ మండల కేంద్రంలో సందడిగా సాగింది. ప్రచారంలో భాగంగా లోతా రామారావు ప్రజలను కలుసుకుని తనకు మద్దతు ఇవ్వాలని కోరారు.

పదవులు లేకున్నా ప్రజా సమస్యలపై పోరాటం

గిరిజన ప్రాంతాల్లో రహదారులు, మౌలిక సదుపాయాలు, ప్రజల సమస్యల పరిష్కారం కోసం లోతా రామారావు గతంలో చేపట్టిన ఉద్యమాలను సీపీఎం నాయకులు గుర్తుచేశారు. ముఖ్యంగా ఏలేశ్వరం గొంటివానిపాలెం రహదారి నిర్మాణం కోసం మూడు రోజుల పాటు రోడ్డుపైనే నిరసన చేపట్టిన విషయాన్ని ప్రస్తావించారు. ఏళ్ల తరబడి ప్రజలు ఎదుర్కొన్న రహదారి సమస్య పరిష్కారానికి ఆయన చేసిన పోరాటం కీలకమని పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై పనిచేసిన అనుభవంతోనే ఈసారి జడ్పీటీసీ ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్లు తెలిపారు.

గిరిజన గ్రామాల అభివృద్ధిపైనే దృష్టి


ప్రచార కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర నాయకుడు వి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యాలు, జీవో నంబర్ 3 అమలు, ఆదివాసీల హక్కుల పరిరక్షణ కోసం లోతా రామారావు నిరంతరం పోరాడుతున్నారని తెలిపారు. ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో ఆయన ముందుంటారని పేర్కొన్నారు. ఎన్నికల్లో అభ్యర్థుల గత పనితీరును పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని ఓటర్లను కోరారు.

ప్రజలను కలుసుకుంటూ ప్రచారం

వారపు సంతకు వచ్చిన వివిధ గ్రామాల ప్రజలను లోతా రామారావు ఆప్యాయంగా పలకరించారు. స్థానికంగా ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకుంటూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆదివాసీ సంఘాల మద్దతుతో పోటీ చేస్తున్న స్వతంత్ర అభ్యర్థులకు కూడా మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం, ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. రాజవొమ్మంగి జడ్పీటీసీ స్థానానికి వివిధ పార్టీల అభ్యర్థులు పోటీలో ఉన్న నేపథ్యంలో లోతా రామారావు తన ప్రజా ఉద్యమాల అనుభవాన్ని ఎన్నికల ప్రచారంలో ముందుకు తీసుకెళ్తున్నారు. శనివారం జరిగిన ప్రచార కార్యక్రమంతో మండలంలో సీపీఎం ఎన్నికల ప్రచారం మరింత ఊపందుకుంది.

రాజవొమ్మంగిలో రసవత్తరంగా పరిషత్ ఎన్నికల పోరు!

- కూటమిలో పోటీ.. వైసీపీ, సీపీఎంలకు కలిసొచ్చేనా?
- మూడు స్థానాల్లో టీడీపీ, జనసేన మధ్య పోటీ.. ఓట్ల చీలికపై ఆసక్తి



ప్రజాభూమి ప్రతినిధి-రాజవొమ్మంగి

రాజవొమ్మంగి మండలంలో పరిషత్ ఎన్నికల ప్రచారం ఊపందుకోవడంతో రాజకీయ వాతావరణం వేడెక్కుతోంది. అభ్యర్థులు గెలుపే లక్ష్యంగా ప్రచారాన్ని ముమ్మరం చేస్తుండగా ఏ పార్టీ విజయం సాధిస్తుందన్న ఉత్కంఠ నెలకొంది. ముఖ్యంగా కూటమిలో భాగస్వాములైన తెలుగుదేశం, జనసేన పార్టీలు కొన్ని ఎంపీటీసీ స్థానాల్లో విడివిడిగా పోటీ చేస్తుండటం రాజకీయంగా ఆసక్తి రేపుతోంది. ఈ పరిణామం వైసీపీ, సీపీఎంలకు అనుకూలంగా మారే అవకాశముందన్న చర్చ సాగుతోంది. మండలంలోని 11 ఎంపీటీసీ స్థానాలకు గాను మూడు స్థానాల్లో టీడీపీ, జనసేన అభ్యర్థులు బరిలో నిలిచారు. రెండు పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు కుదరకపోవడంతో ఆయా స్థానాల్లో పోటీ మరింత ఆసక్తికరంగా మారింది. కూటమి మద్దతుదారుల ఓట్లు చీలితే ప్రత్యర్థి పార్టీలకు ప్రయోజనం చేకూరే అవకాశముంది. అయితే ఈ పరిస్థితిని వైసీపీ, సీపీఎం అభ్యర్థులు ఎంతవరకు తమకు అనుకూలంగా మలుచుకుంటారన్నది ప్రశ్నార్థకంగా మారింది.

ఓట్ల చీలికతో మారనున్న సమీకరణాలు?


ఒకే కూటమిలో ఉన్న రెండు పార్టీలు పరస్పరం పోటీ పడుతుండటంతో ఆయా స్థానాల్లో గెలుపోటములపై అంచనాలు ఆసక్తికరంగా మారాయి. టీడీపీ, జనసేన అభ్యర్థులు తమ బలాన్ని నిరూపించుకునేందుకు ప్రయత్నిస్తుండగా వైసీపీ, సీపీఎం అభ్యర్థులు సైతం ఓటర్ల మద్దతు కోసం ప్రచారం చేస్తున్నారు. ముఖ్యంగా పోటీ తీవ్రంగా ఉండే స్థానాల్లో కొద్దిపాటి ఓట్ల తేడా కూడా ఫలితాన్ని ప్రభావితం చేసే అవకాశముంది.

చివరకు ఓటరు ఎటువైపు?

పార్టీల బలాబలాలతో పాటు అభ్యర్థుల వ్యక్తిగత ఆదరణ, ప్రజలతో ఉన్న సంబంధాలు, గతంలో చేసిన సేవలు, స్థానిక సమస్యలపై స్పందించిన తీరు ఈ ఎన్నికల్లో కీలకం కానున్నాయి. ప్రచారంలో ఎవరు ఎంత ధీమా వ్యక్తం చేసినా తుది నిర్ణయం ఓటర్లదే. కూటమి పార్టీల మధ్య పోటీ వైసీపీ, సీపీఎంలకు అవకాశంగా మారుతుందా? లేక టీడీపీ, జనసేన అభ్యర్థులు తమ బలాన్ని నిలబెట్టుకుంటారా? అన్నది ఎన్నికల ఫలితాలతో తేలనుంది.

ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్

- ఓటర్లందరూ నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించు కోవాలి
- జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్



ప్రజాభూమి ప్రతినిధి-కాకినాడ

ఆరు పట్టణ స్థానిక సంస్థల పరిధిలో నవంబర్ 1వ తేదీ ఆదివారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్న నేపథ్యంలో ఓటర్లందరూ తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.... ఆరు పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ కోసం మొత్తం 321 పోలింగ్ కేంద్రాలను గుర్తించామని తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో ఓటర్లు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంతంగా ఓటు హక్కును వినియోగించుకునేందుకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించామని పేర్కొన్నారు. ర్యాంపులు, తాగునీరు, షామియానాలు తదితర సదుపాయాలు ఏర్పాటు చేశామని తెలిపారు. సమస్యాత్మకంగా గుర్తించిన పోలింగ్ కేంద్రాల్లోపటిష్టమైన భద్రతా ఏర్పాట్లతో పాటు వెబ్‌కాస్టింగ్, వీడియోగ్రఫీ సదుపాయాలు కల్పించామని వెల్లడించారు. ఓటర్లు ఎటువంటి భయాందోళనలకు గురికాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.

ఓటు వేసేందుకు ఎన్నికల సంఘం నిర్దేశించిన గుర్తింపు పత్రాలను తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు. ఆధార్ కార్డు, ఫోటో ఓటరు గుర్తింపు కార్డుతో పాటు ఎన్నికల సంఘం ఆమోదించిన సుమారు 20 రకాల ప్రత్యామ్నాయ గుర్తింపు పత్రాల్లో ఏదైనా ఒకదాన్ని ఉపయోగించి ఓటు వేయవచ్చని తెలిపారు.ఈ ఎన్నికల్లో ప్రతి ఓటరు కు రెండు బ్యాలెట్ పత్రాలను అంద జేయ నున్నట్లు తెలిపారు. వీటిలో ఒకటి చైర్‌పర్సన్ ఎన్నికకు, మరొకటి వార్డు సభ్యుడి ఎన్నికకు సంబంధించినదని వివరించారు. ఓటర్లు తమకు నచ్చిన అభ్యర్థులకు రెండు బ్యాలెట్ పత్రాలపై ఓటు వేసి, వాటిని నిర్దేశించిన సంబంధిత బ్యాలెట్ బాక్సుల్లో వేయాలని సూచించారు.ఎన్నికల అనంతరం నవంబర్ 3వ తేదీన ఓట్ల లెక్కింపు చేపట్టనున్నట్లు తెలిపారు. కౌంటింగ్ ప్రక్రియను పారదర్శకంగా, ప్రశాంతంగా, సజావుగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పటిష్టంగా చేపట్టినట్లు పేర్కొన్నారు.

ఎన్నికల కుట్రల నుంచి డైవర్షన్ కోసమే యలహంక ఆస్తులపై విషప్రచారం

- చంద్రబాబు కుట్రలో భాగంగానే వైఎస్ జగన్‌పై షర్మిల తప్పుడు ప్రచారం
- మాజీ మంత్రి పేర్ని నాని స్పష్టీకరణ
- రేపు మున్సిపల్ ఎన్నికలున్నాయనగా, బెంగళూరు ఆస్తి తనదే అంటూ ట్వీట్ దీంట్లో భాగమే
- యలహంక ఆస్తి జగన్‌గారి అత్తగారు డాక్టర్ సుగుణమ్మ గారిది
- దీనికి సంబంధించిన డాక్యుమెంట్లో చాలా స్పష్టంగా ఉంది
- జగన్ గారి కంపెనీ 20ఏళ్ల కిందటే యలహంక స్థలాన్ని లీజుకు తీసుకుంది
- ఆ స్థలంలో ఉన్న ప్రతి నిర్మాణానికీ ఇప్పటికీ బిల్లులు కడుతున్నది జగన్‌గారి కంపెనీయే
- మీడియాకు వివరాలు వెల్లడించిన మాజీ మంత్రి పేర్ని నాని

ప్రజాభూమి ప్రతినిధి-మచిలీపట్నం

స్థానిక ఎన్నికల్లో ప్రజలకు చెప్పుకోవడానికి చంద్రబాబు దగ్గర ఏమీ లేక ఒకవైపు ఎన్నికల్లో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసే కుట్రలకు పాల్పడుతూ, మరోవైపు వైఎస్ జగన్ గారిపై విషప్రచారం చేయిస్తున్నాడని మాజీ మంత్రి పేర్ని నాని మండిపడ్డారు. మచిలీపట్నంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ ఎన్నికల అక్రమాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే బెంగళూరులోని యలహంక ఆస్తుల పేరుతో కొత్త వివాదాన్ని తెరపైకి తెచ్చారన్నారు. చంద్రబాబుకు ఎప్పుడు రాజకీయంగా అవసరం వస్తే అప్పుడు షర్మిలగారు తెరపైకి రావడం, జగన్‌గారిపై ఆరోపణలు చేయడం రివాజుగా మారిందన్నారు. మున్సిపల్ ఎన్నికలకు ముందు బెంగళూరు ఆస్తి తనదేనంటూ షర్మిల గారు ట్వీట్ చేయడం కూడా ఈ రాజకీయ పరిణామాల్లో భాగమేనని పేర్ని నాని స్పష్టం చేశారు.

ప్రజలకు రెండున్నరేళ్లలో ఏం చేశాడో చెప్పుకోలేక..

స్థానిక ఎన్నికల్లో ప్రజలకు చెప్పుకోవడానికి చంద్రబాబు దగ్గర ఏమీ లేదు, ప్రజల మద్దతు కూడా లేదు. సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ హామీలు అట్టర్ ఫ్లాప్ అయ్యాయి, మేనిఫెస్టోలో ఇచ్చిన 143 హామీల్లో ఒక్కటీ సక్రమంగా అమలు చేయలేదు. రాష్ట్రంలో ఏ వర్గం కూడా సంతోషంగా లేదు, ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఉంది. అందుకే ఒకవైపు ఎన్నికల్లో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసే కుట్రలకు పాల్పడుతూ, మరోవైపు వైఎస్ జగన్ గారిపై విషప్రచారం చేయిస్తున్నారు. ప్రతిపక్ష అభ్యర్థులను నామినేషన్లు వేయకుండా అడ్డుకోవడమే కాకుండా, పోలింగ్ కేంద్రాల్లో ప్రతిపక్ష ఏజెంట్లు కూడా లేకుండా చేయాలని కుట్ర చేస్తున్నారు. అసలు పోలీసుల నుంచి ఎన్నికల ఏజెంట్లు క్లియరెన్స్ తీసుకోవడం ఎప్పుడైనా విన్నామా? ప్రజాస్వామ్యంలో ఇలాంటి పరిస్థితులు ఎప్పుడూ ఉండకూడదు. ఈ ఎన్నికల అక్రమాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే బెంగళూరులోని యలహంక ఆస్తుల పేరుతో కొత్త వివాదాన్ని తెరపైకి తెచ్చారు. చంద్రబాబుకు ఎప్పుడు రాజకీయంగా అవసరం వస్తే అప్పుడు షర్మిలగారు తెరపైకి రావడం, జగన్‌గారిపై ఆరోపణలు చేయడం జరుగుతోంది. చంద్రబాబు రాజకీయ ప్రయోజనాలకు అనుగుణంగానే ఈ ప్రచారం సాగుతోందన్న అనుమానాలు బలపడుతున్నాయి. మున్సిపల్ ఎన్నికలకు ముందు బెంగళూరు ఆస్తి తనదేనంటూ షర్మిలగారు ట్వీట్ చేయడం కూడా ఈ రాజకీయ పరిణామాల్లో భాగమే.

నామినేషన్ దశ నుంచే అక్రమాలు మొదలు:

నామినేషన్ల దశ నుంచే మొదలైన అక్రమాలు పోలింగ్ వరకు కొనసాగుతున్నాయి. టర్మ్ అయిపోయిన వెంటనే ఎన్నికలు పెట్టాల్సింది పోయి, ఈ చంద్రబాబు ప్రజలకు ఆలోచించే సమయం కూడా ఇవ్వకుండా ఒకదాని మీద ఒకటి ఎన్నికలు పెడుతూ ఎన్ని పాపాలు, దుర్మార్గాలు చేసైనా గెలవాలని కుట్ర పన్నుతున్నాడు. కొంతమంది ఐపీఎస్‌ల నాయకత్వంలో కౌరవులు ద్రౌపదిని చెరబట్టినట్టుగా చంద్రబాబు ప్రజాస్వామ్యాన్ని వివస్త్రను చేసి నడిబజారులో నిలబెట్టాడు. హోంగార్డులతో కలిపి 65 వేల మంది పోలీసులు ఉంటే, రేపటి ఎన్నికల కోసం కేవలం 25 వేల మందిని మాత్రమే కేటాయించి, వైఎస్సార్సీపీ బలంగా ఉన్న ప్రాంతాల్లో వేల మందిని మోహరించి ప్రజల్లో అభద్రతాభావాన్ని సృష్టిస్తున్నారు. వ్యాపారుల నుంచి లంచాలు వసూలు చేసి మున్సిపల్ ఎన్నికల్లో ఓటర్లకు ఓటుకి రూ.2,000 చొప్పున పంచడానికి భారీఎత్తున రంగం సిద్ధం చేశారు. వైఎస్సార్సీపీ ఏజెంట్ల వివరాలు 5 రోజుల ముందే ఇవ్వాలని నిబంధన పెట్టడం దారుణం, హైకోర్టు ఆదేశాలంటే కూడా పోలీసులకు లెక్కలేకుండా పోయింది. అర్నబ్ తుపానులో ఈ చంద్రబాబు కేవలం పబ్లిసిటీ చేసుకుంటూ కూటమి ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకుంటున్నాడు, బాధిత ప్రజలను, రైతులను గాలికి వదిలేశారు. అర్నబ్ తుపాన్‌ని అడ్డం పెట్టుకుని పోలింగ్ కేంద్రాలకు కరెంట్ ఇవ్వకుండా అరాచకాలకు ప్లాన్ చేస్తున్నాడు. నాడు కౌరవ సభలో నోరు మెదపని భీష్ముడు, ద్రోణాచార్యుల పరిస్థితి తర్వాతి కాలంలో ఏమైందో, రేపటి రోజున బీజేపీ మాధవ్, ఎస్ఈసీ పునేఠ పరిస్థితి కూడా అలాగే ఉంటుంది.



యలహంక ఆస్తి భారతి గారి తల్లి డాక్టర్ సుగుణమ్మ గారిది:

యలహంకలోని ఆస్తి జగన్‌గారి అత్తగారు డాక్టర్ సుగుణమ్మగారిది. భారతిగారి తల్లిదండ్రులైన డాక్టర్ గంగిరెడ్డి, డాక్టర్ సుగుణమ్మ కడప, అనంతపురం జిల్లాల్లో మంచి పేరున్న వైద్యులు, అప్పట్లోనే మంచి ప్రాక్టీసుతో స్థితిమంతులుగా ఉన్నారు. తమ పిల్లలను అప్పట్లోనే బెంగళూరులో చదివించడంతో అక్కడ ఆస్తులు కొనుగోలు చేశారు. దీనికి సంబంధించిన పత్రాల్లో కూడా ఆ విషయం స్పష్టంగా ఉంది. జగన్‌గారి కంపెనీ సుమారు 20 ఏళ్ల క్రితమే ఆ స్థలాన్ని లీజుకు తీసుకుని రెండు గెస్ట్‌హౌస్‌లు నిర్మించింది. షర్మిలగారు బెంగళూరుకు వచ్చినప్పుడు అందులో ఒక గెస్ట్‌హౌస్‌లో ఉండాలని చెప్పారు. ఆ స్థలంలోని నిర్మాణాలకు సంబంధించిన బిల్లులు, ఇతర ఛార్జీలను ఇప్పటికీ జగన్‌గారి కంపెనీనే చెల్లిస్తోంది.వైఎస్సార్‌గారు మరణించిన తర్వాత కూడా జగన్‌గారు తన చెల్లెలికి దాదాపు రూ.230 కోట్లు ఇచ్చారు. పెళ్లై పాతికేళ్లు దాటిన తర్వాత కూడా ఇంత పెద్ద మొత్తంలో సోదరికి ఆర్థికంగా అండగా నిలిచే అన్నలు ఎక్కడైనా ఉంటారా? భద్రతా కారణాల దృష్ట్యా యలహంకలో కుమార్తె పెళ్లి వేడుక నిర్వహించవద్దని జగన్‌గారు ముందుగానే చెప్పారు. తన కుమార్తెల పెళ్లిళ్ల విషయంలో కూడా ఇదే నిర్ణయం తీసుకుంటానని స్పష్టం చేశారు. అయినా అక్కడే పెళ్లి అంటూ షర్మిలగారు పెళ్లి కార్డులు ముద్రించడం వెనుక ఉద్దేశం ఏమిటి? కుమార్తె పెళ్లిని కూడా రాజకీయ వివాదాలకు వేదికగా మార్చడం ఎంతవరకు సమంజసం? ఆ తర్వాత కూడా జగన్‌గారు లేఖ రాసి హైదరాబాద్‌లోని లోటస్‌పాండ్ ఇంటిని వినియోగించుకోవాలని చెప్పారు కదా? ఆ అవకాశాన్ని ఎందుకు వినియోగించుకోలేదని ప్రశ్నించారు.

చంద్రబాబు తన తోబుట్టువులకు ఏమిచ్చాడో చెప్పాలి

చెల్లి, యలహంక ఇళ్లు, మేనకోడలి పెళ్లి అంటూ వైఎస్ కుటుంబ వ్యవహారాలను చంద్రబాబు రాజకీయాలకు వాడుకుంటున్నాడు. ఒక కుటుంబంలో చిచ్చుపెట్టి, ఆడపిల్లలను రాజకీయ ప్రయోజనాల కోసం చంద్రబాబు బజారుకు లాగడం ఎంతవరకు సమంజసమో ప్రజలు కూడా గమనిస్తున్నారు. జగన్‌గారు తన చెల్లికి రూ.230 కోట్లు ఇచ్చారు, లక్ష కోట్ల ఆస్తి ఉందని చెప్పుకునే చంద్రబాబు తన తమ్ముడికి, ఇద్దరు చెల్లెళ్లకు ఎంత వాటా ఇచ్చారు? చంద్రబాబు తన తోబుట్టువులకు ఏనాడైనా కనీసం రూ.2 లక్షలైనా ఇచ్చారా? సొంత చెల్లికి కాలు ఫ్రాక్చర్ అయితే ఆస్పత్రికి వెళ్లి పరామర్శించలేదని ఆమె అల్లుడే ప్రెస్‌మీట్ పెట్టి చెప్పిన విషయాన్ని చంద్రబాబు మరిచిపోతే ఎలా? అత్తింటి వారిని వెంట తిప్పుకునే చంద్రబాబు తన తమ్ముడిని, ఇద్దరు చెల్లెళ్లను ఎందుకు పట్టించుకోవడం లేదు, తమ్ముడి కొడుకు పెళ్లికి తన హైదరాబాద్ ప్యాలెస్‌ను ఇచ్చారా? తన ప్రమాణ స్వీకారానికి ఏనాడైనా తోబుట్టువులను పిలిచారా, అమరావతిలో ఐదెకరాల్లో నిర్మిస్తున్న ప్యాలెస్ భూమిపూజకు చెల్లెళ్లను ఆహ్వానించారా? చంద్రబాబు కనీసం తల్లిదండ్రులకు కూడా బాధ్యతగా తిండిపెట్టలేదు. మాదాపూర్‌లోని సుమారు ఏడు ఎకరాల భూమిని తన తల్లి లోకేష్‌కు మాత్రమే ఎందుకు బహుమతిగా ఇచ్చారు, మిగిలిన వారసులకు వాటా ఎందుకు ఇవ్వలేదు? ముందు తన కుటుంబ ఆస్తుల పంపకాలపై చంద్రబాబు సమాధానం చెప్పాలి, ఆ తర్వాతే ఇతరుల కుటుంబ వ్యవహారాల గురించి మాట్లాడాలి. తన పాలన వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు జగన్‌గారిపై విషప్రచారాలు చేయడం, కుటుంబ వివాదాలను రాజకీయాలకు వాడుకోవడం మానుకుని ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంపై దృష్టి పెట్టాలని పేర్ని నాని హితవు పలికారు.